# దారి దీపం

## మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 3 - సంచిక 5 | ఫిబ్రవరి 2025 | వెల : రూ.15

గీత దాటుతున్న యు.జి.సి

బీజేపీ విజయం.. కాంగ్రెస్-ఆప్ అనైక్యత

పెద్దల సభలో పెద్దరికంగా ప్రజా పక్షాన

పుత్రోత్సాహం.. పిత్రోత్సాహం

విజన్ 2047 కాదు.. విభజన హామీలు అమలు కావాలి

ప్రజలను అవహేళన చేస్తున్న బడ్జెట్

ఆదర్శరాజ్యంలో ఆకలి మంటలు

రూ.129 లక్షల కోట్ల మోదీ అప్పు ఎవరి కోసం..

మోడీ ప్రభుత్వ వైఫల్యాలు : నిరుద్యోగం, అధిక ధరలు

భారతీయ ఫాసిజం పితామహుడు గోల్వాల్కర్

మనుస్మృతిని ధిక్కరించిన ఛత్రపతి శివాజీ !

దీర్ఘకాల వ్యూహంతో బీజేపీ.. తడబడుతున్న ప్రతిపక్షం

మోడీ-ట్రంప్ కౌగిలింతలు భారత్ ప్రతిష్టను పెంచవు

వీకెండ్ మ్యూజింగ్స్

యుద్ధం : ఎస్ఆర్ పృథ్వీ పద్యకావ్యం

నెల్సన్ మండేలా ఆత్మకథ

భారతీయ జర్నలిజం ధృవతార మానికొండ చలపతిరావు

ఉద్యమాల శిఖరం ఉద్దరాజు రామం

డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి తొలి కథ : మలుపు

ఫిబ్రవరి - 2025 పేజీలు : 44

# దారి దీపం
మాసపత్రిక

సంపుటి : 3 - సంచిక : 5


డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1). గీత దాటుతున్న యు.జి.సి.
- సంపాదకీయం 3
2). బీజేపీ విజయం.. కాంగ్రెస్-ఆప్ అనైక్యత
- తెలకపల్లి రవి 4
3). పెద్దల సభలో పెద్దరికంగా ప్రజా పక్షాన..
- ఎ.అజశర్మ 6
4). పుత్రోత్సాహం.. పిత్రోత్సాహం
- కె.శ్రీనివాస్ 8
5). విజన్ 2047 కాదు.. విభజన హామీలు
అమలు కావాలి - దిలీప్ రెడ్డి 9
6). ప్రజలను అవహేళన చేస్తున్న బడ్జెట్
- ప్రభాత్ పట్నాయక్ 12
7). ఆదర్శ రాజ్యంలో ఆకలి మంటలు
- క్రిస్టాఫ్ జాఫ్రెలాట్ 14
8). రూ.129 లక్షల కోట్ల మోదీ అప్పు
ఎవరి కోసం.. - ఎం.కోటేశ్వరరావు 17
9). నిరుద్యోగం అధిక ధరలు.. ఇవే మోడీ ప్రభుత్వ వైఫల్యాలు 19
10).భారతీయ ఫాసిజం పితామహుడు గోల్వాల్కర్ - అపూర్వానంద్ 20
11).మనుస్మృతిని ధిక్కరించిన ఛత్రపతి శివాజీ! - దేవరాజు మహరాజు 24
12.) దీర్ఘకాల వ్యూహంతో బీజేపీ.. తడబడుతున్న ప్రతిపక్షం - అజయ్ గుడవర్తి 25
13).మోడీ-ట్రంప్ కౌగిలింతలు భారత్ ప్రతిష్టను పెంచవు - సంజయ్ బారు 28
14). వీకెండ్ మ్యూజింగ్స్ - జీయస్ రాంమోహన్ 30
15). యుద్ధం : ఎస్ఆర్ పృథ్వీ పద్యకావ్యం - డాక్టర్ బులుసు వీఎస్ మూర్తి 32
16). నెల్సన్ మండేలా ఆత్మకథ - శ్రీధర్ దేస్ పాండే 33
17). భారతీయ జర్నలిజం ధృవతార మానికొండ చలపతిరావు
- కొమ్మాలపాటి శరచ్చంద్ర జ్యోతిశ్రీ 35
18). ఉద్యమాల శిఖరం ఉద్దరాజు రామం - సమీక్షకులు: సన్నిధానం నరసింహశర్మ 37
19).డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి తొలి కథ : మలుపు- కె.వి.యస్.వర్మ 38
20) లెనిన్ గురించి 'ఒక స్వాప్నికుని కథ' - నాగభూషణ్ 41
21) కార్టూన్స్ 43 22) కొత్త పుస్తకాలు స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**

## దారి దీపం
మాసపత్రిక

**మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి**

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495

సంపాదకీయం



# గీత దాటుతున్న యు.జి.సి.

ఉన్నత విద్యా వ్యవస్థ గురించి తెలిసిన వారందరికీ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి.) గురించి తెలిసిందే. యు.జి.సి. ఒక రాజ్యాంగ వ్యవస్థ కాదు. కేవలం చట్టబద్ధమైన సంస్థ మాత్రమే. అది చట్టం పరిధిలోనే వ్యవహరించాలి. చట్టం గీత దాటి నిబంధనలు రూపొందించే అధికారం దానికి లేదు. అవకాశమూ లేదు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ చట్టం ప్రకారం బోధనా సిబ్బంది అర్హతలు నిర్ణయించడం, కనీస విద్యా ప్రమాణాలను నిర్ధారించడం, విద్యా కార్యక్రమాలను సమన్వయం చేయడం వంటివి మాత్రమే వున్నాయి.

2025 జనవరి 26న యు.జి.సి. ఒక కొత్త నియమావళి ముసాయిదాను విడుదల చేసింది. అందులో అధ్యాపకులు, ఉన్నత విద్యలో ప్రమాణాలు సాధించే చర్యలలో కొన్ని మార్పులను ప్రకటించారు. ఇంతటితో ఆగకుండా వైస్ ఛాన్సలర్స్‌ను నియమించే పద్ధతులను ప్రతిపాదించింది. ఇది యు.జి.సి. పరిధిలో లేని అంశం. రాష్ట్రాల అధీనంలో వున్న యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్స్ ఎంపిక, నియామక అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తొలగించే తీవ్రమైన కొత్త ప్రతిపాదన. ఇకపై కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న గవర్నర్లే ఎంపిక కమిటీలను రూపొందిస్తారు. అంతేకాదు ఈ మార్పులు చేసిన కొత్త నియమావళిని దేశంలోని అన్ని యూనివర్సిటీలు పాటించి తీరాలి. పాటించకపోతే అవి యు.జి.సి పథకాలలో పాల్గొనే అవకాశాన్ని కోల్పోతారు. అవి ఇచ్చే డిగ్రీలకు గుర్తింపు కూడా వుండదట. పైగా మూడు వేల మందికి పైగా విద్యార్థులున్న యూనివర్సిటీలకు మాత్రమే యు.జి.సి. పరిధిలో లబ్ధి పొందడానికి అర్హత కలిగి వుంటాయి. రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే వివిధ విశ్వ విద్యాలయాలు ఈ నిబంధనతో యు.జి.సి. సహాయానికి అనర్హులవుతాయి. కార్పొరేట్ విద్యా సంస్థలు మాత్రమే లబ్ధి పొందుతాయి.

మూడేళ్ల డిగ్రీ స్థానంలో నాలుగేళ్ల డిగ్రీని ప్రకటించడంతోపాటు నెట్/సెట్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన వారు, తమ విద్యార్హతకు సంబంధం లేని బోధనాంశం మీద కూడా ఉపాధ్యాయ ఉద్యోగాలకు అర్హులవుతారు. ఇలా విద్యా వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసే రకరకాల ప్రతిపాదనల సారాంశం ఒకటే విద్యలో వైవిధ్యాన్ని లేకుండా యూనివర్సిటీలు తమ అవసరాలకు తగిన పాఠ్య ప్రణాళికలు రూపొందించుకుని నూతన ప్రయోగాలకు వీలు లేకుండా ఒక మూస పద్ధతిలో విద్యా వ్యవస్థను ముద్ద చేసే ప్రయత్నం ఈ ప్రతిపాదనలలో కనిపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో వున్న యూనివర్సిటీలలో వైస్ ఛాన్సలర్ల నియామకాన్ని గవర్నర్లకు కట్టబెట్టడం రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం. ఉన్నత విద్యపై రాష్ట్రాలకున్న అధికారాలను కేంద్రానికి కట్టబెట్టే ప్రయత్నం.

2025 ఫిబ్రవరి 6న తిరువనంతపురంలో ఆరు ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నత విద్యాశాఖ మంత్రుల సమావేశం జరిగింది. వారు ఏకగ్రీవంగా యు.జి.సి. కొత్త నియమావళి విద్యావ్యవస్థను కేంద్రీకృతం చేస్తుందని, రాష్ట్రాల హక్కులను హరిస్తుందని, ప్రభుత్వ విద్యా స్థానంలో ప్రయివేటు విద్యకు దారి చూపుతుందని చేసిన విమర్శ సహేతుకమైంది. వైస్ ఛాన్సలర్ల నియామకంపై యు.జి.సి. చేసి ప్రతిపాదన దాని పరిధిని దాటి చేసిన ప్రకటన. యు.జి.సి. చట్టం లక్ష్మణ రేఖను దాటి రూపొందించిన నియమావళి ఉన్నత విద్యను ప్రమాదంలో పడేస్తుంది.

**- డీవీవీఎస్ వర్మ**

**సంపాదకులు, 85006 78977**

# బీజేపీ విజయం.. కాంగ్రెస్-ఆప్ అనైక్యత




- తెలకపల్లి రవి

దేశ రాజధాని ఢిల్లీ శాసనసభ ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. 27 సంవత్సరాలుగా అధికారానికి దూరంగా ఉండిపోయిన బీజేపీ అత్యధిక మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నది. 1998కి ముందు దీర్ఘకాలంపాటు బీజేపీ పట్టులో ఉండి 1998-2013 మధ్య కాంగ్రెస్ హ్యాట్రిక్‌లు చూసి ఆ పైన (శాసనసభ వరకూ) ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కంచుకోటగా కనిపించిన ఢిల్లీ ఆ పార్టీ చేజారిపోయింది. ఎలాగైనా ఉనికి కాపాడుకోవాలని పాకులాడిన కాంగ్రెస్ ఖాతానే తెరవలేక పోయింది. ఒక దశలో జాతీయ ప్రత్యామ్నాయంగా ప్రచారమై తర్వాత సిబిఐ, ఈడి కేసుల్లో వరుసగా సవాళ్లను ఎదుర్కొని పదవిని కూడా వదులుకున్న అరవింద్ కేజ్రీవాల్ స్వయంగా ఓడిపోయాడు. ఆయన సన్నిహితులైన ముఖ్య నాయకులు కూడా ఓటమి చవిచూశారు. 2014, 2019 ఎన్నికల్లో లోక్‌సభ స్థానాలు మొత్తం తెచ్చుకుని కూడా 2015, 2020 శాసనసభ ఎన్నికల్లో బోల్తాపడిన బీజేపీ ఈసారి మాత్రం 2024 నాటి ఫలితాలనే కొనసాగించగలిగింది. లోక్‌సభలో స్వంతంగా మెజార్టీ తెచ్చుకోలేక చతికిలపడిన ప్రధాని మోడీ నాయకత్వంలో ఢిల్లీని కైవసం చేసుకోవడంతో ఎక్కడలేని ఉత్సాహం వచ్చినట్టు హడావుడి చేస్తున్నది. విడివిడిగా తలపడిన ఆప్ 43 శాతం పైన, కాంగ్రెస్ ఆరు శాతంపైన ఓట్లు తెచ్చుకుని కూడా తమలో తామే ఓట్లు చీల్చుకుని బీజేపీ నెత్తిన పాలుపోశాయి.

## మొండిపట్టుతో ఓటమి

శాసనసభ ఎన్నికల ప్రకటనకు ముందు నుంచి కాంగ్రెస్ ఆప్‌లు కలిసి పోటీ చేస్తాయా లేదా అన్నదే కీలకాంశంగా చర్చ జరిగింది. కాంగ్రెస్ విషయానికొస్తే ఇటీవల హర్యానా శాసనసభ ఎన్నికల్లో ఆప్‌కు కనీసస్థానాలు కేటాయించేందుకు నిరాకరించింది. తర్వాత మహారాష్ట్రలోనూ అంతే జరిగింది. తాను బలంగా వున్నచోట్ల ఇతర పార్టీలతో సీట్ల సర్దుబాటు చేసుకోకుండా తను లేనిచోట మాత్రం ఇతరులకు ఇవ్వాలని కోరుకోవడం 'ఇండియా'లో భాగస్వాములు ఆమోదించడం లేదు. ఢిల్లీ వరకైతే ఆప్ కాంగ్రెస్ రెండూ ఒంటరిగానే వెళతామని గతంలోనే ప్రకటించాయి. ఆప్ కూడా అదే కోరుకుంది. లిక్కర్ స్కాంలో అరెస్టయిన అరవింద్ కేజ్రీవాల్ బెయిలు మీద బయటకురాగానే తాము ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించారు. ఎందుకంటే, అంతకు ముందు జరిగిన హర్యానా శాసనసభ ఎన్నికల్లో ఆప్‌కు కనీస స్థానాలు కేటాయించేందుకు




నిరాకరించింది. తర్వాత మహారాష్ట్రలోనూ అంతే జరిగింది. తాను బలంగా వున్నచోట్ల ఇతర పార్టీలతో సీట్ల సర్దుబాటు చేసుకోకుండా తను లేనిచోట మాత్రం ఇతరులు ఇవ్వాలని కోరుకోవడం ఇండియాలో భాగస్వాములు ఆమోదించలేదు. ఫలితాల్లో ఘోరంగా దెబ్బతిన్న తర్వాత కూడా కాంగ్రెస్ కలిసి పోటీ చేయకపోవడం నష్టం కలిగించిందని ఒప్పుకోవడం లేదు. పైగా ఇందుకు బాధ్యత తమది కాదన్నట్టే మాట్లాడుతున్నది.

ఫలితాలు వస్తుండగానే జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఒక ట్వీట్ చేస్తూ "మీరు పోట్లాడుకుంటూ ఉండండి. వారు గెలుస్తూ ఉంటారు" అని హెచ్చరించారు. నిజానికి కాశ్మీర్ ఎన్నికల్లో కూడా నేషనల్ కాన్ఫరెన్స్, సీపీఐ(ఎం)లతో కలసి పోటీ చేసిన కాంగ్రెస్ వ్యవహరించిన తీరు, సాధించిన ఫలితాలు ప్రతికూలంగా ఉన్నాయి. ఉత్తరాది చివర ఉమర్ ఆ విధంగా వ్యాఖ్యానిస్తే తెలంగాణలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా అదే తరహాలో రాహుల్‌గాంధీ వల్లనే బీజేపీ గెలవగలిగిందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఆప్, బీఆర్ఎస్ వంటి పార్టీలను కలుపుకోకుండా బీజేపీ పెరగడానికి కాంగ్రెస్ కారణమవుతున్నదని ఆక్షేపించారు. నిజానికి తెలంగాణలోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల పరస్పర పోటీలో బీజేపీ లబ్ధి పొందుతున్నదని దేశమంతటికీ తెలుసు. కేటీఆర్ మాటల్లో అర్థం కాంగ్రెస్ తమను కూడా కలుపుకోవాలని అర్థమా అనేది స్పష్టం కావడం లేదు. ఇక నేరుగా ఆప్ అధినేత కేజ్రీవాల్ స్పందన చూస్తే తమ పాలనలో చేసిన పనులు చెప్పుకుని విజయం సాధించిన బీజేపీకి శుభాకాంక్షలు చెప్పడం తప్ప ఓటమిపై ఆత్మ విమర్శ, పరిశీలన కనిపించవు.

## కేసుల పేర వేధింపులు

ఆప్ ఓటమికి దారి తీసిన తప్పిదాలు, పాలనలో పొరబాట్లు చాలా వున్నాయి. లిక్కర్ స్కాం వంటి ఆరోపణలను అవకాశం ఇవ్వడం కూడా సమర్థనీయం కాదు. లౌకికతత్వం కోసం పోరా డటంలోనూ బీజేపీ వ్యతిరేకులను కలుపుకుని పోవడంలోనూ ఆప్ పెద్ద ఆసక్తి చూపింది లేదు. వ్యక్తిగతంగా కేజ్రీవాల్ కూడా తనే ప్రత్యామ్నాయం అన్న సంకేతాలిస్తూ వచ్చారు. కొన్ని సందర్భాల్లో మతపరమైన క్రతువుల్లోనూ పాల్గొని అత్యుత్సాహం ప్రదర్శించారు. రాజకీయ విధానాలపరంగా స్థిరత్వం లేకపోవ డం నిజమే అయినా రాజ్యాంగ రీత్యా ఢిల్లీ ప్రత్యేక పరిస్థితిని ఆసరా చేసుకుని లెఫ్టినెంట్ గవర్నర్‌ను అడ్డం పెట్టుకుని అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తూ వేధించిన తీరు మాత్రం సరి కాదు. ఆప్ నాయకత్వం కూడా ఒక దశలో మోడీ పట్ల మెతక దనం, కాశ్మీర్ 370 రద్దుకు మద్దతు వంటి పనులు చేసినా వీటన్నిటి తర్వాత కండ్లు తెరవక తప్పలేదు. ఇండియా వేదికలో భాగస్వామి కావడం, వివిధ రాష్ట్రాలు సందర్శించి మద్దతు కోరడం అందులో భాగమే. కానీ ఢిల్లీకి వచ్చేసరికి కాంగ్రెస్ ఆప్ తీవ్ర ప్రత్యర్థులుగానే వ్యవహరించాయి. ఉభయ పార్టీలూ తమ దారిలో తాము నడిచాయి. ఈ పరాజయం అందువల్లనే ఈ పరాజయం అనివార్యమైంది. పొలిటికల్ స్టార్టప్‌లా కొన్ని ప్రయో గాలతో దేశాన్ని ఆకర్షించిన ఆప్ పదేండ్ల తర్వాత పరాజయం కొనితెచ్చుకుంది. కేసుల ఒత్తిడి కారణంగా కేజ్రీవాల్ వైదొలగి అతీశిని ముఖ్యమంత్రిని చేసినా ఆయనను మళ్లీ పదవిలో కూచోబెట్టడమే తన లక్ష్యమని ఆమె ప్రకటించారు. ఆయన కూర్చున్న కుర్చీలో కూచోబోనంటూ అతి వినయం ప్రదర్శించ డం ఒక విధంగా తమిళనాడులో పన్నీర్ సెల్వన్, జయలలిత పట్ల వ్యవహరించిన తీరును గుర్తుచేసింది. ఎన్నికల్లో చివరకి ఆమె గెలవగా కేజ్రీవాల్ మాత్రం ఓడిపోయారు. అవినీతిపై పోరాటంలో ఒకప్పుడు ఆయనకు మార్గదర్శిగా ఉన్న అన్నా హజారే వెంటనే రంగంలోకి వచ్చి ఏకపక్షంగా శాపనార్థాలు పెట్టడంలో సమతుల్యత లోపించింది. అంటే ఇతర రాజ్యాంగ ప్రజాస్వామిక కోణాలు ఆయన పట్టించుకోలేదని చెప్పాలి.

## ద్వంద్వ ప్రమాణాలు

తమాషా ఏమంటే లిక్కర్ స్కాంతో సంబంధమున్న మాగుంట శ్రీనివాసరెడ్డి టీడీపీ ఎంపీగా ఎన్డీయేలోనే ఉన్నారు. ఢిల్లీలో మొదలైన ఈ స్కాంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కేసీఆర్ కుమార్తె కవితను అరెస్టు చేసి చాలాకాలం జైల్లో నిర్బంధించారు. ఆరోపణలను విచారించవలసిందే గానీ తమతో ఉంటే ఒకలా లేకపోతే మరోలా ద్వంద్వ ప్రమాణాలు పాటించడం ఎలా చెల్లుతుంది ? ఢిల్లీ బీజేపీ నాయకులు, ముఖ్యమంత్రి అతీశీతో సహా అనేకమంది నాయకులపై చవకబారు వ్యాఖ్యలతో వివాదాలు రగిలించారు. బంగ్లా శరణార్థులు రోహింగ్యాల రాకను ప్రధాన సమస్యగా మతపరమైన అంశాలను ముందుకు తెచ్చారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు నుంచి ప్రచారం ఆపేయాలని నిబంధనలున్నా ప్రధాని మోడీ త్రివేణీ సంగమంలో మహా కుంభస్నానం చేసి మతపరమైన సంకేతాలు పంపించారు. ప్రతిపక్షాల వాగ్దానాలను లేవిడీ(తాయిలం)గా అపహాస్యం చేసే మోడీ స్వయంగా ఢిల్లీవాసులకు ఆపదమొక్కుల్లాంటి వరాల వాన కురిపించారు. ఏకంగా మూడు ఎన్నికల ప్రణాళికలు ప్రకటిస్తూ కొత్త కొత్త వాగ్దానాలు గుప్పించారు. సరిగ్గా బడ్జెట్‌లో ఆదాయ పన్ను మినహాయింపు రూ.12 లక్షలకు పెంచడం కూడా ఢిల్లీ ఎన్నికల కోణంలోనేనన్న అభిప్రాయం నెలకొన్నది. తాము వస్తే ఆప్ పథకాలను రద్దు చేస్తామన్నది ప్రచారం మాత్రమేనని, అన్నీ యథాతథంగా కొనసాగిస్తామని ప్రచారం చేశారు. ఈ సామ దాన భేద దండోపాయాలతోపాటు ప్రతిపక్షాల ఓట్ల చీలిక కూడా తోడై బీజేపీ పెద్ద విజయమే సాధించగలిగింది.

## ఢిల్లీ కీలక ప్రాధాన్యత

కేంద్రంలో తమ అధికారం సంపూర్ణంగా చెలాయించడానికి ఢిల్లీ పగ్గాలు చేతిలో పట్టుకోవడం తప్పనిసరి అని బీజేపీ భావన. అందుకే స్వయంగా మోడీనే ప్రచార బాధ్యత మీద వేసుకోవడంతోపాటు ఎనిమిది నెలలుగా ఇందుకు తీవ్ర కసరత్తు చేశారు. 'ఆప్‌ను ఇక సహించం.. మార్పు సాధిస్తాం' అన్న ఎన్నికల నినాదం ఎత్తుకున్నారు. ఈ మధ్యనే రైతుల ఆందోళన పట్ల ఎలా వ్యవహరించారో చూశాం. ఢిల్లీ రాజధాని కావడంతో అక్కడ నిరసనలు తెలిపే హక్కులకు ఇక ముప్పు వాటిల్లవచ్చు. పోలింగ్ ముగిశాక కూడా కేజ్రీవాల్, అతీశిలతో సహా పలువురు నాయకులపై కొత్త కేసులు నమోదు చేశారంటే వారి దాడి తీవ్రత తెలుస్తున్నది. ఇప్పుడు ఈ ఫలితాలు వస్తుండగానే సచివాలయం మూసివేయడంతో సహా మరిన్ని దాడులకు సిద్ధమవుతున్నట్టు కనిపిస్తున్నది. ఈ విజయం ప్రభావం ఎలా వుంటుందో, వివిధ రాజకీయ పార్టీలూ శక్తులూ ఎలా స్పందిస్తాయో చూడాలి. ఇన్ని చేసినా ప్రతిపక్షాలకు దాదాపు యాభైశాతం ఓట్లు రావడం గమనిస్తే ప్రజల్లో ప్రజాస్వామిక కాంక్ష ఎంత లోతుగా వేళ్లూనుకుని వుందో తెలుస్తుంది. ఈ ఫలితాలను పరిణామాలను మరింత కూలంకషంగా అధ్యయనం చేసి తగు పాఠాలు తీసుకోవాల్సిన అవసరమైతే ఉన్నది.

ఏపీలో బీజేపీతో పొత్తు పెట్టుకుని ఎన్డీయేలో భాగస్వామిగా మారిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారం కోసం ఢిల్లీ వెళ్లి మోడీ కీర్తనాలపించి వచ్చారు. ఆప్‌పైన తీవ్రంగానే దాడిచేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎలాగూ సనాతన మంత్రంతోనే రాజకీయం నడిపిస్తున్నారు.

**(మిగతా 16వ పేజీలో)**

# పెద్దల సభలో పెద్దరికంగా ప్రజా పక్షాన



- ఎ.అజశర్మ

**ఈ నెల 27వ తేదీన ఆంధ్ర రాష్ట్రంలోని మూడు శాసనమండలి స్థానాలకు ఎన్నికలు జరగబోతున్నాయి. కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం, ఉభయ గోదావరి జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గం, ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నికలు జరుగుతున్నాయి. మిగిలిన సాధారణ ఎన్నికల వలె గాక ఈ ఎన్నికలకు ఓ ప్రత్యేకమైన నేపథ్యం ఉంది. శాసన మండలిని పెద్దల సభ అని కూడా పిలుస్తారు. రాజ్యాంగంలోని నిబంధన ప్రకారం ఆయా రాష్ట్రాల శాసనసభల ఆమోదం పొందితే ఏ రాష్ట్రంలోనైనా రాష్ట్రపతి అనుమతితో శాసన మండలిని ఏర్పాటు చేయవచ్చు. ఆ రకంగా మన రాష్ట్రంలో శాసనమండలి ఏర్పాటయింది. దీనిని 1985లో నాటి ఎన్టీ రామారావు ప్రభుత్వం రద్దు చేసింది. మరలా వైఎస్ రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వం 2007లో శాసన మండలిని పునరుద్ధరించింది. అప్పటి నుండి నేటి వరకు రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా శాసనమండలి కొనసాగుతోంది.**

పెద్దల సభ ఏర్పాటుపై రాజ్యాంగ పరిషత్‌లో పెద్ద చర్చే జరిగింది. ఇది అవసరమా, అనవసరమా అనే రెండు కోణాల నుంచి పరిశీలన జరిపిన పిదప డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సూచన మేరకు దీని ఏర్పాటుకు రాజ్యాంగంలో అవకాశం కల్పించబడింది. శాసనమండలిలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గం మండల సభ్యులతోపాటు, ఎమ్మెల్యేల చేత ఎన్నుకోబడిన సభ్యులు, స్థానిక సంస్థల ప్రతినిధులచే ఎన్నుకోబడిన సభ్యులు, గవర్నర్ నామినేట్ చేసి సభ్యులు వంటి వారు కూడా ఉంటారు. అయితే పట్టబద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ మండల సభ్యత్వం పార్టీ గుర్తులపై కాక స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికలు జరుగుతాయి. వాస్తవంగా శాసనమండలిలో వీరికి ప్రత్యేకమైన స్థానాలు కేటాయించడానికి అర్థం, పరమార్థం ఉన్నాయి. మన రాష్ట్రంలో మొత్తం శాసనమండలి 58 స్థానాలలో ఐదు స్థానాలు పట్టభద్రుల




నియోజకవర్గాలకు, మరో ఐదు స్థానాలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు కేటాయించబడ్డాయి.

పెద్దల సభకు ఎన్నికయ్యే ఈ పది మంది సభ్యులపైన ఒక గురుతరమైన బాధ్యత రాజ్యాంగం ఏర్పాటుచేసింది. అదేమి టంటే ఎంత మంచి ప్రభుత్వమైనా నిర్ణయాలను చేస్తున్నప్పుడు తన రాజకీయ ప్రయోజనాలను కూడా చూసుకుంటూ ఉంటుంది. అందువల్ల సహజంగానే తప్పుడు నిర్ణయాలు చేయ డానికి అవకాశం ఉంటుంది. అటువంటి సందర్భాలలో పెద్దల సభ జోక్యం చేసుకొని అటువంటి నిర్ణయాలను మార్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది. అయితే రాజకీయ పార్టీల ప్రతినిధులుగా ఎన్నికైన సభ్యులు సహజంగానే ఈ పని చేయలేరు. అందువల్ల ఈ పెద్దల సభకు ఎన్నికయ్యే వారు రాజకీయరహితంగా, ప్రజల పక్షాన నికరంగా నిలబడి, ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలను ప్రశ్నించి, సరిచేయగలిగే స్థాయి కలిగి ఉండాలి. అటువంటి తెగువ, నిస్వార్థత, దార్శనికత ప్రదర్శించేవారు ఈ సభకు ఎన్నికైతే అది పెద్దల సభకు గౌరవం దక్కించినట్లు లెక్క.

అయితే ఇటువంటి సభను కూడా పునరావాస కేంద్రంగా మార్చేసిన పాలకులు, పెద్దల సభను అపహాస్యం పాలు చేస్తూ రాజకీయ సభలుగా మార్చేస్తున్నారు. డబ్బులకు సీట్లు కొనుక్కున్న సందర్భాలు కూడా ఉన్నాయంటే, ఎంతగా ఈ సభా విలువను దిగజారుస్తున్నారో తెలుస్తోంది. ఇతరత్రా పదవులు పొందని వారిని సంతృప్తి పరచడానికీ పెద్దల సభే వేదిక అవుతోంది. కాంట్రాక్టర్లను, బడా వ్యాపారస్తులను, పోటీలకు పెట్టి, కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి, ఎలాగైనా గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నారు తప్ప ఈ పెద్దల సభకు తగ్గ హుందాతనం ప్రదర్శించడం లేదు. సరికదా, ఇలా ఎన్నికైన వారు ఈ పదవిని, హోదాను తమ స్వప్రయోజనాల కోసం, వ్యాపార విస్తరణల కోసం, కాంట్రాక్టులు పొందడం కోసం వినియోగించుకుంటూ,

సభా గౌరవాన్ని మంట గలుపుతున్నారు తప్ప, సభలో ప్రజా సమస్యలపై చర్చించిన సందర్భాలే లేవు.

నేడు కృష్ణ, గుంటూరు జిల్లాలకు జరుగుతున్న ఎన్నికలలో కోటేశ్వరుడైన బడా పారిశ్రామికవేత్త అధికార కూటమి అభ్యర్థి గానూ, ప్రముఖ విద్యావేత్త, మేధావి అయిన కేఎస్ లక్ష్మణరావు గారు మరొకవైపు తలపడుతున్నారు. అలాగే ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి తెలుగుదేశం మద్దతుతో ప్రస్తుత ఎమ్మెల్సీ, బీజేపీ మద్దతుతో ఒక మాజీ ఎమ్మెల్సీ పోటీ చేస్తుండగా, వారిద్దరితో ఒక ఉపాధ్యాయ ఉద్యమ నేత శ్రీమతి కోరెడ్ల విజయ గౌరి గారు తలపడుతున్నారు. గోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానానికి ప్రజా ఉద్యమ నాయకులు డివి రాఘవులు గారు పోటీ చేస్తుండగా, తెలుగుదేశం బలపరిచిన అభ్యర్థి వ్యాపారవేత్త, కోటీశ్వరుడు పోటీకి తలపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ అభ్యర్థులలో ఎవరిని గెలిపించుకుంటే పెద్దల సభకు గౌరవం దక్కుతుంది, ప్రజా సమస్యలు ఈ పెద్దల చట్ట సభలో చర్చకు వస్తాయి, ఎవరు ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలపై గళమెత్తుతారన్నది పట్టభద్రులు, ఉపాధ్యాయులు విజ్ఞతతో ఆలోచించి, ఓటు వేయవలసిన రాజ్యాంగబద్ధ బాధ్యత ఉంది. దానికి భిన్నంగా ఇక్కడ కూడా కులం, డబ్బు, గిఫ్టులు వంటి ప్రలోభాలకు గురిచేయాలని శత విధాలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటికి లోనయితే విద్యావంతుల కోవలోకి వస్తామా అన్నది ఒకసారి ఎవరికి వారే ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

> **నేడు రాష్ట్రంలో రాజకీయాలు కలుషితమైపోయాయి. ప్రతిపక్షం శాసనసభకు వెళ్ళడం మానేసింది. ఇక సభలో అంతా అధికార పక్షమే. ప్రజా సమస్యలు చర్చకే రావు. నేడు ఈ మూడు స్థానాలలోనూ అధికార పార్టీ అభ్యర్థులు గెలవక పోయినా ప్రభుత్వ మనుగడకు వచ్చే ఢోకా ఏమీ లేదు. కానీ, ఈ మూడు స్థానాలలో సామాన్యుల పక్షాన నికరంగా నిలిచే అభ్యర్థులు గానీ గెలవకపోతే, ఇక పట్టభద్రుల, ఉపాధ్యాయుల, ప్రజల వాణి చట్ట సభల్లో వినపడనే వినపడదు.**

2007లో శాసనమండలిని రాష్ట్రంలో పునరుద్ధరించిన తరువాత స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి, గెలిచిన ఎమ్మెల్సీలు కలసి, పెద్దల సభలో రాజ్యాంగ బాధ్యతకనుగుణంగా వ్యవహరించేలా ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అనే వేదికను ఏర్పాటు చేశారు. నాటి నుండి నేటి వరకు గెలిచిన 14 మంది పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఒకే నిబద్ధతతో చట్టసభలోన, బయట ప్రజాపక్షం వహించారు. చట్ట సభల్లో అసలైన ప్రజా సమస్యలు చర్చకు వస్తున్నది పీడీఎఫ్ ఎమ్మెల్సీల ద్వారా మాత్రమే. సమాజాభివృద్ధికి సహకరించేలా విద్యా వ్యవస్థ బలోపేతం, ఉపాధి కల్పన వంటి ప్రధాన లక్ష్యాలతో వీరు కృషి చేస్తున్నారు. నేడు ఈ మూడు స్థానాలలోనూ పీడీఎఫ్ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

పాఠశాలలను కుదించేలా చేసిన 117 జీవో రద్దు కోసం కృషి చేసింది పీడీఎఫ్ ఎమ్మెల్సీలే. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దు చేసి, దాని స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యమిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులపై నిర్బంధాన్ని ఖండించి, వారికి అండగా నిలిచింది పీడీఎఫ్ ఎమ్మెల్సీలే. ఉద్యోగుల కర్రువు భత్యం, ఖాళీ పోస్టులు నింపకపోవడం, పీఆర్సీ ఛైర్మన్ నియామకం వంటి అనేక అంశాలలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షం వహించి, ప్రభుత్వ తీరు ఎండగట్టింది పీడీఎఫ్ ఎమ్మెల్సీలే. అక్షరాస్యతలో అధ్వానంగా ఉన్న గిరిజన ప్రాంతంలో వారివారి గిరిజన బాషల్లో చదువు చెప్పే బాషా వాలంటీర్లను తొలగించాలని గత ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. గిరిజన ప్రాంతంలో జీఓ నెంబరు 3కు చట్టబద్ధత కల్పించ కుండా గిరిజనులకు హాని చేసింది. వీటితోపాటు యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలపై అత్యాచారాలు వంటి అనేక సమస్యలపై చట్టసభలో చర్చకు పెట్టి, వాటిపై పట్టుబట్టిన చరిత్ర పీడీఎఫ్ ఎమ్మెల్సీలకే ఉంది. ప్రభుత్వ విద్య బలహీనపడడంతో నేడు ఆంధ్రరాష్ట్రంలో పాఠశాల స్థాయిలో 50 శాతం మంది, ఉన్నత విద్యలో 80 శాతం విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలలోనే విద్య పొందుతున్నారు. అటువంటి విద్యా సంస్థల సిబ్బంది బాధ్యత తనకేమీ లేనట్లు ప్రభుత్వం వ్యవహరిస్తోంది. చిన్న యాజమాన్యాలను ఇబ్బంది పెడుతోంది.

కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం 2020 పేరున విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపారమయం, కార్పొరేటీకరణ చేసింది. ఆంధ్ర రాష్ట్రంలో అత్యంత కీలకమైన విద్యా వ్యవస్థ చిన్నాభిన్నమైంది. గత ప్రభుత్వం జీవో నెంబరు 117 ద్వారా రేషనలైజేషన్ పేరున పాఠశాలల మూసివేతలు, విలీనాలు చేపట్టింది. ఇప్పటికే మిగిలిన అనేక చిన్న చిన్న దేశాలతో పోల్చినా మన దేశంలో ఘోరంగా అక్షరాస్యత 77 శాతం మాత్రమే. అందులోనూ 66 శాతంతో అక్షరాస్యతలో ఆంధ్ర రాష్ట్రం 32వ స్థానంతో అడుగున ఉంది. అలాంటి సమయంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించాలంటే ప్రభుత్వ విద్య బలోపేతం కావలసిన అవసరం ఉండగా, విచిత్రంగా మన పాలకులు దానిని మరింత బలహీనపరిచే విధానాలు అవలంభిస్తున్నారు. విద్యాహక్కు చట్టాన్ని కాగితాలకే పరిమితం చేశారు.

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అదేబాటలో పయనిస్తోంది. జీవో 117ను నామమాత్రంగా రద్దు చేసి, అందులోని అంశాలను మాత్రం యధాతథంగా **(మిగతా 8వ పేజీలో)**

# పుత్రోత్సాహం.. పిత్రోత్సాహం



- కె.శ్రీనివాస్

మోదీ 3.0 కి ఊతకర్రలని అందరూ ఊదరగొట్టిన జనతా దళ్(యు), తెలుగుదేశం పార్టీలు రెండూ ఇప్పుడు ఒక తలకిందులు పోలికతో కనిపిస్తున్నాయి. తండ్రిని నిలబెట్టడానికి నితీశ్ కుమార్ తనయుడు నిశాంత్ తాపత్రయం పడుతుండగా, కొడుకును ప్రమోట్ చేయడానికి చంద్రబాబు నాయుడు కష్టపడుతున్నారు. నితీశ్‌కుమార్‌కు ఆరోగ్యం బాలేదు. తడబడుతున్నారు. మరిచిపోతున్నారు. మానసిక ఆరోగ్యం మీద కూడా సందేహాలు కలుగుతున్నాయి. ఎన్నికలా దగ్గరపడుతు న్నాయి. మరోవైపు లాలూ ప్రసాద్ కొడుకుకు పార్టీలో సర్వాధికారాలు ఇచ్చి తప్పుకుంటున్నారు. కుమారుడు రాజకీయాలలోకి రావడం లేదని నితీశ్ ఇంతకు ముందు చాలాసార్లు చెప్పారు. తాను పూర్తి జబ్బుపడితే ఈ ఏడాది ఎన్నికల్లో పార్టీ పరిస్థితి ఏమిటని ఆయన, ఆయనతోపాటు బీజేపీ నేతలు కూడా కలవరపడుతున్నారు. ఈ మధ్య నిశాంత్ ఒక రాజకీయ సభలో పాల్గొని, వీలైతే తన తండ్రికి మరోసారి అధికారం ఇమ్మని అడగడం బీహార్ రాజకీయాల్లో కలకలం కలిగించింది. నితిశ్‌కు మరీ అంత బాగా లేదా, ఎన్డీయే కూటమి చేతి నుంచి బీహార్ జారుకుంటుందా అన్న ఊహలు మొదలయ్యాయి.

తెలుగుదేశం పరిస్థితి వేరు. చంద్రబాబే లోకేశ్ తన వారసుడుగా ఎదగాలని అనుకుంటున్నాడు. ప్రాంతీయ పార్టీలలో కుటుంబ పాలన అతి సాధారణం. కానీ, లోకేశ్ ఎదిగి రావడానికి చాలా సమయం తీసుకుంటోంది. తండ్రి భారీ ఇమేజ్ కూడా కొడుకుకు అవరోధమే. 2019లో ప్రతిపక్షంలో కూర్చోవలసి రావడం, ఆ ఎన్నికల్లో లోకేశ్ ఓడిపోవడం వారసత్వ ప్రయత్నాలను నెమ్మదింప చేశాయి. పాపం, పాదయాత్రతో



నితీశ్ కుమారుడు నిశాంత్.. చంద్రబాబు కుమారుడు లోకేశ్

యువగళాన్ని పరిపక్వ గళం చేసుకోవడానికి లోకేశ్ తన వంతు ప్రయత్నం చేశారు.

2024 ఎన్నికలు వేరు. జీవన్మరణ పోరాటం కావడంతో పొత్తులూ కూటమిలూ తప్పలేదు. ఘన విజయం దొరికినా, దానితోపాటు పవన్‌కళ్యాణ్ సహ సారథ్యం తప్పలేదు. ఆంధ్ర ప్రదేశ్‌లో లోకేశ్ నంబర్ త్రీకి సర్దుకున్నారు. ఒకవైపు చంద్రబాబుకు వయసు మీద పడుతోంది. అట్లాగే వదిలేస్తే తెలుగుదేశం భవిష్యత్తు ఏమిటి? లోకేశ్ పరిస్థితి ఏమిటి?

తాత పట్టుదలకు, తండ్రి చతురతకు వారసుడుగా లోకేశ్‌ని కీర్తిస్తూ ఆయన అభిమానులు ఈరోజు ప్రకటనలు గుప్పించారు. ఉప ముఖ్యమంత్రిగా లోకేశ్‌ని ప్రమోట్ చేయాలని పార్టీలో గొంతులు విప్పారుతున్నాయి. ఖబర్దార్ అంటూ చంద్రబాబు హెచ్చరిస్తున్నారు. కానీ అవి ఉత్తుత్తి హెచ్చరికలు అని లోకేశ్ అభిమానులకు తెలుసు. పరివార్ వాదం మీద పోరాడే బీజేపీకి ఈ రెండు రాష్ట్రాల్లో గట్టి చిక్కే వచ్చింది! ❑

## పెద్దల సభలో పెద్దరికంగా ప్రజా పక్షాన

(7వ పేజీ తరువాయి)

అమలు చేస్తూనే ఉన్నారు. అనేక ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మెగా డీఎస్సీ నిర్వహణ అనే హామీ నేటికీ ఆచరణ రూపం దాల్చలేదు. శాశ్వత నియామకాలు చేపట్టకుండా, ఉపాధ్యాయ, అధ్యాపకులను కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీ వంటి వివిధ పేర్లతో నియమిస్తూ, ఎటువంటి ఉద్యోగ భద్రత లేని, తక్కువ వేతనాలతో గొడ్డు చాకిరీ చేయించుకుంటూ ఆ వృత్తికే ప్రభుత్వం కళంకం తెస్తోంది. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, పోటీ పడి ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తున్న స్థితి నేడు రాష్ట్రంలో నెలకొంది. మన దేశంలో పౌరులందరికి ఒకే ఓటు ఉంది. అయితే పట్టభద్రులకు మాత్రం దానితోపాటు మరో ఓటు, అంటే రెండు ఓట్లు వేసే అధికారం ఉంది. ఉపాధ్యాయులకు ఆ రెంటితో పాటు, ఉపాధ్యాయ ఓటు ద్వారా మూడో ఓటు వేసే హక్కు రాజ్యాంగం కల్పించి, వారిని సమాజంలో ఉన్నత స్థానంలో నిలబెట్టింది. ఆ రాజ్యాంగబద్ధ నమ్మకానికి తగ్గట్లుగా విద్యావంతులయిన పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎటువంటి ప్రలోభాలకు లోనూ కాకుండా, పెద్దల సభకు అసలైన పెద్దలనే పంపే చైతన్యం ప్రదర్శిస్తారని ఆశిద్దాం. ❑

# విజన్ 2047 కాదు..
# విభజన హామీలు అమలు కావాలి



**- దిలీప్ రెడ్డి**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మళ్లీ కొత్త సీసాలో పాత నీళ్లు పోస్తున్నారు. తిరిగి తన పాత పాటకే కొత్త రాగం అందుకున్నారు. మిషన్ పేరును ఇప్పుడు కొద్దిగా మార్చి 'విజన్ 2047' అంటున్నారు! స్వర్ణాంధ్ర విజన్ 2047 గురించి చెప్పే ముందు, పాతికేళ్ల కింద ప్రతిపాదించిన విజన్ 2020లో ఏముంది? పదేళ్ల కింద ప్రతిపాదించిన విజన్ 2029లో ఏముంది? ఈ రెండు విజన్ డాక్యుమెంట్ల వల్ల రాష్ట్రానికి నిక రంగా ఒరిగిందేంటో? నికార్సుగా జరిగిందేంటో? చెప్పి ఉంటే ఇటీవల ఆయన 225 పేజీలతో ఆర్భాటంగా విడుదల చేసిన విజన్ 2047 డాక్యుమెంట్ మీద ఒక ఆలోచన, అవగాహన ప్రజలకు ఏర్పడే అవకాశం ఉండేది. దానికి భిన్నంగా రంగు రంగుల కాగితాలు పట్టుకొచ్చి, గ్రాఫిక్స్‌లో జనానికి వైకుంఠం చూపించి, తెరవెనక ఆశ్రితులకు ఆస్తులను కట్టబెట్టే పన్నాగాన్ని ఎన్నిసార్లని ప్రజలు నమ్ముతారు ? ఎందుకు నమ్ముతారు ?

చంద్రబాబు ఇటీవల స్వర్ణాంధ్ర విజన్ 2047 పేరుతో కొత్త డాక్యుమెంట్ విడుదల చేసి, ప్రపంచంలోనే తెలుగుజాతిని నెంబర్‌వన్‌గా, దేశంలోనే ఏపీని అగ్రగామిగా నిలిపే కృషికి బీజం పడిందని చెప్పారు. ప్రజల తలరాతను, రాబోయే తరాల భవిష్యత్తును ఈ విజన్ డాక్యుమెంట్ మారుస్తుందని ఒక అడ్వర్‌టైజ్‌మెంట్‌ల్లో రంగురంగుల అక్షరమాలతో, ఇంద్ర ధనుస్సును తలపించేలా ప్రగతి కనికట్టును ప్రదర్శించారు. కానీ, ఒక్కసారి ఈ డాక్యుమెంట్‌లో పొందుపరిచిన ముఖ్య విషయాలను, లక్ష్యాలను గమనిస్తే క్షేత్రస్థాయి పరిస్థితులకు అవి ఎంత దూరంగా ఉన్నాయి, ప్రజల అవసరాలకు, ఆకాంక్షలకు అవెంత విరుద్ధంగా ఉన్నాయో ఇట్టే తెలిసిపోతుంది.

'ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, సంపద, సంతోషం' ఇది విజన్ 2047 నినాదం. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగ కల్పన, నదుల అనుసంధానంతో నీటి భద్రత, పేదరికం సంపూర్ణ నిర్మూలన, రాబోయే 25 ఏళ్లలో ఏడాదికి సగటున 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని తీర్చిదిద్దుతామని డాక్యుమెంట్లో చెప్పారు. ప్రస్తుతం రూ. 2.54 లక్షలు ఉన్న తలసరి ఆదాయం, 2047 నాటికి రూ.35.62 లక్షలు చేయడం ద్వారా ఇలా విజన్ డాక్యుమెంట్‌ని బరువైన అంకెలతో చెక్కి పెట్టి, దేశంలోనేగాక ప్రపంచంలోనే ఏపీని అగ్రగామిగా మారుస్తామని ఊదరగొట్టారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ డాక్యుమెంట్‌ని పూర్తిగా చదివారో, లేదో తెలియదు గానీ.. చంద్రబాబు విజన్ అద్భుతమని, 2047 నాటికి ఇది తప్పక నెరవేరుతుందని, ఆయనకు వంతపాడే తన సహజ ధోరణిలోనే కితాబిచ్చారు.

ఆరు నెలల కాలంలోనే 'విజన్ 2047 డాక్యుమెంట్' తీసుకొచ్చామంటే అది తనకున్న విజన్ అని చంద్రబాబు తనని తానే పొగుడుకున్నారు. తానొక విజనరీ అనుకోవడంలో తప్పు లేదు. కానీ, ఒక విజన్ ప్రకటించి, దాన్ని ఆచరణలో చూపించకపోవడమే తప్పు! విజన్ ప్రగల్భాల పరంపరలో ఆయన గత ట్రాక్ రికార్డును గమనిస్తే దోపిడీ తప్ప అభివృద్ధి లేదని స్పష్టమవుతుంది. 1999లో చంద్రబాబు 'విజన్ 2020' పేరుతో ఇలాగే ఒక డాక్యుమెంట్ విడుదల చేశారు. విజన్ 2020లో రెండు దశాబ్దాల్లో రాష్ట్ర వృద్ధిరేటు పది శాతం చేస్తానని చెప్పారు. దానికి 30 లక్షల కోట్ల పెట్టుబడి కావాలన్నారు. మన కళ్ల ముందే ఐదేళ్ల కిందట 2020 వెళ్లిపోయింది. ఈ రోజు పరిస్థితులతో దాన్ని లెక్కగట్టినా అది సాధ్యపడలేదు. ప్రపంచ బ్యాంకు విధానాలకు తలొగ్గి పలు ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ సమయంలో రైతుల ఆత్మహత్యలు, ఉపాధి లేక వలసలు, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు కష్టాలు పడుతుంటే, ఈ సమస్యల్ని గాలికొదిలేసి విజన్ 2020 పేరు చెప్పి రాష్ట్రస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం అంటే, రాష్ట్ర జీడీపీలో వేగమైన పెరుగుదల సాధించడమేనని విజన్ 2020 నుంచి చంద్రబాబు చెప్తూ వస్తున్నారు. దీనికోసం రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావాలని చెప్తున్నారు. పెట్టుబడులు రావాలంటే, కంపెనీలకు చవకగా వనరులు కట్టబెట్టాలని, లేదంటే ఆ పెట్టుబడి వేరే రాష్ట్రాలకు తరలిపోతుందని భయపెడుతుంటారు. భ్రమపెడుతుంటారు. అలా హైదరాబాదులో విలువైన ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు, ఆశ్రితులకు, ధనవంతులకు పంచిపెట్టారు. వ్యవసాయాన్ని పట్టించుకోలేదు. చేతి వృత్తులన్నీ నాశనమయ్యాయి. పల్లెల నుంచి పట్టణాలకు వలసలు పెరిగాయి. ధనవంతులకు తప్ప ఎవరికీ ఉపయోగపడని ఈ డాక్యుమెంట్ విజన్ 2020 కాదు. 420 అంటూ బాబు తీరును ప్రతిపక్ష పార్టీలే కాకుండా సాధారణ ప్రజలు కూడా నిరసించారు. ఆ తర్వాత వచ్చిన 2004 ఎన్నికల్లో ఘోరంగా ఓడించి, బుద్ధి చెప్పారు.

'విజన్ 2020' వేలం వెర్రికి బుద్ధి చెప్పినా సరే, 2014లో నవ్యాంధ్రప్రదేశ్‌కి మొదటి ముఖ్యమంత్రి అయిన తర్వాత చంద్ర బాబు తన 'విజన్' నినాదాన్ని వదులుకోలేదు. విజన్ 2020ని, విజన్ 2029గా మార్చి మరో డాక్యుమెంటును విడుదల చేశారు. అందులోనూ 2029 నాటికి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఆవిర్భవిస్తుందని ఊదర గొట్టారు. అది కూడా ఒక ప్రచార ఆర్భాటంగానే మిగిలి పోయింది. ఆ ఐదేళ్లకాలంలో చంద్రబాబు ఒక్క పోర్టుగానీ, ఫిషింగ్ హార్బర్ గానీ, మెడికల్ కాలేజీ గానీ కట్టలేదు. ప్రభుత్వ ఆస్పత్రులను, పాఠశాలలను బాగు చేయలేదు. రాష్ట్ర విభజన గాయంతో బాధపడుతున్న ప్రజలు కోరుకున్న రాజధానిని నిర్మిం చలేకపోయారు. రాజమౌళి 'బాహుబలి రాజధాని' గ్రాఫిక్స్‌లోనే సరిపుచ్చారు. ప్రత్యేక హోదా సంగతలా ఉంచినా, కనీసం ఇతర విభజన హామీలు సాధించలేకపోయారు. చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉద్యోగాలు సృష్టించలేకపోయారు. కార్పొరేట్ కంపెనీ లకు భూములు అప్పజెప్పారు గానీ, ఆర్థిక అభివృద్ధి మీద, యువత భవిష్యత్తు మీద ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. అందుకే, 'విజన్ 2029' అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలతో మురిపించిన టీడీపీని, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఘోరంగా ఓడించారు. పార్టీ చరిత్రలోనే అతి తక్కువ అసెంబ్లీ స్థానాలకు పరిమితం చేసి పాఠం నేర్పారు.

మంచికో, చెడుకో అయిదేళ్ల విరామం తర్వాత, 2024లో ప్రజలు మళ్లీ టీడీపీకి అధికారం కట్టబెట్టారు. ఈ అధికారం కట్టబెట్టింది కచ్చితంగా చంద్రబాబు విజన్ చూసి మాత్రం కాదు. మార్పు కోరుకున్న ప్రజలకు 2019-24 అయిదేళ్లలో రాజధాని నిర్మాణం కాలేదు, ఉద్యోగాలు రాలేదు. కనీసం రోడ్లు వేయలేదు, అసలే మాత్రం అభివృద్ధి జరగలేదు అనే కారణంతోనే మళ్లీ టీడీపీకి ఓటేశారు. 2024 జూన్ 13న ముఖ్యమంత్రిగా ప్రమా ణ స్వీకారం చేసిన చంద్రబాబు, గత ఆరు నెలల పాలనలో ప్రజలు సంతృప్తి చెందే ఒక్క కార్యక్రమాన్ని రూపొందించలేక పోయారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోయారు. రాబోయే నాలుగున్నర సంవత్సరాల్లో ఏం చేస్తారో కూడా తెలియదు. కానీ, ఏకంగా 23 ఏళ్ల భవిష్యత్తును అందిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ఈ స్వర్ణాంధ్ర 2047ని చదివితే, గతంలో చంద్రబాబు అమలు చేసిన నయా ఉదారవాద ప్రపంచబ్యాంక్ వ్యూహాలను, విధానాలను మరింత విస్తృతంగా, వేగంగా అమలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు కనిపిస్తున్నది.

2047నాటికి అమెరికా, చైనా తర్వాత ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, అభివృద్ధి చెందిన దేశంగా అవతరి స్తుందని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నయా ఉదారావాద విధానాలతో 'వికసిత్ భారత్' విధాన పత్రాన్ని విడుదల చేస్తే, దానికి కాపీగా 'స్వర్ణాంధ్ర-2047'ని రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. ఇది, పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్న చందంగా ఉంది. దేశానికి స్వాతంత్ర్యం లభించి 2047 నాటికి వందేళ్లు పూర్తవుతుందనే ఉద్దేశ్యంతో, ఇదంతా అమృత కాలమంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ నినాదం ఎత్తుకుంది. మరి, 2047కు ఏపీకి ఉన్న బాదరాయణ సంబంధమేమిటో? ఎవరికీ తెలియదు. విజన్ 2020లో 'వ్యవ సాయం దండుగ' అని చెప్పిన చంద్రబాబు నాయుడు, మొఖం వాచే చివాట్లకు జడిసి, ఇప్పుడు వ్యవసాయరంగాన్ని ఎగుమతి ఆధారిత, వాణిజ్య కేంద్రకంగా రాష్ట్రంలో మార్పులు తీసుకొ స్తామని విజన్ రూటు మార్చుకున్నారు. మొత్తం వ్యవసాయ భూమిలో 47 శాతం ప్రకృతి వ్యవసాయం చేసేలా, 40 శాతం సాగుభూమి పెద్ద పెద్ద వ్యవసాయ క్షేత్రాలకు మార్పు జరిగేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నది. చేపలు, రొయ్యలు, పౌల్ట్రీ, ఇతర వ్యవసాయాధారిత అనుబంధ వాణిజ్య పంటలే రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి, రైతు సంక్షేమానికి ముఖ్యమనీ ఈ విజన్ పత్రం పేర్కొంది. కానీ, రాష్ట్రంలో రైతులు, కౌలు రైతులు, రైతు కూలీలు ఎదుర్కొంటున్న దుస్థితి గురించి, వాటి పరిష్కార మార్గాల గురించి విజన్ డాక్యుమెంట్లో ఎక్కడా కనిపించదు. వారికి అందించాల్సిన మద్దతు ధర, మార్కెటింగ్ వ్యవస్థ, పెట్టు బడి కల్పన, పోలవరం లాంటి ముఖ్యమైన నీటి ప్రాజెక్టుల నిర్మాణం, వాటికి తగిన నిధుల కేటాయింపు వంటి నిర్మాణాత్మక, వాస్తవిక విషయాలకు ఈ విజన్లో స్థానమే లేదు. ఇది వ్యవసాయాన్ని బాగు చేయకపోగా, భూములను పెద్ద ఎత్తున ధనవంతులకు, కార్పోరేట్లకు కట్టబెట్టడానికి, చిన్న సన్నకారు రైతుల భూములు ఏదో ఒక మార్గంలో లాక్కోవడానికి పరోక్ష ప్రణాళికలు మాత్రం రూపొందించారు.

ఇక పారిశ్రామిక రంగంలో అద్భుతాలు జరగబోతున్నట్టు, రూ.11.97 లక్షల కోట్ల పెట్టబడుల వరద రాష్ట్రానికి రాబోతు న్నట్టు విజన్ డాక్యుమెంట్లో ఓ రంగుల కల చూపారు. 25 పారిశ్రామిక క్లస్టర్లు, 500 పారిశ్రామిక ఎస్టేట్లు ఏర్పాటు చేస్తామంటున్నారు. చేతిలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటు పరమౌతుంటే నిలువరించే దిక్కు లేదు కానీ, ప్రైవేట్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పుతామని గొప్పలు చెప్పడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఈ పరిశ్రమలన్నింటికీ కావాల్సిన 2 లక్షల ఎకరాల భూమిని మొదట పెట్టుబడిదారులకు అప్పజెప్పి, వారికి విద్యుత్ రాయితీ లు, నీరు, రోడ్లు, రైల్, పోర్టు కనెక్టివిటీ సదుపాయాలు కూడా ప్రభుత్వమే కల్పిస్తుందని చెప్పారు. కానీ, వాస్తవ పరిస్థితి చూస్తే ఇప్పటికే కేటాయించిన భూముల్లో, సెజ్‌ల్లో, క్లస్టర్లలో పరిశ్ర మలు రాక అవన్నీ ఖాళీగా పడున్నాయి. మరోవైపు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వరంగ పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమ్మకానికి పెడుతున్నది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడుతున్నాయి. గత పదేళ్లలో అనేక సదస్సులు

నిర్వహించినా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చిన జాడే లేదు. ఈ ఆర్థిక సంక్షోభ కాలంలో అవి వస్తాయనే నమ్మకం కూడా లేదు. ఈ విజన్ పేరుతో రైతుల భూములను, ప్రభుత్వ భూములను, ప్రభుత్వ ఆస్తులను, సహజ వనరులను, అటవి సంపదను కార్పోరేట్లకు ధారాదత్తం చేయడానికి ఒక పెద్ద వ్యూహాన్నే రచించారనేది విస్పష్టం.

విజన్ 2047 చెబుతున్నట్టుగా 20 లక్షల ఉద్యోగాల కల్పన అనేది కూడా ఒక భ్రమ మాత్రమే. వారు చెప్పే ఈ ఉద్యోగాలన్నీ తక్కువ వేతనంతో, కనీస భద్రతా లేకుండా మానవ వనరుల శ్రమశక్తిని భారీగా దోపిడికి గురిచేసేవే! ఆర్థిక సంక్షోభం పెరిగే కొద్దీ నిరుద్యోగం పెరుగుతుంది. ఇప్పటికే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య విలయతాండవం చేస్తున్నది. పేదరిక నిర్మూలన కోసం ప్రతిపాదించిన పరిష్కారాలను చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. బాగా సంపద ఉన్న పైఅంతస్తులోని 10 శాతం మంది సంపన్నులు, పేదరికంలో మగ్గుతున్న అట్టడుగున ఉండే 20 శాతం మంది పేదల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక సహాయం చేస్తారట! దాంతో పేదరికం తగ్గుతుందట! ఎలా చేస్తారో చెప్పలేదు. మరింత దోచుకోకుంటే చాలు. ఈ మాయ వల్ల పేదరిక నిర్మూలన, ఇంటికో పారిశ్రామికవేత్త అనే భ్రమల్లో ప్రజలు తమకున్న కొద్దిపాటి ఆస్తులు కోల్పోయి వలస కూలీలుగా మారే ప్రమాదం ఉంది.

"భూమిపై హక్కు, విద్యావకాశాలు, ఆరోగ్యం, సమానావకాశాలు, మార్కెట్ వ్యవస్థలో పాల్గనే ఆర్థిక స్వేచ్ఛ, ప్రభుత్వ పాలనలోనూ, విధాన నిర్ణయాల్లోనూ భాగస్వామ్యం. ఇలా ప్రజలకు అన్ని విషయాల్లో బలాన్ని ఇస్తే తప్ప అభివృద్ధి సాధ్యం కాదు. పేదరికం పోదు" అని ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ ఎప్పుడో చెప్పారు. ఈ ఆర్థిక సూత్రాలకు పూర్తి విరుద్ధంగా తయారైన చంద్రబాబు కుహనా విజన్ ప్రజల సామర్థ్యాన్ని పెంచేది కాదు. ఆయన విజన్‌లో భూమి, జలవనరులు, అటవి సంపద, దుర్బలులైన ప్రజలకు కొత్త బలాన్ని ఇవ్వకుండా, వారి శ్రమను దోచుకునే ప్రయివేట్ కంపెనీలకు, ప్రభుత్వంలో ఉన్న వారికి బలాన్ని ఇస్తాయి. ధనవంతుల ఆదాయం పెరగడం వల్ల తలసరి ఆదాయం పెరుగుతుంది, కానీ 'గణాంక మాయాజాలం'లో పేదలు మరింత పేదలవుతారే తప్ప టీడీపీ చెప్తున్నట్టుగా పేదరికం పోయే అవకాశం లేదు. సమాన అవకాశాలు, సమాన వనరులు, అధికారంలో భాగస్వామ్యం వల్లనే పేదరిక నిర్మూలన సాధ్యపడుతుంది. కానీ, ఇప్పటి వరకు చంద్రబాబు విడుదల చేసిన మూడు విజన్ డాక్యుమెంట్లలో ఈ విషయాలపై చర్చ కాదు కదా, కనీసం ఒక్క అక్షరమాత్రపు ప్రస్తావన కూడా లేదు.

విజన్ 2047 సాధించాలంటే వరుసగా రెండు దశాబ్దాలకు పైగా వారే పాలనలో ఉండాలి. అంటే, టీడీపీ వచ్చే నాలుగు ఎన్నికల్లో వరుసగా గెలవాలి. ఒక ఎన్నికలో ఓడినా. ఆ వచ్చే రాజెవరో? మంత్రెవరో? ఈ అనిశ్చిత రాజకీయ పరిస్థితికి ఇంత పెద్ద విజన్ ప్రకటన చూస్తే. పనితీరుతో ప్రమేయం లేకుండా అన్నిసార్లూ తామే గెలవాలనే దురాశ కనిపిస్తుందే తప్ప దూరదృష్టి కనిపించదు. వరుస ఎన్నికలు గెలవాలంటే ప్రజా విశ్వాసం నిరవధికంగా చూరగొనాలి. దీనికోసం వాళ్లు చేయాల్సిన మొదటిపని ఇచ్చిన హామీలు, చెప్పిన మాటలు నిలబెట్టుకోవాలి. ఎందుకంటే, సూపర్ సిక్స్ ఆశ చూపి సామాన్యుల ఓట్లు దండుకొని గెలిశారే తప్ప, ఎన్నికలకు ముందే 'విజన్ 2047' అని ఉంటే ప్రజల స్పందన వేరేలా ఉండేదేమో!


ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఇప్పుడు కావాల్సింది విజన్లు కాదు విభజన హామీల అమలు! విభజన హామీలను దశాబ్ద కాలంగా గాలికి వదిలేశారు. ఎన్డీయే ప్రభుత్వాన్ని అడిగి, డిమాండ్ చేసి సాధించుకునే అవకాశం ఉన్నా ఒత్తిడి తీసుకురావడంలో విఫలమైన టీడీపీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా తేలేకపోయింది. అంతే కాకుండా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలి, బుందేల్ ఖండ్ తరహాలో వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ తీసుకురావాలి, కడప స్టీల్, దుగ్గరాజుపట్నం పోర్టులను నిర్మించాలి. నూతన రైల్వే జోన్, పెట్రోలియం యూనివర్సిటీ, విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, విజయవాడ, విశాఖలో మెట్రో రైల్, ఇలా ఎన్నో విభజన హామీలు ఇప్పటికీ కలగానే మిగిలాయి.

ప్రత్యేక హోదా వచ్చి ఉంటే 10 ఏళ్లలో పన్నుల్లో రాయితీలు ఉండేవి. చెప్పుకోదగ్గ సంఖ్యలో కొత్త పరిశ్రమలు వచ్చేవి. లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించేవి. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యి ఉంటే రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేది. విజయవాడ, విశాఖలో మెట్రో రైల్ నిర్మాణం జరిగితే ప్రధాన నగరాలుగా అభివృద్ధి చెందేవి. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు అంది ఉంటే పేదరిక నిర్మూలన దిశగా అడుగులు పడేవి. కానీ, విభజన హామీల గురించి ఒక్క మాట కూడా విజన్ 2047 మాట్లాడటం లేదు. ప్రజలకు ఆర్థికంగా, సామాజికంగా బలాన్నిచ్చే ఉద్యోగాలు, సమానావకాశాలు, రాజధాని నిర్మాణం, రైతులకు గిట్టుబాటు ధర, వీటి మీద సూపర్ సిక్స్ హామీలు రాబోయే నాలుగేళ్లలో ప్రజలు ప్రధానంగా ఆశించిన ఈ ప్రాథమిక అంశాల్ని నెరవేర్చడమే రాష్ట్రంలోని సంకీర్ణ ప్రభుత్వ తక్షణ కర్తవ్యం కావాలి. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని, ప్రజల కనీసావసరాలకు ప్రాధాన్యత ఇచ్చి, అందుకనుగుణంగా కార్యక్రమాలు రూపొందించుకుంటేనే ఏ విజన్ పత్రమైనా నమ్మడానికి ఉంటుంది. అది వారికే మంచిది, లేదంటే, 'విజన్' ముసుగుతో ఒక ఊహాపత్రం విడుదల చేసిన ప్రతిసారి ప్రజల స్పందన ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి వర్తమాన చరిత్రే సాక్ష్యం. ❑

# ప్రజలను అవహేళన చేస్తున్న బడ్జెట్



- ప్రభాత్ పట్నాయక్




**2025 ఫిబ్రవరి ఒకటవ తేదీన ప్రవేశ పెట్టిన బడ్జెట్ మాదిరిగా శ్రామిక ప్రజా బాహుళ్యపు జీవితాల గురించి ఇంత బాహాటంగా అవహేళన చేసిన బడ్జెట్ స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో ఇంకొకటి రాలేదు. పన్నులను తగ్గించి మధ్య తరగతి వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థకు చురుకుదనం తీసుకురావడమే ఈ బడ్జెట్ వెనుక వ్యూహం అని ఆర్థిక మంత్రితో సహా ఆర్థిక పండితులందరూ ఒప్పుకుంటారు. అటువంటి వ్యూహం ఫలించాలంటే పన్నుల తగ్గింపు ద్వారా పెరిగే మధ్య తరగతి వినిమయం కాస్తా వేరే ఖాతాల్లో ప్రభుత్వ వ్యయానికి కోత పెట్టడం వలన తగ్గే వినిమయంతో చెల్లు అయిపోకుండా ఉండాలి. అప్పుడు పెరిగిన మధ్య తరగతి వినిమయం మొత్తంగా స్థూల డిమాండ్ స్థాయిని పెంచుతుంది. తద్వారా ఆర్థిక వ్యవస్థకు చురుకుదనం కలుగుతుంది. ఐతే ఇప్పుడు తగ్గించిన పన్నుల వలన ప్రభుత్వం కోల్పోతున్న ఆదాయాన్ని భర్తీ చేయడం కోసం ప్రభుత్వ వ్యయంలో కోత పెడుతున్నారు.**

2024-2025తో (సవరించిన అంచనాల ప్రకారం) పోల్చితే 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ వ్యయం నామమాత్రపు ధరల ప్రాతిపదికన కేవలం 7.4 శాతం మాత్రమే పెరగనుంది. పెరిగే ధరలను పరిగణనలోకి తీసుకుంటే వాస్తవ పెరుగుదల ఏమీ లేనట్టే. అంతే కాదు, వాస్తవానికి దేశ జిడిపితో పోల్చితే తగ్గుతుంది.

## ప్రభుత్వ వ్యయం ఎక్కడెక్కడ తగ్గనుందో చూద్దాం

ఆహార సబ్సిడీని నామమాత్రపు ధరల ప్రకారం 3 శాతం మాత్రమే పెంచారు. అంటే 2023-24 వాస్తవ ఖర్చుతో పోల్చితే తగ్గిపోయింది. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 2024-25లో సవరించిన అంచనాల ప్రకారం రూ.86,000 కోట్లు కేటాయించారు. ఇప్పుడూ అంతే కేటాయించారు. అంటే పెరుగుదల ఏమీ లేదన్నమాట. ఇక 2023-24లో వాస్తవంగా రూ.89,154 కోట్లు ఖర్చుచేశారు. ఆ ఏడాదితో పోల్చితే ఇప్పుడు కేటాయింపు పడిపోయింది. జనవరి 25 నాటికి ఉపాధి హామీ బకాయిలు రూ.6,950 కోట్లు ఉన్నాయి. ఆ మొత్తాన్ని మినహాయించితే ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ పద్దుకు కోత పెట్టారని స్పష్టమౌతోంది.

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు 2024-25 బడ్జెట్‌లో కేటాయించిన మొత్తంకన్నా నామమాత్రపు ధరల ప్రకారం 9.5 శాతం పెరుగుదల ఉన్నట్టు లెక్క. అయితే జిడిపితో పోల్చి చూస్తే ఈ పద్దుకు కేటాయింపు తగ్గింది. గత ఏడాది బడ్జెట్‌లో పాఠశాల విద్యకు రూ.73,000 కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది రూ.78,600 కోట్లు కేటాయించారు. ఇక్కడ కూడా జిడిపిలో గత ఏడాదికన్నా తక్కువ శాతమే పాఠశాల విద్యకు కేటాయింపు జరిగింది. సాక్ష్యం అంగన్‌వాడీ పోషణ్-2 (గతేడాది కన్నా నామమాత్రపు ధరల ప్రకారం 3.6 శాతమే పెరుగుదల), ప్రధానమంత్రి పోషణ్ (నామమాత్రపు ధరలతో పోల్చినా గతేడాది ఎంత కేటాయించారో ఇప్పుడూ అంతే కేటాయించారు). ఆ విధంగా సామాజిక రంగాలను మొత్తంగా చూసినప్పుడు కేటాయింపులు తగ్గాయి.

సామాజిక రంగానికి కేటాయింపులను తగ్గించడం ద్వారా, ఆహార సబ్సిడీకి, ఉపాధి హామీకి తగ్గించడం ద్వారా మధ్య తరగతి జీతగాళ్ళకు పన్నులలో తగ్గింపులు ఇవ్వడం అంటే సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనాలు పొందే పేద, శ్రామిక ప్రజా బాహుళ్యపు కొనుగోలు శక్తికి కోత పెట్టి దానిని మధ్య

తరగతిలోని ఒక భాగానికి బదలాయించడమే.

ఆ విధంగా చూస్తే 2025-26 బడ్జెట్ మొత్తం ఆర్థిక వ్యవస్థకు ఎటువంటి చురుకుదనాన్నీ తీసుకు రాలేకపోగా శ్రామిక వర్గపు పేద జనాన్ని బలిపెట్టి మధ్యతరగతి జీతగాళ్ళకు రాయితీలు ఇచ్చింది. సంపన్న వర్గాలను ఏ మాత్రమూ అంటుకోకుండా పేద శ్రామికుల నుండి కొనుగోలు శక్తిని మధ్యతరగతికి పున: పంపిణీ చేస్తూ, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిని సంతృప్తి పరిచేలా ద్రవ్యలోటును ఏమీ మార్చకుండా కొనసాగించారు. దీనర్థం మధ్యతరగతి జీతగాళ్ళకు ఏ విధమైన పన్ను రాయితీలూ ఇవ్వకూడదని కాదు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో వారికి రాయితీలు ఇవ్వాలి. ఐతే అందుకోసం నిరుపేద శ్రామికవర్గాన్ని బలి చేయకూడదు కదా. కాని 2025-26 బడ్జెట్ అనుసరించినది ఇదే వ్యూహం. ఈ వ్యూహం వలన ఆర్థిక వ్యవస్థ మందకొడితనాన్ని అధిగమించలేకపోతున్నది కాని ఇందులో మూడు లక్షణాలు ఈ బడ్జెట్‌ను ఎన్‌డిఏ కూటమికి ఆకర్షణీయంగా చేస్తున్నాయి.

- **మొదటిది** : శ్రామిక పేదల కొనుగోలు శక్తిని కుదించడం వలన వారు సాధారణంగా కొనుగోలు చేసే సరుకులకు డిమాండ్ తగ్గిపోతుంది. మామూలుగా ఇటువంటి సరుకులు ఎక్కువగా చిన్న చిన్న ఉత్పత్తిదారుల వద్ద తయారౌతాయి. మధ్య తరగతి కొనుగోలు శక్తి పెంచినందువలన వారు కొనుగోలు చేసే సరుకులకు డిమాండ్ పెరుగుతుంది. వీరు కొనుగోలు చేసే సరుకులు ఎక్కువగా సంఘటిత రంగంలో గుత్తాధిపత్య సంస్థలు ఉత్పత్తి చేస్తాయి. అంటే ఈ వ్యూహం వలన గుత్త పెట్టుబడి ప్రయోజనాలు బాగా నెరవేరుతాయి. ఇది మార్క్స్ చెప్పిన "పెట్టుబడి కేంద్రీకరణ" క్రమాన్ని వేగవంతం చేస్తుంది. ఈ క్రమంలో చిన్న పెట్టుబడులను దెబ్బ తీయడం ద్వారా పెద్ద పెట్టుబడి పెరుగుతుంది. నేటి భారతదేశ రాజకీయ రంగంలో కార్పొరేట్-హిందుత్వ కూటమి ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది. ఆ కూటమిలోని ఒక స్తంభంగా ఉన్న కార్పొరేట్ల ప్రయోజనాలను ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ఈ విధంగా నెరవేరుస్తోంది.
- **రెండవది** :అధికారిక గణాంకాల్లో అసంఘటిత రంగంలో (చిన్నస్థాయి ఉత్పత్తి రంగం) పడిపోతున్న డిమాండ్‌ను, దాని ఫలితంగా తగ్గుతున్న ఉత్పత్తిని సక్రమంగా లెక్కించడం లేదు. ఇక స్వల్పకాలిక అంచనాల దగ్గరకొస్తే కార్పొరేట్ రంగంలో జరిగేదాన్నే మొత్తం ఆర్థిక వ్యవస్థకంతటికీ వర్తింప జేయడం ఒక అలవాటు అయిపోయింది. ఈ విధంగా చేయడం వలన ఆర్థిక వ్యవస్థ చాలా బాగా ఉన్నట్టు లెక్కలు చూపిస్తాయి. కార్పొరేట్లకు మంచి ఫలితాలు వస్తే మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థకంతటికీ మంచి ఫలితాలు వచ్చినట్టే లెక్క. ఈ లెక్కలు చూపించి ఒక పక్కన కార్పొరేట్లను సంతోష పెడుతూనే, ప్రభుత్వం కూడా తాను ఆర్థిక వ్యవస్థను వేగంగా ముందుకు నడిపిస్తున్నట్టు గొప్పలు చెప్పుకోవచ్చు.
- **మూడవది** : మధ్య తరగతికి పన్ను రాయితీలు ఇచ్చినది చాలా స్పష్టంగా కనిపిస్తుంది. కాని, అందుకోసం ఎవరు మూల్యం చెల్లించ వలసి వస్తోంది అన్నది మాత్రం బడ్జెట్‌లో స్పష్టంగా కనిపించదు. అందుచేత ఏ పేదల కొనుగోలు శక్తినైతే తాను దెబ్బ తీస్తోందో ఆ పేదల మద్దతును కోల్పో కుండానే మధ్యతరగతి నుండి అదనంగా మద్దతును పొందగలుగుతానని ప్రభుత్వం భావిస్తోంది. పేదల దారిద్ర్యానికి రకరకాల కారణాలను చూపించవచ్చు. తద్వారా బడ్జెట్‌లో అనుసరించిన వ్యూహం గురించి ఆ పేదలు పట్టించుకోకుండా చూసుకోవచ్చు. పైగా, శ్రామిక ప్రజల్లో తన మద్దతు గనుక తగ్గే పరిస్థితి ఉంటే హిందుత్వ వ్యూహాన్ని ఎటుదిరిగీ ముందుకు తేవచ్చు. తద్వారా వారిని తప్పుదోవ పట్టించనూవచ్చు.

బడ్జెట్‌లో అనుసరించిన 'వ్యూహం' గురించి మరీ మనం ఎక్కువగా ఊహించుకుంటున్నామా అని సందేహం రావచ్చు. కాని, ఈ మధ్య ఎన్‌డిఏ ప్రభుత్వం తరచూ మధ్యతరగతిని పొగడ్తలతో ముంచెత్తడం చూస్తే అటువంటి అనుమానాలు తొలగిపోతాయి. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో దేశాధ్యక్షులు ద్రౌపది ముర్ము ప్రసంగంలో వర్తమాన అంశాలపై ప్రభుత్వ దృక్పథాన్ని వివరిస్తూ ఆ క్రమంలో మధ్యతరగతిని ఆకాశానికెత్తేశారు. ఆర్థికమంత్రి పదే పదే మధ్య తరగతిని ప్రశంసిస్తూ ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింప చేసే శక్తి ఆ తరగతికే ఉందని ప్రకటించారు. ఇవన్నీ పరిశీలించినప్పుడు ఈ బడ్జెట్ ఏదో హడావుడిగా పైపైన యాదృచ్ఛికంగా రూపొందించిన విధానాలను బట్టి తయారైంది కాదని, మధ్య తరగతికి, శ్రామిక వర్గ ప్రజానీకానికి మధ్య ఒక చీలికను సృష్టించడం ద్వారా కార్పొరేట్-హిందుత్వ కూటమికి కొంత అదనపు మద్దతును సమీకరించే ఉద్దేశంతో తయారైనదని అర్థమౌతుంది. అదే సమయంలో అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిని కూడా ఇది సంతుష్టపరుస్తుంది. నయా ఉదారవాద సాంప్రదాయానికి అనుగుణంగా ఈ బడ్జెట్‌లో సంపన్నులపై అదనపు పన్నులేమీ వేయలేదు. ద్రవ్య లోటును కూడా ఏమీ పెంచలేదు. ఇక్కడే ప్రభుత్వపు దృష్టి బైట పడుతోంది. శ్రామిక ప్రజల ప్రయోజనాలను బలిపెట్టి మధ్య తరగతిలో తన మద్దతును పెంచుకోడానికి ప్రభుత్వం సిద్ధపడుతోంది. అంకెల్లో తన పాలన మెరుగైనదిగా చూపించుకోవడం కోసం అది శ్రామిక ప్రజానీకాన్ని నష్టపరుస్తోంది. పెట్టుబడిదారీ సమాజంలో ఇది తరచూ జరిగేదే. కాని భారతదేశంలో మాత్రం ఇది కొత్తగా జరుగుతోంది. మన దేశంలోని పాలకవర్గాలు ఎప్పుడూ తాము

**మిగతా 16వ పేజీలో**

# ఆదర్శ రాజ్యంలో ఆకలి మంటలు



- క్రిస్టోఫ్ జాఫ్రెలాట్

ట్రంప్ తీసుకున్న నిర్ణయాల కారణంగా అమెరికా నుండి తరలించబడే భారతీయుల్లో గుజరాతీయులే ఎక్కువ అన్నది తాజా వార్త. భారతదేశం నుండి అక్రమంగా అమెరికాలో అడుగుపెట్టిన వారి సంఖ్య 67,391. అందులో గుజరాత్‌వాసులు 41,330. ఈ విధంగా దొడ్డిదారిన ఖండాలు దాటి అమెరికాలో ప్రవేశించటం అంటే ఆషామాషీ కాదు. డింగుచా గ్రామం నుండి కెనడా సరిహద్దుల్లోగుండా అమెరికాలో ప్రవేశించేందుకు ప్రయత్నించిన జగదీష్ పటేల్, అతని భార్య, ఇద్దరు పిల్లలు మంచువానకు దాదాపు సజీవ సమాధి అయినంత పనైంది. గుజరాతీలు ఆఫ్రికా నుండి అమెరికా వరకూ బతుకుదెరువు కోసం వెళ్లటం కొత్తేమీ కాదు. ఈ కాలంలో రాష్ట్రం సంపన్న రాష్ట్రమైంది. దేశానికే ఆదర్శరాష్ట్రంగా ప్రచారమూ జరుగుతోంది. ఏ రాష్ట్రంలోనూ లేనంతగా గుజరాత్‌లో తలసరి ఆదాయం రూ.1,81,963. జాతీయ సగటు తలసరి ఆదాయం 99,404 రూపాయలతో పోలిస్తే దాదాపు రెట్టింపు. మరి అటువంటి ఆదర్శరాష్ట్రం, ఆర్థికాభివృద్ధిలో దేశానికే పాఠాలు నేర్పిన రాష్ట్రం నుండి కూలీలు బతుకుదెరువు కోసం పొట్ట చేతపట్టుకుని దేశాలు, ఖండాలు దాటి ఎందుకు వెళ్తున్నారు? సమాధానం చెప్పటం తేలికే. గుజరాత్‌లో ఎంత మంది కుబేరులు వున్నారో అంతకన్నా వేల రెట్లు బికారులున్నారు. పనిచేయటానికి చేతినిండా పని కల్పించలేకపోతోంది రాష్ట్ర ప్రభుత్వం.

### కటిక దారిద్ర్యానికి కేంద్రం

రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ పెరుగుతున్న వేగానికి అనుగుణంగా ఉపాధి కల్పన జరగటం లేదు. ఉన్న ఉద్యోగాలైనా కార్మికుల కడుపు నింపేవిగా ఉన్నాయా అంటే అదీ లేదు. ఉత్పత్తికి అవసరమైన శ్రమ రాను రాను సంఘటిత రూపం వదిలి అసంఘటితరూపం తీసుకొంటోంది. అంటే గతంలో పని చేసేవారికి కొన్ని కనీస భద్రతలుండేవి. ఇప్పుడు ఏ భద్రతా లేని వాతావరణంలో కష్టపడాల్సి వస్తోంది. సంఘటిత లేదా వ్యవస్థాగత శ్రమకు మరో రూపం పని చేసే వారికి, పని ఇచ్చే వారికి మధ్య ఉండే కాంట్రాక్టు. ఈ కాంట్రాక్టులు (నియామకాలు) ఏదో ఒకస్థాయిలో రాతపూర్వకంగా ఉంటే అందులో కార్మికులకు ఒకటో రెండో హక్కులు ఉంటాయి. 2022లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన కార్మిక సర్వే (గణాంక నిపుణుల భాషలో పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే




అంటారు) గుజరాత్‌లో నోటిమాటే కాంట్రాక్టుగా పనిచేసే కార్మికులు 72 శాతంగా ఉన్నారు. వీరికి ఫలానా యజమాని నుండి ఫలానా జీతభత్యాల ప్రాతిపదికన ఫలానా సమయం నుండి ఫలానా సమయం వరకూ పని ఇస్తున్నామని రాతపూర్వకంగా ఇవ్వరన్నమాట. ఇటువంటి కార్మికులు కర్ణాటకలో 41 శాతం, తమిళనాడులో 53 శాతం, కేరళలో 57 శాతం, మధ్యప్రదేశ్‌లో 64 శాతం, హర్యానాలో 65 శాతం, మహారాష్ట్రలో 68 శాతం ఉన్నారు. ఎటువంటి కాంట్రాక్టు లేకుండా పనిచేయటం అంటే పనికీ గ్యారంటీ ఉండదు. జీతాలకూ గ్యారంటీ ఉండదు. దీన్నే వ్యవస్థాగత శ్రమశక్తిని అసంఘటిత శ్రమశక్తిగా మార్చటం అంటారు. సాధారణ భాషలో చెప్పుకోవాలంటే కార్మికులను, ఉద్యోగులనూ భద్రత కలిగిన ఉద్యోగాల నుండి తొలగించి భద్రతలేని అడ్డా మీది కూలీలుగా మార్చటం. కాజువల్ కార్మికుల సగటు వేతనం జాతీయ స్థాయిలో రోజుకు 433 రూపాయలు. కానీ గుజరాత్‌లో మాత్రం కేవలం 375 రూపాయలే. ఇది జాతీయ సగటు దినసరి వేతనం కంటే తక్కువ. సగటు దినసరి వేతనాలు కేరళలో అత్యధికంగా 836 రూపాయలు ఉంటే, తమిళనాడులో 584 రూపాయలు, హర్యానాలో 486 రూపాయలు, పంజాబ్‌లో 449, కర్ణాటకలో 447, రాజస్థాన్‌లో 442, ఉత్తరప్రదేశ్‌లో 432, బీహార్‌లో 426 రూపాయలుగా ఉంది. దేశంలో కాజువల్ వర్కర్‌కు గుజరాత్ కన్నా తక్కువ దినసరి సగటు వేతనం ఉన్న రాష్ట్రం చత్తీస్‌గడ్ ఒక్కటే.

పేదరికం తీవ్రతను అర్థం చేసుకోవడానికి వేతనాలు ఒక్కటే కొలమానం కాదు. గుజరాత్‌లో పట్టణ, గ్రామీణ ప్రజల నెలసరి కుటుంబ ఖర్చులు ఆ రాష్ట్రంలోని పేదరికం తీవ్రతను మరింత కొట్టొచ్చినట్లు చూపిస్తాయి. జాతీయ నమూనా సర్వే సంస్థ

2022-23 సంవత్సరానికి చేసిన అధ్యయనం ప్రకారం గుజరాత్‌లో గ్రామీణ ప్రజలు నెలకు 3,798 రూపాయలు కంటే మించి ఖర్చుపెట్టే స్థితిలో లేరు. పట్టణ ప్రాంత ప్రజల నెలసరి ఖర్చు కేవలం 6,621 రూపాయలు మాత్రమే. తమిళనాడు గ్రామీణ ప్రాంత ప్రజలు 5,130 రూపాయల నెలసరి ఖర్చుతో జీవితం వెళ్లదీస్తుంటే పట్టణ ప్రాంత ప్రజల నెలసరి ఖర్చు 7,666. కేరళలో గ్రామాల్లో 5924, పట్టణాల్లో 7,707, ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రజల నెలసరి ఖర్చు 4,870, పట్టణప్రాంత ప్రజల నెలసరి ఖర్చు 6,872. హర్యానాలో గ్రామాల్లో 4,859, పట్టణాల్లో 7,911. మహారాష్ట్రలో గ్రామాల్లో 4,010, పట్టణాల్లో 6,657గా ఉంది. పేదరికాన్ని మరింత సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఐక్యరాజ్యసమితి బహుముఖ దారిద్ర్య సూచిని రూపొందించింది. ఈ సూచిక కేవలం ఒక కుటుంబం నెలకు చేసే ఖర్చుతోపాటు కుటుంబంలో విద్య, వైద్యం కోసం పెడుతున్న ఖర్చులను కూడా లెక్కలోకి తీసుకుంటుంది. వీటన్నిటినీ కలిపి చూస్తే గుజరాత్ ఈ సూచికల్లో అత్యంత దిగువ స్థానాల్లో ఉంది. గుజరాత్, బెంగాల్‌లు దురవస్థ విషయంలో పోటీ పడుతున్నాయి. మిగిలిన రాష్ట్రాల్లో పేదల పరిస్థితి ఈ రాష్ట్రాల కంటే ఎంతో కొంత మెరుగ్గానే ఉంది. గుజరాత్‌లో ఆహార భద్రత లేని కుటుంబాలు రాష్ట్ర జనాభాలో 38 శాతం ఉన్నాయి. గుజరాత్‌కంటే ఎక్కువ మంది ఆకలితో ఉన్న రాష్ట్రాలు బీహార్, జార్కండ్‌లు మాత్రమే. దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంలో అత్యంత కటిక దారిద్ర్యం ఎలా పేరుకుపోతోంది ? ఈ కటిక దారిద్ర్యాన్ని అధిగమించే ప్రయత్నంలోనే ప్రజలు ఎంతో కొంత మెరుగైన జీవితాలు ఆశించి అక్రమ మార్గాల్లోనో, సక్రమ మార్గాల్లోనో ఇతర దేశాలకు వెళ్లి బతకటానికి సిద్ధమవుతున్నారు. అమెరికాలో అక్రమంగా ప్రవేశించిన 42 వేల గుజరాతీయులు ఈ కోవకు చెందిన వారే. కాలు కడుపులు చేబట్టుకుని కారు చీకట్లో ప్రయాణించి ఇతర దేశాలకు వెళ్లటానికి ప్రయత్నం చేస్తున్నారు.

### పరిమిత ఉపాధి, పెట్టుబడి కేంద్రీకరణ, గుత్తాధిపత్యం దిశగా ఆర్థిక వ్యవస్థ

ఈ పరిస్థితికి కారణాలు తెలుసుకోవాలంటే 2001 తర్వాత మోడీ నాయకత్వంలో గుజరాత్ ప్రయాణించిన ఆర్థికాభివృద్ధి మార్గాన్ని అర్థం చేసుకోవాలి. 2001 నుండి 2014 మధ్య కాలంలో గుజరాత్ విద్య, వైద్య, గ్రామీణాభివృద్ధి రంగాలను గాలికొదిలేసి కేవలం పారిశ్రామిక వృద్ధి లక్ష్యంగా మౌలిక వసతులు, పెట్రో కెమికల్ కాంప్లెక్సులు కట్టుకుంటూ పోయారు. నౌకాశ్రయాలు, బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు శుద్ధి పరిశ్రమలు నిర్మించుకుంటూ పోయారు. ఇంకా చెప్పాలంటే శ్రమాధారిత పరిశ్రమలు స్థానే పెట్టుబడి కేంద్రీకృత పరిశ్రమలకు పెద్ద పీట వేసింది. అప్పటి వరకూ సాంప్రదాయకంగా అనుసరిస్తూ వచ్చిన గుజరాత్ ఆర్థికాభివృద్ధి నమూనాకు ఇది పూర్తి భిన్నమైనది. చిన్న మధ్య తరహా పరిశ్రమలకు కేంద్రంగా ఉన్న రాష్ట్రం గుజరాత్. ప్రభుత్వాలు కూడా ఈ పరిశ్రమలకు పెద్దఎత్తున ఊతమిచ్చేవి. 1990 దశకం నాటికి కూడా చిన్న మధ్య తరహా పరిశ్రమల కేంద్రంగానే ఉంది ఈ రాష్ట్రం. ఈ పరిశ్రమల్లోనే ఎక్కువమందికి ఉపాధి దొరికేది.

2003లో మోడీ అమల్లోకి తెచ్చిన నూతన పారిశ్రామిక విధానంపై సాంప్రదాయక ఆర్థిక విధానాలకు తిలోదకాలిచ్చింది. 2009 పారిశ్రామిక విధానం తర్వాత ఇక ఉపాధి ఊసే ప్రభుత్వ ప్రకటనల్లో కనుమరుగైంది. రాష్ట్రంలోని పారిశ్రామిక వాడల్లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు అవసరమైన చట్టపరమైన అడ్డంకులు తొలగించే లక్ష్యంతో గుజరాత్ ప్రత్యేక ఆర్థికమండళ్ల చట్టాన్ని మోడీ ప్రభుత్వం ఆమోదించింది. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించటమే ఈ చట్టం లక్ష్యం. దేశంలోనే కాక విదేశాల నుండి పెట్టుబడులు ఆకర్షించేందుకు అనువైన రాష్ట్రంగా గుజరాత్‌ను తీర్చి దిద్దాలన్నది 2009లో ప్రభుత్వం రూపొందించిన పారిశ్రామిక విధానం సారాంశం. మూడు బిలియన్ డాలర్లు విలువైన పరిశ్రమల మొదలు 10 బిలియన్ డాలర్లు విలువైన పరిశ్రమలను రాష్ట్రానికి ఆకర్షించాలన్నది మోడీ లక్ష్యం. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రభుత్వం కల్పించదల్చుకున్న ఉపాధి అవకాశాలు కేవలం రెండు వేలు. అంటే ఐదు లక్షల పెట్టుబడికి ఒక ఉద్యోగం అన్నమాట. ఈ విధానం ద్వారా శ్రమాధారిత ఆర్థిక వ్యవస్థస్థానే పెట్టుబడి కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థకు మోడీ పాలనలో పునాదులు పడ్డాయి. ఆ స్థాయి పరిశ్రమలు ఆహ్వానించాలంటే వాళ్లు అడిగినంత భూమి అడిగిన పద్ధతుల్లో అందచేయాలన్నది 2009 నాటికి మోడీ విధానంగా ఉంది. ప్రత్యేక ఆర్థికమండళ్ల కోసం, లేదా ప్రైవేటు పరిశ్రమాధిపతులకు అమ్మటం, లేదా 99 ఏళ్లకు లీజుకివ్వటానికి వీలుగా చట్టాలు, నియమాలు రూపొందించింది మోడీ ప్రభుత్వం. నూతన పారిశ్రామిక విధానం రైతాంగంతోపాటు కార్మికులను దెబ్బతీసింది. 1990 దశకం వరకూ ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు పొందాలంటే ప్రతి పరిశ్రమా కనీసం వంద మంది శాశ్వత ఉద్యోగులను నియమించుకోవాలన్న నిబంధన ఉండేది. మోడీ హయాం వచ్చే సరికి ఈ నిబంధన రద్దు చేసి వంద మందికి పని చూపిస్తేచాలు అన్న కొత్త నిబంధన అమల్లోకి వచ్చింది. గుజరాత్ ప్రభుత్వం అమలు చేసిన నూతన పారిశ్రామిక విధానం పిడికెడు మంది పారిశ్రామిక వేత్తలకు, గుత్తాధిపతులకు మేలు చేసింది. గ్రామీణ పేదలు, రైతాంగం, కార్మికులకు తీరని అన్యాయం చేసింది. ఈ విధానాల వల్ల 2013 నాటికి దేశంలోనే అత్యధిక పెట్టుబడులను ఆహ్వానించిన రాష్ట్రంగా ఎదిగింది. కానీ ఉపాధి కల్పనలో

మాత్రం పరిస్థితి నానాటికీ దిగజారిపోయింది. ఏతా వాతా చూస్తే ఉపాధి సహిత పారిశ్రామిక విధానం కాస్త ఉపాధి రహిత పారిశ్రామిక ఉత్పత్తి విధానంగానూ, కార్మికుల ఆకలి తీర్చే పారిశ్రామిక విధానం స్థానంలో పెట్టుబడిదారుల లాభార్తి తీర్చే పారిశ్రామిక విధానంగానూ మారింది. ఈ కోణంలో తమిళ నాడు మెరుగైన పరిస్థితుల్లో ఉంది. 2013 నాటికి దేశంలోని పారిశ్రామిక పెట్టుబడిలో 17.7 శాతం గుజరాత్‌లో ఉంటే పారిశ్రామిక ఉపాధిలో వాటా కేవలం 9.8 శాతమే. దీనికి భిన్నంగా దేశ పారిశ్రామిక పెట్టుబడిలో కేవలం 9.8 శాతం కలిగి ఉన్న తమిళనాడు పారిశ్రామిక ఉపాధిలో 16 శాతం మందికి ఉపాధి కల్పిస్తోంది. భారీ పరిశ్రమల వలన కొత్తగా ఉపాధి అవకాశాలు ఏర్పడకపోగా ఉన్న చిన్న మధ్యతరహా పరిశ్రమలు దివాళా తీశాయి. అనుబంధ ఉత్పత్తులు సరఫరా చేసే చిన్న మధ్యతరహా పరిశ్రమలకు సకాలంలో చెల్లింపులు రాకపోవటంతోపాటు విద్యుత్ ప్రైవేటీకరణతో అడ్డూ అదుపు లేకుండా పెరిగిన విద్యుత్ ధరలతో 2004 నుండి 2014 సంవత్సరాల మధ్య గుజరాత్‌లో 60 వేల చిన్న పరిశ్రమలు దివాళా తీసి మూతపడ్డాయి. ప్రపంచంలోనే అత్యంత కుబేరుల జాబితాలో చేరిన అదానీ దేశంలో క్రోనీ పెట్టుబడిదారీ విధానానికి నిలువెత్తు నిదర్శనం. అన్న లక్షల కోట్ల విలువైన పరిశ్రమలు పెట్టిన అదానీ కేవలం 36 వేల మందికి మాత్రమే ఉపాధి కల్పించారు. ❑

**(అనువాదం : కొండూరి వీరయ్య)**

**ది వైర్ తెలుగు సౌజన్యంతో..**

# ప్రజలను అవహేళన చేస్తున్న బడ్జెట్

**(13వ పేజీ తరువాయి)**

పేద శ్రమజీవుల కోసమే పాటు పడుతున్నట్టు చెప్పుకుంటారు. కాని ఇప్పుడు ప్రభుత్వం తన ప్రాధాన్యతలను బాహాటంగా వెల్లడిస్తోంది. మధ్య తరగతికి ప్రాధాన్యతనిచ్చి శ్రామిక పేదలను శిక్షిస్తోంది. ఈ "వ్యూహాత్మక నవ్యత్వం" మినహా 2025-26 బడ్జెట్ పాత నయా ఉదారవాద బడ్జెట్ల మాదిరిగానే అదే రోసిపోయిన విధానాన్ని అనుసరించింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు తగిన ధరను కల్పించాలన్న రైతాంగపు డిమాండ్‌ను అది పట్టించుకోలేదు. ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ కంపెనీలకు 100 శాతం యాజమాన్య వాటాలు కలిగి వుండేందుకు అనుమతులిస్తూ వాటికి ఎర్ర తివాచీ పరిచి స్వాగతిస్తోంది. తమ వేటాడే "జంతు ప్రవృత్తి"ని ప్రదర్శించమని, భారీగా పెట్టుబడులు పెట్టమని స్వదేశీ గుత్త పెట్టుబడి సంస్థలకు ఉద్బోధలు చేసింది (ఆర్థిక సర్వే మాత్రం వినిమయ వస్తువుల డిమాండ్ చాలా నిరుత్సాహంగా ఉన్నందు వల్ల పెట్టుబడులు రావడం లేదని, వేతనాలలో పెరుగుదల లేకుండా, లాభాల వాటా మాత్రం చాలా ఎక్కువగా పెరిగిపోయినందు వలన ఆర్థిక అసమానతలు పెరిగి పోయాయని, అందువల్లే డిమాండ్ మందకొడిగా ఉందని స్పష్టంగానే చెప్పింది). విదేశీ మదుపుదారులను పొగడ్తలతో ముంచెత్తితే దానివల్ల ఏ ప్రయోజనమూ ఉండదు. కాని అటువంటి పొగడ్తలతో విదేశీ పెట్టుబడులు వస్తాయని, రూపాయి విలువ పతనం ఆగుతుందని ప్రభుత్వం ఆశించివుండొచ్చు. అయితే ఆ ఆశ అడియాసేనని బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రెండు రోజులకే తేలిపోయింది. రూపాయి పతనం ఆగలేదు సరికదా ఫిబ్రవరి 3న అది కోలుకోలేనంతగా దిగజారింది. ఒక డాలరుకు రూ.87 చొప్పున మారకపు రేటు ఆ రోజున పడిపోయింది. ప్రజలలో ఒక సమూహాన్ని అవహేళనా పూర్వకంగా మోసగిస్తూ మరొక సమూహాన్ని ఆకర్షించడానికి, తనను తాను గొప్పగా చిత్రీకరించుకోడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తే అది ఆర్థిక సంక్షోభాన్ని ఏ మాత్రమూ పరిష్కరించలేదు. ❑

# బీజేపీ విజయం.. కాంగ్రెస్-ఆప్ అనైక్యత

**(5వ పేజీ తరువాయి)**

ఫలితాలు వచ్చీ రాక ముందే చంద్రబాబు ఇది చారిత్రక విజయమని గర్వకారణమనీ ప్రకటిస్తు న్నారు. దేశ రాజధానిగా ఢిల్లీ గర్వకారణంగా వుందని కితాబులిస్తున్నారు. నిజానికి ఢిల్లీలో ప్రాణాంతకంగా మారిన కాలుష్యం గురించి గానీ, రాజ్యాంగ సూత్రాలకే భంగం కలిగిస్తున్న నిరంకుశ పోకడల పట్లగాని ఎలాంటి స్పందన లేదు. అధికారంలో భాగముందని అప్రజా స్వామిక కోణాలను విస్మరించడమే గాక ప్రశంసలు చేయడం ఆశ్చర్యకరం. దీంతోపాటే ఎన్నికల నిర్వహణపైనా ముందే సందేహాలు వ్యక్తమైనాయి. వాటిపైన కూడా సంతృప్తికరమైన సమాధానాలు రావలసే వుంటుంది. ఆప్ ముందే ఒక ప్రత్యేక విభాగం ఏర్పాటుచేసి వివరాలు నమోదు చేస్తూ వచ్చింది. రాహుల్‌గాంధీ కూడా లోక్‌సభ ప్రసంగంలోనే అభ్యంతరాలు లేవనెత్తారు. కనుక ఫలితాల తర్వాతా ఆ చర్చ కొన సాగవచ్చు. న్యాయపరమైన, సాంకేతికమైన ప్రక్రియలు ఎలావున్నా రాజకీయంగా నేర్చుకోవలసిన అంశాలు ఆచరణలో దిద్దుకోవలసిన పొరబాట్లపైనే దృష్టి పెట్టడం ఇక్కడ కీలకం. ❑

# రూ.129 లక్షల కోట్ల మోదీ అప్పు ఎవరి కోసం..



- ఎం.కోటేశ్వరరావు

**ఉ**చిత పథకాలు, నగదు బదిలీల వంటి రాజకీయ పార్టీల వాగ్దానాల కారణంగా జనాలు సోమరులుగా మారుతున్నారని, పరాన్నజీవులవుతున్నారంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు బుధవారం (ఫిబ్రవరి 12,2024) వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. చిత్రం ఏమిటంటే ఇలాంటి వాటి గురించి కేసులు వేసేవారు ఉంటారు తప్ప ప్రోత్సాహకాల పేరుతో వేళ్ల మీద లెక్కించదగిన కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రాయితీలు, బాంకు అప్పుల మాఫీలు, రికార్డు స్థాయిలో ప్రభుత్వాలు చేస్తున్న అప్పుల గురించి ఎవరైనా సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశారా? పోనీ న్యాయమూర్తులు మీడియాలో వస్తున్న వార్తలపై స్పందించారా ? అంటే అదీ కనపడదు. అప్పులు తెచ్చేది ఎందుకు అంటే అభివృద్ధి కోసం అని అధికార పార్టీ నుంచి తడుముకోకుండా చెప్పే సమాధానం. ఆ మేరకు దాని ఆనవాళ్లు లేవేమి అంటే ఫలితాలు వెంటనే ఎలా కనిపిస్తాయి. రానున్న రోజుల్లో చూడండి అంటారు. స్వాతంత్ర్యం తరువాత దేశాన్ని పాలించిన ప్రధానులందరూ కలిసి 2004 నాటికి కేంద్ర ప్రభుత్వానికి మిగిల్చిన అప్పు రూ.17,79,763 కోట్లు. పదేండ్ల మన్మోహన్ సింగ్ పాలనలో 2014 మార్చి నాటికి బడ్జెట్ పత్రాల సమాచారం ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి మిగిల్చిపోయిన అంతర్గత, విదేశీ అప్పుల మొత్తం రూ.55,87,149 కోట్లు, అది 2025 మార్చి నాటికి రూ.185.11 లక్షల కోట్లని, 2026 మార్చి నెలాఖ రుకు రూ.200.16 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. పదేండ్ల క్రితం ఇప్పుడు చర్చ అభివృద్ధి మీదే. పదేండ్లలో యుపిఏ పాలనలో అదనంగా 38 లక్షల కోట్ల అప్పు చేస్తే దేశాన్ని అప్పుల పాలు చేశారు. అభివృద్ధి చేయలేదు అంటూ నరేంద్రమోడీ నాడు ధ్వజమెత్తారు. తన ఏలుబడిలో 2025 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరం నాటికి అదనంగా చేసిన అప్పు రూ.129 లక్షల కోట్లు. ఇది చాలక ఈ ఏడాది మరో రూ.15.68 లక్షల కోట్లు కొత్తగా అప్పులు తీసుకొనేందుకు నిర్ణయించారు. తీరా ఇంత చేసినా 80 కోట్ల జనాభా ఉచితంగా నెలనెలా ఐదు కిలోల ఆహారధాన్యాలు ఉచితంగా తీసుకుంటే తప్ప గడవని స్థితికి దేశాన్ని దిగజార్చారు. మరో 22 సంవత్సరాల్లో (2047 నాటికి) దేశాన్ని ఎక్కడికో తీసుకుపోతామని కబుర్లు చెబుతున్నారు. నమ్మే మాటలేనా ?

అంతకుముందు కాంగ్రెస్ పాలనకు పదకొండు సంవత్సరాల నరేంద్రమోడీ పాలనకు పెద్ద తేడా ఏమిటి ? మన్మోహన్ సింగ్ మాకు పెద్ద మొత్తంలో అప్పులు మిగిల్చిపోయారు. వాటిని తీర్చటానికే సరిపోతోందని వాదించవచ్చు. అప్పుల్లో మోడీ సరికొత్త రికార్డు సృష్టించారు గనుక అది తర్కానికి నిలిచేది కాదు. 201415లో మోడీ సర్కార్ అసలు, వడ్డీ మొత్తాలను తీర్చేందుకు ఖర్చు చేసిన మొత్తం రూ.3,13,169 కోట్లు కాగా 2026 మార్చి నాటికి తీర్చాల్సిన మొత్తం రూ.12,76,338 కోట్లుగా నిర్మలమ్మ తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఈ ఏడాది బడ్జెట్ మొత్తం రూ.50.65 లక్షల కోట్లకు గాను రూ.15.68 లక్షల కోట్లు అప్పుల ద్వారా సేకరిస్తామని చెప్పారు. మూడేళ్ల తీరు తెన్నులను చూస్తే వడ్డీ, అసలు చెల్లింపుల మొత్తం ఏడాదికి లక్ష కోట్ల వంతున పెరుగుతోంది. ఈ లెక్కన మోడీ మూడో విడత పాలన ముగిసే నాటికి ఎంత అప్పు తెస్తే అంతమొత్తం పాత అప్పులకే సరిపోతుందని వేరే చెప్పనవసరం లేదు. ఒక వైపు అప్పుల కుప్ప పెరుగుతోంది. జనం మీద జీఎస్టీ, చమురు మీద సెస్‌ల భారం కొనసాగుతూనే ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినా ఒక్క పైసా వినియోగదారులకు తగ్గించకుండా 2022 ఏప్రిల్ మొదటివారం నుంచి ఒకేధర కొనసాగిస్తూ జేబులను కొల్లగొడుతూనే ఉన్నారు. తెచ్చిన అప్పుల మేరకైనా సంపదలను పెంచే మూలధన పెట్టుబడులుగా పెడుతున్నారా అంటే అదీ లేదు. 202324లో రూ.16.54 లక్షల కోట్ల మేర అప్పులు తెస్తే మూలధన పెట్టుబడులకు రూ.7.88 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారు. మరుసటి ఏడాది రూ.15.69 లక్షల కోట్ల అప్పులో రూ.8.47 లక్షల కోట్లు సవరించిన బడ్జెట్ కాగా 202526లో మూలధన పెట్టుబడిగా రూ. 8.95 లక్షల కోట్లుగా ప్రతిపాదించారు. అంతకుముందు రూ. 9.18 లక్షల కోట్లు కేటాయించి దాన్ని కుదించినట్లే వచ్చే ఏడాది కూడా అంత మొత్తం ఖర్చు చేస్తారన్న హామీ లేదు. వడ్డీ చెల్లింపుల మాదిరి శాశ్వత ఆస్తుల కల్పన లేదు. అందుకే నరేంద్ర మోడీ ఏలుబడి గొప్పతనం ఏమిటి అని ప్రశ్నించాల్సి వస్తోంది.

తమ పాలనలో విదేశీ అప్పులు పెద్దగా తీసుకోలేదని బీజేపీ నేతలు గొప్పలు చెప్పుకుంటారు. అంకెలేమి చెబుతున్నాయి. 2014 మార్చి నాటికి విదేశీ అప్పుల మొత్తం మన కరెన్సీలో రూ.1.82 లక్షల కోట్లు, ఈ మొత్తం 2026 మార్చి నాటికి రూ.6.63 లక్షల కోట్లకు పెరుగుతుందని నిర్మలమ్మ బడ్జెట్‌లో చెప్పారు. గత పది సంవత్సరాలలో ఇంత మొత్తం అప్పులు తెచ్చిందెవరు ? మోడీ ఏలుబడిలో రూపాయి విలువ 62 నుంచి

86కు పతనమైంది. దీని వలన జరిగిందేమిటి ? పదేండ్ల క్రితం మోడీ ఒక డాలరు విదేశీ అప్పు తీసుకుంటే దాన్ని మరుసటి ఏడాది చెల్లించాలంటే నాడున్న మారకపు విలువ ప్రకారం రూ.62, దానికి నామమాత్రంగా వడ్డీ చెల్లిస్తే సరిపోయేది. అదే డాలరును ఎలాంటి వడ్డీ లేకుండా పదేండ్ల తరువాత ఇచ్చే ఒప్పందం మీద ఎవరైనా ఉదారంగా అప్పు ఇస్తే ఇప్పుడు 86 రూపాయలు చెల్లించాలి. మోడీ దిగిపోయే 2029 నాటికి వందకు పతనమైనా ఆశ్చర్యం లేదు. అధికారానికి వచ్చిన వెంటనే అప్పు తీర్చి ఉంటే ఇంత ఆముదం జనానికి అంటేది కాదు కదా ! ఇదీ మోడీ ఘనత.

ఇప్పుడు కార్పొరేట్లు తమకు మరిన్ని రాయితీలతోపాటు తాము తయారు చేసే వస్తువులు, అందించే సేవలను కొనుగోలు చేసేందుకు మధ్యతరగతికి ఆదాయపన్ను రాయితీలు ఇవ్వాలని, కొందరైతే కార్మికులకు వేతనాలు పెంచాలని సూచించారు. పన్నెండు లక్షల వరకు ఆదాయానికి పన్ను మినహాయింపు ఇచ్చారు. దీనివలన ఏటా లక్ష రూపాయల వరకు ఆలోపు రాబడి ఉన్న వారికి మిగులుతుందని అంచనా. ఈ మొత్తంతోనే దేశంలో పడిపోయిన వినియోగం పెరుగుతుందా ? ఈ స్వల్ప మిగులుతో గతంలో చేసిన అప్పులు తీర్చుకోవచ్చు. వస్తువులే కొనాలని లేదు. లేదా పెరిగిన ఖర్చులకు సరిపెట్టుకోవచ్చు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించటం, స్వదేశీ పెట్టుబడిదారులకు మరింత ఊతం ఇచ్చే పేరుతో కార్పొరేట్ పన్ను 30 నుంచి 22 శాతానికి తగ్గించారు. కొత్తగా పెట్టే సంస్థలకు 15 శాతమే అన్నారు. ఈ రాయితీలతో పరిశ్రమలు, వాణిజ్య సంస్థల లాభాలు విపరీతంగా పెరిగాయి. వాటాదార్లకు డివిడెండ్లు వచ్చాయి తప్ప ఆ మొత్తం పెట్టుబడుల రూపంలో తిరిగి రాలేదు. ఆ మేరకు ఉపాధి పెరగలేదు. అదే జరిగి ఉంటే వస్తు వినియోగం పెరిగి ఉండేది. రూపాయి రూపాయి లెక్కించుకోవాల్సి వచ్చేది కాదు. సంపదలు కొద్ది మంది దగ్గర పోగుపడుతున్న తీరు స్పష్టంగా కనిపిస్తోంది. 2013-14లో ఏడాదికి 50 లక్షల రూపాయల రాబడిని చూపి పన్ను చెల్లించిన వారు 1.85 లక్షలుంటే 2023-24లో వారి సంఖ్య 9.34 లక్షలకు పెరిగింది. అయితే ఇంకా పన్ను ఎగవేసేవారు. రాబడిని చూపని వారు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం రైతులుగా నమోదైన వారు 11.88 కోట్లు, వ్యవసాయ కార్మికులు 14.43 కోట్లు. కార్పొరేట్ పన్ను చెల్లించే సంస్థలు 2021లో 9,67,054. నిర్మలా సీతారామన్ స్వయంగా వెల్లడించిన దాని ప్రకారం పైన పేర్కొన్న కార్పొరేట్ పన్ను తగ్గింపు కారణంగా ప్రభుత్వం ఏటా రూ.1.45 లక్షల కోట్ల రాబడి కోల్పోతున్నది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో పెట్టుబడి ఖర్చులకు గాను ఏటా 10.32 కోట్ల మంది రైతులకు 63 వేల కోట్ల రూపాయలను మాత్రమే కేంద్రం ఇస్తున్నది. అయిన వారికి ఆకుల్లో కాని వారికి కంచాల్లో అంటే ఇదే. రైతులు ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నారా, కార్పొరేట్ సంస్థలు ఎక్కువ మందికి పని చూపుతున్నాయా ? ఎందుకీ వివక్ష ? రైతులకు ఇచ్చే ఆ మొత్తంతో కార్పొరేట్లు విక్రయించే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాల వంటి వాటిని కొనుగోలు చేసేందుకు ఖర్చు చేస్తారు. దానిలోను కార్పొరేట్లకు లాభాలు, ప్రభుత్వాలకు పన్నుల రూపంలో రాబడి వస్తుంది. కానీ కార్పొరేట్లకు ఇస్తున్న రాయితీలతో వారేమైనా వస్తువులు, సేవల ధరలు తగ్గించిన దాఖలా ఉందా ? ఆదాయ పన్ను రాయితీలు ఒకటైతే ఎగుమతి ప్రోత్సాహకాలు, వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టినందు కు ప్రోత్సాహకాల రూపంలో ఇచ్చే రాయితీలను కూడా పరిగణనలోకి తీసుకుంటే వారికి కట్టబెడుతున్న మొత్తాలు ఇంకా ఎక్కువే ఉంటాయి.

ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానన్న వాగ్దానాన్ని పాక్షికంగా నెరవేర్చినా జీడీపీ వృద్ధి రేటు, కొనుగోలు శక్తి దిగజారి ఉండేది కాదు. పని చేసేందుకు ఏ దేశంలోనూ లేనంత మంది యువత ఉన్నదని గొప్పలు చెప్పుకోవటం తప్ప వారికి ఉపాధి సంగతి తరువాత గత పదేళ్లలో పనిచేసేందుకు ముందుకు వచ్చే వారికి కనీసం నైపుణ్యం అయినా కల్పించారా అంటే అదీ లేదు. నైపుణ్య శిక్షణ పేరుతో తగలేసిన వేల కోట్లు ఒక పెద్ద కుంభకోణంగా చెప్పవచ్చు. దరిద్రం ఏమిటంటే అసలు ఎంత మంది నిపుణులున్నారో తెలియదు. అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ లెక్కలు సేకరిస్తానని ఇప్పుడు చెబుతోంది. నైపుణ్య భారత్ కార్యక్రమం కింద కోటీ 40 లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చామని, మరో 54 లక్షల మందికి నైపుణ్యాలను పెంచటం లేదా తిరిగి శిక్షణ ఇచ్చామని 2024 కేంద్ర ప్రభుత్వం చెప్పుకుంది. జాతీయ నైపుణ్య అభివృద్ధి కార్పొరేషన్(ఎన్ఎస్‌డిసి) 2024లో వెల్లడించిన అధ్యయన వివరాల ప్రకారం దేశంలో 10.3 కోట్ల మంది నైపుణ్య కార్మికులు అవసరం కాగా 7.4 కోట్ల మందే ఉన్నారు. మారుతున్న అవసరాలకు అనుగుణ్యంగా నిన్న నేర్చుకున్న నైపుణ్యం రేపటికి పనికి రావటం లేదు. అందువలన వీరిలో ఎందరు పనికి వస్తారన్నది కూడా ప్రశ్న. చైనాలో 40 కోట్ల మంది కార్మికులు ఉంటే వారిలో 20 కోట్ల మంది నిపుణులైన వారు కాగా ఆరు కోట్ల మంది అత్యంత నైపుణ్యం కలిగిన వారని, ఇతర దేశాలతో పోటీ పడేందుకు తమకు "నూతన ఉత్పాదక శక్తులు" ఇంకా ఎంతో మంది కావాలని చైనా చెబుతోంది. మహాకుంభ మేళాలో రికార్డుస్థాయిలో జనాలను గంగలో ముంచి స్నానాలు చేయించేందుకు ఇచ్చిన ప్రాధాన్యత పరిశోధన మరియు అభివృద్ధికి నిధుల కేటాయింపు, నైపుణ్య శిక్షణలో ఎక్కడా కనిపించటం లేదు. ఇలాంటి వారు దేశాన్ని, దేశమంటే మట్టి కాదోయ్ మనుషులోయ్ అన్న గురజాడ చెప్పిన స్ఫూర్తితో ముందుకు తీసుకుపోతారా ! ❑

# నిరుద్యోగం, అధిక ధరలు

## మోడీ ప్రభుత్వ వైఫల్యాలు

- 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో భారతీయుల మనోగతం

నరేంద్రమోడీ ప్రభుత్వ పాలనలో దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, అధిక ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నా యని మెజారిటీ భారతీయులు అభిప్రాయపడ్డారు. మోడీ ప్రభుత్వ హయాంలో ఇవే అతి పెద్ద వైఫల్యాలని ఎత్తిచూపారు.


- ఇండియా టుడే, సీ-ఓటర్ సంయుక్తంగా ఈ నెలలో నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే ప్రకారం దేశంలో నాలుగింట మూడొంతులకుపైగా ప్రజల నిరుద్యోగ పరిస్థితి చాలా తీవ్రంగా ఉన్నదనో లేదా కొంతమేర తీవ్రంగా ఉన్నదనో కుండబద్దలు కొట్టారు. 55 శాతం మంది చాలా తీవ్రంగా ఉన్నదని చెబితే 21 శాతం మంది కొంత వరకూ తీవ్రంగా ఉన్నదని తెలిపారు. కేవలం ఐదు శాతం మంది మాత్రమే తీవ్రంగా లేదని అన్నారు.
- సర్వే ప్రకారం ఈశాన్య ప్రాంతంలో 64 శాతం మంది, తూర్పు ప్రాంతంలో 60 శాతం మంది నిరుద్యోగ సమస్య చాలా తీవ్రంగా ఉన్నదని స్పష్టం చేశారు. దక్షిణాదిలో 48 శాతం మంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.
- గత 11 సంవత్సరాల మోడీ పాలనలో అతి పెద్ద వైఫల్యమేమిటని ప్రశ్నించగా 21 శాతం మంది నిరుద్యోగం, అధిక ధరలను ప్రస్తావించారు.
- ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య ఏమిటని ప్రశ్నిస్తే 24 శాతం మంది నిరుద్యోగాన్ని, 17 శాతం మంది అధిక ధరలు, ద్రవ్యోల్బణాన్ని ఉదహరించారు.
- రాబోయే ఆరు నెలల్లో దేశ ఆర్థిక వ్యవస్థ మరింత క్షీణిస్తుందని లేదా ఇలాగే ఉంటుందని 57 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- ఈ సంవత్సరం ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని కేవలం 34 శాతం మంది మాత్రమే ఆశాభావం వ్యక్తం చేశారు.
- గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది దినసరి ఖర్చులను భరించడం కష్టంగా ఉన్నదని 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో పాల్గొన్న 64 శాతం మంది నిట్టూర్పు విడిచారు.
- ఖర్చులు పెరిగినప్పటికీ ఎలాగోలా నెట్టుకొస్తున్నామని 27 శాతం మంది చెప్పారు.
- తక్కువ ఆదాయాన్ని పొందుతున్న వారిలో 70 శాతం మంది ప్రస్తుత ఖర్చులను భరించడం కష్టంగా ఉన్నదని వాపోయారు.
- 82 శాతం మంది యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ పథకానికి మద్దతు ఇవ్వగా 14 శాతం మంది మాత్రమే వ్యతిరేకించారు. ఇది కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సాంఘిక సంక్షేమ పథకం. దీని కింద పౌరులందరూ బేషరతు నగదు బదిలీ రూపంలో కనీస ఆదాయాన్ని పొందుతారు. కాగా మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు బడా వ్యాపారులకే అనుకూలంగా ఉన్నాయని సర్వే తేల్చి చెప్పింది.
- 2014 నుండి మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల ద్వారా బడా వ్యాపార సంస్థలే ప్రయోజనం పొందుతున్నాయని 51 శాతం మంది తెలిపారు.
- ప్రభుత్వ విధానాల ద్వారా వేతన జీవులు లబ్ది పొందుతున్నారని కేవలం 9 శాతం మంది చెప్పగా దినసరి కార్మికులకు ప్రయోజనం చేకూరుతోందని 6 శాతం మంది అన్నారు.
- రాబోయే ఆరు నెలల కాలంలో తమ కుటుంబ ఆదాయం లేదా జీతం తగ్గిపోవడమో, ఇలాగే ఉండడమో జరుగుతుం దని మరో ప్రశ్నకు జవాబుగా 65 శాతం మంది చెప్పారు.
- ఈ ఏడాది తమ జీతాలు పెరగవచ్చునని 27 శాతం మంది మాత్రం ఆశాభావం వ్యక్తం చేశారు.
- ఇతర ఏ ప్రభుత్వంతో పోల్చినా మోడీ సర్కార్ ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఎక్కువగానే దుర్వినియోగం చేసిందని 45 శాతం మంది కుండబద్దలు కొట్టారు. 42 శాతం మంది ఈ అభిప్రాయంతో విభేదించారు.
- అమెరికా కోర్టు ముడుపుల ఆరోపణలు నమోదు చేసిన నేపథ్యంలో మోడీ ప్రభుత్వం వివాదాస్పద అదానీ గ్రూపును వెనకేసుకొస్తోందా అని ప్రశ్నించగా 49 శాతం మంది అవునని, 33 శాతం మంది కాదని బదులిచ్చారు.
- భారత వ్యతిరేక కార్యకలాపాల కోసం కాంగ్రెస్ పార్టీ జార్జ్ సొరోస్ నుండి నిధులు తీసుకున్నదని బీజేపీ చేసిన ఆరోపణలను 47 శాతం మంది తోసిపుచ్చారు. అధికార పార్టీ వాదనలో వాస్తవం ఉన్నదని 38 శాతం మంది 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో తెలిపారు. ❑

# భారతీయ ఫాసిజం పితామహుడు గోల్వాల్కర్



**- అపూర్వానంద్**

**ఆర్ఎస్ఎస్‌కు రాజ్యాంగం పట్ల విశ్వాసం ఉందన్న అబద్ధమాడాల్సి వస్తే కూడా వెనకాడదు. ఎందుకంటే గాంధీ హత్యానంతరం ఆర్ఎస్ఎస్‌పై విధించిన నిషేధాన్ని ఎత్తివేయించుకోవటం దాని అవసరం. అబద్ధమాడటం ద్వారా తమ కార్యకలాపాలకు ఎటువంటి అవరోధం లేకుండా చేసుకోగలిగితే అందులో తప్పేమిటి ? అది వ్యూహాత్మకం అన్నది వారి భావన. ఆర్ఎస్ఎస్ తన ప్రయోజనాల కోసం అబద్దమాడు తుందంటే అర్థం చేసుకోవచ్చు. కానీ కోట్లాది సంఖ్యలో ఉన్న విద్యావంతులు, లక్షల సంఖ్యలో ఉన్న మేధావులు, రాజకీయ పార్టీల కార్యకర్తలు, పార్టీలు ఈ అబద్ధాలను ఎందుకు నమ్ముతున్నారు ? సమాజాన్ని సైతం ప్రభావితం చేయగల మేధో వర్గం ఆర్ఎస్ఎస్ పట్ల పక్షపాతంతో ఎందుకుంది ? దేశంలో గణనీయంగా ఉన్న మేధో వర్గం ఆర్ఎస్ఎస్ ప్రచారం చేస్తోంది విద్వేషపూరిత హింసాత్మకవాదం అని ఎందుకు గుర్తించలేకపోతోంది? ఎందుకు అంగీకరించలేకపోతోంది?**



**గోల్వాల్కర్** మనిషి వెనక ఉన్న మర్మం, మర్మం వెనక ఉన్న మనిషి పేరుతో కొత్త పరిశోధన గ్రంథాన్ని వెలువరించిన ధీరేంద్ర కె ఝా ఆధునిక భారతంలో ఆర్ఎస్ఎస్ చరిత్రనూ ప్రత్యేకించి భారతీయ మితవాద శక్తుల నిర్మాణాలను వెలికి తెచ్చే తన ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ రచనకు ముందు గాడ్సే గురించి రాశారు. హిందూత్వ కాల్బలం గురించి షాడో ఆర్మీస్ అనే పుస్తకం రాశారు. హిందూ ఓటు బ్యాంకును రూపొందించటంలో సాధువులు, పీఠాలు పోషిస్తున్న పాత్రను పరిశోధించి గ్రంథస్తం చేశారు. తాజా పరిశోధన మాధవ్ సదాశివ గోల్వాల్కర్ గురించి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు రెండో సర్‌సంఘ్ చాలక్‌గా పనిచేశారు. ఇతనికున్న ప్రత్యేకత ఏమిటి? వర్తమాన భారతదేశంలో మనం చూస్తున్న విద్వేషపు విధ్వంసక యంత్ర నిర్మాత గోల్కాల్కర్. ఆర్ఎస్ఎస్ ఓ యంత్రం. ఆర్ఎస్ఎస్‌ను ప్రారంభించింది హెగ్డేవారే అయినా దానికి నిర్మాణ, సైద్ధాంతిక బలం, బలగాలను సమకూర్చింది మాత్రం గోల్వాల్కరే. ఒక సంఘం, సంస్థగా ప్రారంభమైన ఆర్ఎస్ఎస్‌ను వెయ్యి తలల కాల నాగులా, అమీబాకన్నా చురుకైన నిర్మాణ సౌలభ్యం కలిగిన సంస్థగా, ఎప్పుడు ఎక్కడ ఏ రంగు, రుచి, వాసనలతో కనిపించాలనుకుంటే ఆ రంగు, రుచి, వాసనలతో కనిపించే మాయావిగా రూపొందించిన ఘనత గోల్వాల్కర్‌దే. ఎన్ని రూపాల్లో, ఎన్ని ప్రాంతాల్లో, ఏ ముఖంతో కనిపించినా ఈ కాళీయుడి లక్ష్యం ఒక్కటే. నిరంతరం ఇతరులను ద్వేషిస్తూ అభద్రతాభావంతో బతికే పురుషాధిక్య, ఒంటరి మనస్తత్వం కలిగిన హిందువులను తయారు చేయటమే ఆ లక్ష్యం.

సమకాలీన భారతదేశంలో ఆర్ఎస్ఎస్ అత్యంత కీలకమైన ప్రాధాన్యత కలిగిన సంస్థ. కరసేవకులు ఇప్పుడు కేంద్రంలోనూ, అనేక రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ఆర్ఎస్ఎస్ రాజకీయ అంగమైన భారతీయ జనతా పార్టీ. దేశంలో అత్యంత సంపన్నవంతమైన రాజకీయ పార్టీ ఏదైనా ఉంటే అది భారతీయ జనతా పార్టీయే. ప్రధానమంత్రికి ఎంతటి ఉన్నత భద్రతా వలయం ఉంటుందో అంతటి భద్రతావలయాన్ని ఆర్ఎస్ఎస్ అధినేతకు ఏర్పాటు చేశారు. దేశంలో ఒక ప్రైవేటు సంస్థకు, అదీ స్వచ్ఛంధ సంస్థ, సాంస్కృతిక సంస్థ అని చెప్పుకుంటున్న సంస్థ అధినేతకు ప్రధాన మంత్రితో సమానంగా రక్షణ వలయం ఏర్పాటు చేయటం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి.

ఈ రోజు దేశంలో ప్రతి ముఖ్యమైన ప్రభుత్వ అంగమూ ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోనే నడుస్తోంది. విశ్వ విద్యాలయాల మొదలు సామాజిక శాస్త్ర అధ్యయనాలు, సాంస్కృతిక అధ్యయ నాల సంస్థలు అన్నీ ఆర్ఎస్ఎస్ ప్రత్యక్ష పరోక్ష అజమాయిషీలో నడుస్తున్నాయి. ఇప్పుడు ఈ సంస్థ అనేక దేశాల్లో వేర్వేరు పేర్లతో పనిచేస్తోంది. అందువల్ల అటువంటి బహుముఖ పార్శ్వాల్లో సులువుగా పని చేయటానికి వీలుగా సంస్థను తీర్చిదిద్దిన వ్యక్తి

గురించి తెలుసుకోవటం తప్పనిసరి అవసరం. ఆర్ఎస్ఎస్ నిర్దేశించుకున్న లక్ష్యమే హిందువులను సంఘటితం చేయటం. హిందువులకు ముగ్గురు శాశ్వతమైన శత్రువులున్నారు. వారు ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు. వీరి నుండి హిందువుల ను కాపాడాలన్నది ఆర్ఎస్ఎస్ ప్రకటిత లక్ష్యం. ఇక్కడ ఓ విషయాన్ని గుర్తుచేసుకోవాలి. హిందూ సమాజాన్ని అంతర్గతం తో సంస్కరించేందుకు, ఆత్మపరిశీలన చేసుకొమ్మని ప్రబోధించేం దుకు ఆర్ఎస్ఎస్ ఎన్నడూ పని చేయలేదు. ప్రయత్నించ లేదు. హిందువుల ధార్మిక జీవనం గురించి ఆర్ఎస్ఎస్‌కు పెద్దగా పట్టింపులేదు. కులవ్యవస్థ లాంటి నిచ్చెన మెట్ల దోపిడీ, అణచి వేతలతో కూడిన నిర్మాణం వలన ఆర్ఎస్ఎస్‌కు ఇబ్బంది లేదు. అంబేద్కర్‌లా కుల నిర్మూలన లక్ష్యం ఆర్ఎస్ఎస్ ఎజెండాలో లేదు. గాంధీ లాగా అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపిన చరిత్ర ఆర్ఎస్ఎస్‌కు లేదు. సతీ సహగమనం వంటి క్రూరత్వం గురించి కానీ, వితంతు పునర్వివాహాల గురించి కానీ, వరకట్నం వంటి దురాచారాల గురించి కానీ ఆర్ఎస్ఎస్ ఎన్నడూ నోరెత్తలేదు. కులాంతర వివాహాల గురించి ఉద్యమిం చింది లేదు. హిందువులు నిరంతరం బయటి నుండి వచ్చే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మాత్రమే చెప్తుంది. తద్వారా నిరంతరం బిక్కుబిక్కుమంటూ, సాటి ప్రజల పట్ల అను మానాలతోనూ, అభద్రతతోనూ జీవించమని బోధిస్తోంది. దీంతో పాటు హిందువులే అత్యంత అధికులమన్న భావనను నూరి పోస్తుంది. లోపల ఎంత కుళ్లినా బాగు చేసుకుందామనే కోణం లేదు. హిందూ సమాజం ఎదుర్కొనే బయటి ప్రమాదాలు అంటే దాని దృష్టిలో ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులే.

ఆర్ఎస్ఎస్ అభిప్రాయంలో హిందువు ప్రపంచంలోనే ఉత్తమ జాతి. దేవుడే తన ప్రతి రూపాలుగా సృష్టించాడు. శాంతజీవులు, సహనశీలురు. ఇటువంటి లక్షణాలు ఇతర మతాల్లో కనిపిం చవు. ఈ ప్రపంచంలో తొలి మానవులు హిందువులే. ఈ విశ్వంలో ఏమీ లేనప్పుడు హిందూ మతం ఉన్నది. హిందు మతమే అత్యంత ప్రాచీనమైనదీ, శాశ్వతమైనదీ కాబట్టి మంచిది. ఈ మతానికి వేదికగా భారతదేశాన్ని దేవుడే ఎంచుకున్నాడు. అందుకే ఈ భూమ్మీద హిందువులకు తప్ప వేరెవ్వరికీ హక్కులుం డవు. ఈ అవగాహన ఆచరణలో హిందూయిజాన్ని ఓ మతంగా కాపాడుకోవటంతో మొదలై హిందువులంతా ఒకే జాతి, ఈ దేశం హిందూ దేశమే అనే స్థాయికి చేరుతుంది. చేరింది. భారతీయులంటే హిందువులు. హిందువులంటే భారతీయులు. హిందువుల కాని వారెవరైనా భారతదేశంలో బతకాలంటే హిం దువుల అనుమతి తీసుకోవాలి. ఇక్కడ హిందువులకు ప్రాతి నిధ్యం వహించే ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్ కాబట్టి ఆర్ఎస్ఎస్ అనుమతి తీసుకోవాలి అన్నది ఆర్ఎస్ఎస్ అవగాహన.

హిందువులకు ఆర్ఎస్ఎస్ ఇచ్చే నిర్వచనం ఇతరులతో పోల్చినపుడు మాత్రమే వర్తిస్తుంది. ఆ నిర్వచనం ప్రకారం హిందువు తనకు తానుగా చూసుకున్నప్పుడు ఏమిటో తెలీని అయోమయంలో ఉంటాడు. ఆర్ఎస్ఎస్ నిర్వచనం ప్రకారం ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులంటే భయపడేవాడు, ద్వేషించేవాడు మాత్రమే హిందువు అవుతాడు. కాబట్టి ఆర్ఎస్ఎస్ పరిభాషలో హిందువును నిర్వచించాలంటే ఈ మూడూ కనీస ప్రమాణాలు. ఆర్ఎస్ఎస్ నిర్వచించే హిందువులు తమకు తాము ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం లేనివారు. ఎందుకంటే దేవుడే వారిని పరిపూర్ణమైన మానవుడిగా సృష్టించాడని ఆర్ఎస్ఎస్ చెబుతుంది కాబట్టి. ఆర్ఎస్ఎస్ నిర్వహించే హిందువుల వ్యక్తిగత జీవితంలో ఉన్న లోపాలు ఎవరైనా వేలెత్తి చూపిస్తే వారి ఆగ్రహం కట్టలు తెంచుకుంటుంది. సావర్కార్ ప్రేరణతో గోల్వాల్కర్ హిందువుల ను పైవిధంగా నిర్వచించారు. మనమూ, మన జాతీయత అన్న కరపత్రంలో సావర్కార్ కూడా హిందువులకు ఇచ్చిన నిర్వచనం ఇదే. ఆర్ఎస్ఎస్ ప్రాపంచిక దృక్పథానికి పునాదులు వేసిన అవగాహన ఇదే అని చెప్పవచ్చు. ఆర్ఎస్ఎస్‌కు పునాదులు వేసిన గోల్వాల్కర్‌కు నేటి రూపంలో మనకు కనిపిస్తున్న ఆర్ఎస్ ఎస్ నిర్మాణాన్ని ఊహించిన వ్యక్తిగా విలక్షణమైన గుర్తింపు ఉంది. ఆర్ఎస్ఎస్ కేవలం ఒక సంస్థ కాదు. సంస్థలకే సంస్థ.

కరుడుగట్టిన హిందూత్వను సైద్ధాంతికంగానూ, ఆచరణాత్మ కంగానూ తెర మీదకు తీసుకురావటంలో గోల్వాల్కర్ పాత్ర గురించి లోతైన అవగాహనను అందిస్తుంది ఈ పుస్తకం. గోల్వాల్కర్ రచన మనం, మన జాతీయతలోనే భారతీయ ఫాసి జానికి సంబంధించిన పునాదులున్నాయి. హిందూ రాష్ట్ర నిర్మా ణంలో భాగంగా గతాన్ని సావర్కార్ వ్యాఖ్యానిస్తే భవిష్యత్తును గోల్వాల్కర్ ఊహించాడన్న రచయిత వ్యాఖ్య అక్షర సత్యం. ఇంకా చెప్పాలంటే హిందూ రాష్ట్ర నిర్మాణానికి సంబంధించిన వ్యూహ రచనను, ప్రణాళికను గోల్వాల్కర్ 'మనం, మన జాతీయత' ద్వారా అందించారు.

కాలక్రమంలో 'మనం, మన జాతీయత' కరపత్ర రచయితగా తనను తాను చెప్పుకోవడానికి వెనకాడిన సందర్భాలూ ఉన్నా యి. ఈ పుస్తకాన్ని సార్వత్రికంగా పుస్తకాల షాపుల్లో అమ్మటానికి వెనకాడిన సందర్భాలూ ఉన్నాయి కాబట్టి ఈ రచనకూ, రచయితకూ మధ్య ఉన్న అనుబంధాన్ని, సంబంధాన్ని ధృవీక రించటానికి ఈ పరిశోధనాత్మక రచన చేపట్టారు. నిజానికి ఇది నాజీ ప్రాపంచిక దృక్పథంతో ఉన్న రచన. భారతదేశంలో ముస్లిం జనాభా విషయంలో నాజీలు యూదుల పట్ల అమలు చేసిన పరిష్కారాన్ని అమలు చేయాలని ప్రతిపాదించే రచన ఇది.

ధీరేంద్ర పుస్తకంలో కనిపించే గోల్వాల్కర్ జీవితమంతా అనుమానాలే. కుట్రలు, కుతంత్రాలే. తన గురించిన తనకు ఉన్న అభిప్రాయాలే. అతని జీవితాన్ని నడిపించినవి ప్రేమ,

కారుణ్యం, వాత్సల్యం వంటి విలువలు కాదు. కుట్రలు, కుతంత్రాలు, విద్వేషం వంటి విలువలే. తన గురించి తానే అబద్ధాలు సృష్టించి వాటిని ప్రచారంలో పెట్టడంలో గోల్వాల్కర్‌కు ఉన్నంత సంతృప్తి మరెందులోనూ లేదు.

ఈ పుస్తకావిష్కరణ తర్వాత బయటికి వస్తూ ఓ యువకుడు 'గోల్వాల్కర్ ప్రొఫెసర్ అన్న వాస్తవాన్ని మర్చిపోకూడదు' అని వ్యాఖ్యానించటం చూశాను. తన గురించి తను చెప్పే మాటలు (ప్రవచనాలు) గురించి ఇతరులకు గౌరవం కలిగించేందుకు గోల్వాల్కర్ ఆడిన మొదటి పెద్ద అబద్ధం ఇది. ఈ విషయాన్ని ధీరేంద్ర ఝా పుస్తకం సాక్ష్యాధారాలతో సహా మన ముందు ఉంచుతుంది. అత్యంత చిన్న వయసులోనే గోల్వాల్కర్ ప్రొఫెసర్ అయ్యాడన్నది ఆ ప్రచారం సారాంశం. అంటే ఆయన అంత మేధో సంపన్నుడన్న ప్రచారమన్నమాట. ఇటువంటి అబద్ధాలే తన సొంత రచన 'మనం, మన జాతీయత' గురించి కూడా ప్రచారంలో ఉన్నాయి. ఆ పుస్తకాన్ని రాసింది ఆయనే. కానీ ఈ కారణంగా తన రాజకీయ మనుగడ ప్రశ్నార్థకమైన వేళ అది కేవలం అనువాదం మాత్రమేననీ, తన సొంత రచన కాదనీ బుకాయించాడు. ఆ బుకాయింపే ఇప్పటికీ ప్రచారంలో ఉంది.

అబద్ధాలు రూపొందించి నిజాలని జనం నమ్మే స్థాయిలో ప్రచారం చేయగల సమర్థుడైన గోల్వాల్కర్ నాయకత్వంలో సాగిన అబద్ధపు ప్రచారాల్లో ఆర్ఎస్ఎస్‌కు, గాడ్సేకు సంబంధం లేదన్నది మరొకటి. పాపం నిజానికి గాడ్సే జీవితాంతం ఆర్ఎస్ఎస్ సభ్యుడుగానే ఉన్నాడు. గాంధీ హత్యానంతరం ఆర్ఎస్ఎస్ రాజకీయ రంగంలో ఎదుర్కోవాల్సిన దుర్గతి నుండి తప్పించుకునేందుకు అల్లిన కట్టుకథ గాడ్సేకు ఆర్ఎస్ఎస్‌కు సంబంధం లేదన్న కట్టుకథ.

ఈ దేశానికి ఎదురయ్యే ముప్పు గురించి ఆర్ఎస్ఎస్ అగ్రనేతలు చేసిన ప్రచారాన్ని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు ఇచ్చిన ఆదేశంగా గాడ్సే భావించాడా అన్నది ధీరేంద్ర ఝా ముందుకు తెస్తున్న ప్రశ్న. గాంధీ హత్యానంతరం తమను తాము కాపాడుకోవడానికి ఆర్ఎస్ఎస్, గోల్వాల్కర్‌లు 13 రోజుల పాటు సంతాపదినాలు ప్రకటించారు. ఈ 13 రోజుల పాటూ ఆర్ఎస్ఎస్ శాఖలన్నీ ఊపిరి ఉన్నంత వరకూ ద్వేషించే గాంధీ పేరు తమ గురువుల సరసన చేర్చి సంతాపం ప్రకటించారు. ఇటువంటి అబద్ధపు ప్రచారాలతో ఆర్ఎస్ఎస్ తనను తాను ఆత్మవంచన చేసుకుంటుందా లేక అనుయాయులను, సాధారణ ప్రజలను మోసగిస్తోందా అన్న ప్రశ్నను ముందుకు తెస్తోంది ధీరేంద్ర ఝా పుస్తకం.

గోల్వాల్కర్ భారతదేశం, హిందూ పదాలకు ఎలాగైతే తప్పుడు నిర్వచనాలిచ్చారో అదే విధంగా తన జీవితం గురించి తానే ప్రచారంలో పెట్టుకున్న అనేక అంశాల్లో ఎన్నో అసత్యాలు ఒదిగి ఉన్నాయి. ఈ విషయాన్నే ధీరేంద్ర ఝా పుస్తకం మన ముందుంచుతోంది. అటువంటి మనిషి జీవిత చరిత్ర ఎందుకు రాయాలన్న ప్రశ్న కూడా ముందుకొస్తుంది. గత కొంతకాలంగా నిరంతరం గోల్వాల్కర్ గురించి సాగుతున్న ప్రచారం, ఆయన్ను దేవుడిని చేస్తున్న తీరు నేపథ్యంలో ఆయన గురించి, ఆయన జీవితం గురించి వాస్తవాలు తెలుసుకోవడానికి ఈ పుస్తకం కావాలి. ఇలాంటి పుస్తకాలు రావాలి. అంతేకాదు. ఈ నందన వనం లాంటి సుందర భారతాన్ని నిత్య రక్తార్పణం చేసే రక్కసి మూకలతో నిండిన ఫాసిస్టు హిందూ రాష్ట్రంగా నిర్మించేందుకు కావల్సిన విత్తనాలు వెదజల్లి ఆ విత్తనాలే ఇప్పుడు వటవృక్షాలై విద్వేషాన్ని విరజిమ్ముతున్న వేళ ఆ విత్తనాలు వేసిన వ్యక్తి గురించి తెలుసుకోవడానికి ఈ పుస్తకం కావాలి.

ఆర్ఎస్ఎస్ కానీ, గోల్వాల్కర్ కానీ, అతనికంటే ముందు సావర్కార్ గానీ తమ గురించి తాము అసత్యాలను ప్రచారం చేయటం ప్రారంభించారు. వారి గురించి ఓ భ్రమలను కల్పించటం అవసరమేనని ఆర్ఎస్ఎస్ అనుయాయులు అంటుంటారు. అటువంటి భ్రమలే చట్టం కళ్లు గప్పటానికి సాధనాలు కాబట్టి. ఉదాహరణకు గాడ్సే ఆర్ఎస్ఎస్ సభ్యుడే అని కోర్టులో రుజువైతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకో వచ్చు. అందుకే ఆర్ఎస్ఎస్‌కు, గాడ్సేకు మధ్య ఉన్న సంబంధం గురించి అబద్ధం చెప్పింది. ఆర్ఎస్ఎస్‌కు రాజ్యాంగం పట్ల విశ్వాసం ఉందన్న అబద్ధమాడాల్సి వస్తే కూడా వెనకాడదు. ఎందుకంటే గాంధీ హత్యానంతరం ఆర్ఎస్ఎస్‌పై విధించిన నిషేధాన్ని ఎత్తివేయించుకోవటం దాని అవసరం. అబద్ధం ఆడటం ద్వారా తమ కార్యకలాపాలకు ఎటువంటి అవరోధం లేకుండా చేసుకోగలిగితే అందులో తప్పేమిటి? అది వ్యూహాత్మకం అన్నది వారి భావన.

ఆర్ఎస్ఎస్ తన ప్రయోజనాల కోసం అబద్ధమాడుతుందంటే అర్థం చేసుకోవచ్చు. కానీ కోట్లాది సంఖ్యలో ఉన్న విద్యావంతులు, లక్షల సంఖ్యలో ఉన్న మేధావులు, రాజకీయ పార్టీల కార్యర్తలు, పార్టీలు ఈ అబద్ధాలను ఎందుకు నమ్ముతున్నారు? సమాజాన్ని సైతం ప్రభావితం చేయగల మేధో వర్గం ఆర్ఎస్ఎస్ పట్ల పక్షపాతంతో ఎందుకుంది? దేశంలో గణనీయంగా ఉన్న మేధోవర్గం ఆర్ఎస్ఎస్ ప్రచారం చేస్తోంది విద్వేషపూరిత హింసాత్మకవాదం అని ఎందుకు గుర్తించలేకపో తోంది ? ఎందుకు అంగీకరించలేకపోతోంది ? గాంధీ, నెహ్రూ లు ఆర్ఎస్ఎస్ వలన దేశానికి ముప్పు ఉందని పసికట్టారు. కానీ ఆర్ఎస్ఎస్ గురించి గాంధీ చేస్తున్న హెచ్చరికలను ఆయన అనుంగు శిష్యులే ఎందుకు వినటానికి సిద్ధం కాలేదు ? నెహ్రూ పదేపదే విజ్ఞప్తి చేసినా వల్లభాయ్ పటేల్ కానీ, గోవింద్ వల్లభ్ పంత్ కానీ ఆర్ఎస్ఎస్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఎందుకు సిద్ధం కాలేదు?

ప్రభుత్వ నిఘా విభాగాలు ఆర్ఎస్ఎస్ దేశంలో హింసాత్మక

కార్యకలాపాలకు పూనుకొంటోందన్న వాస్తవాలను, వార్తలను నిరంతరం పటేల్, పంత్‌లకు చేరవేస్తూనే ఉన్నారు. వీరిద్దరి దృష్టిలో ఆర్‌ఎస్‌ఎస్ కేవలం క్రమశిక్షణ కలిగిన దేశభక్త సంస్థ. రాజ్యాంగ పదవుల్లో ఉంటూ ఈ పెద్ద మనుషులిద్దరూ రాజ్యాంగానికి, సార్వత్రిక మానవ విలువకు వ్యతిరేకంగా ఆర్‌ఎస్‌ఎస్ సాగిస్తున్న విద్వేషపు ప్రచారాన్నీ, ప్రేరేపిస్తున్న హింసాత్మక ఘటనలను చూడటానికి ఎందుకు నిరాకరించారు?

ఈ సందర్భంగా రచయిత ఈ పుస్తకంలో ఓ ముఖ్యమైన సందర్భం గురించి ప్రస్తావిస్తారు. ఆ సందర్భంలో మౌలానా అబుల్ కలాం, గాంధీ, ప్రధాని నెహ్రూ, పటేల్‌లు ఉంటారు. అబుల్‌కలాం నెహ్రూను ఉద్దేశించి మాట్లాడుతూ "ఢిల్లీలో జరుగుతున్న ఘటనలను సహించేది లేదని నెహ్రూ ఎంతో ఆవేదనతో చెప్పారు. ముస్లింలను కుక్కలు, పిల్లులకంటే దారుణంగా చంపేస్తున్నారు. వారి ప్రాణాలు కాపాడలేని తన దుస్థితి చూసి నెహ్రూ కుమిలిపోతున్నారు. ఈ నరమేధం గురించి ప్రశ్నించే వారికి ఏమి సమాధానం చెప్పాలో తెలీక ఆయన అంతరాత్మ ఘోషిస్తోంది" అని అన్నారు.

దీనికి పటేల్ స్పందన చూస్తే అవాక్కవుతాము.

ఢిల్లీ నడి వీధుల్లో ముస్లింల ఊచకోత సాగుతూ ఉంటే హోం మంత్రిగా ఉన్న పటేల్, నెహ్రూ ఆందోళన సమంజసం కాదని గాంధీకి ఫిర్యాదు చేస్తారు. ఇంకా ఆయన ఫిర్యాదులో ఒకటో అరో జరిగితే జరిగి ఉండొచ్చు. కానీ ముస్లిం ధన, మాన, ప్రాణాలు కాపాడేందుకు ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తుంది. ఇంతకన్నా చేయగలిగింది కూడా లేదు అని సరిపుచ్చుకుంటారు. కొన్ని క్షణాలపాటు నోటమాట రాని నెహ్రూ గాంధీవైపు చూస్తారు విచార వదనంతో. సర్దార్ పటేల్ అభిప్రాయం అదే అయినపుడు ఇక నేను చెప్పేదేముంది అని అక్కడ నుండి వెనుదిరుగుతారు.

ముస్లింలపై సాగుతున్న ఊచకోతకు నిరసనగా గాంధీ ఆమరణ దీక్షకు కూర్చుంటే ఆయన అత్యంత ప్రియ శిష్యుడైన పటేల్ అదేమీ పట్టించుకోకుండా తన అధికారిక పర్యటనలకు ఎందుకు పరిమితం అవుతారు ? ముస్లింల ఊచకోత సరైనదేనని ఏ కోశానైనా అనుకుంటున్నారా పటేల్ వంటి నేతలు. అందుకే ఆర్‌ఎస్‌ఎస్ పట్ల సానుభూతితో వ్యవహరిస్తున్నారా? అన్నవి ఎవరికి వారు అర్థం చేసుకోవాల్సిన ప్రశ్నలు. ఈ కోణం దిశగా పుస్తకం చర్చించకపోయినా పటేల్ లాంటి ఉన్నతస్థాయి నాయకులు కూడా ముస్లింల పట్ల ఎటువంటి అభిప్రాయాన్ని కలిగి ఉన్నారన్న అవగాహనను కల్పిస్తుంది. పాకిస్తాన్ ఏర్పడిన తర్వాత దేశంలో ఉండిపోయిన ముస్లింలను ఎలా నమ్మాలో పటేల్ అర్థం చేసుకోలేకపోయారు. స్వయంగా పటేల్ లాంటి నాయకులే ముస్లింలను అనుమానంగా చూస్తూ ఈ దేశం పట్ల వారి అంకితభావాన్ని నిరూపించుకోవాలని అడుగడుగునా కోరుతున్నారు. ఒక లక్ష్యం కోసం కోట్లాది మంది ముస్లింలు ఇక్కడే ఆగిపోతే, వారిపట్ల నిరంతరం అనుమానపు చూపులుంటే ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థ అవసరమే. ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరేపిస్తున్న హింసాత్మక భావ జాలం, భౌతిక హింస గురించిన ఆధారాలు కళ్ల ముందున్నా చూడటానికి నిరాకరిస్తూ వాళ్లంతా దేశభక్తులని ప్రకటించే పరిస్థితి ఉన్నప్పుడు ఇంతకన్నా భిన్నంగా ఏమి జరుగుతుంది? ముస్లింలు, క్రైస్తవులను అణచివేయటానికి ఇటువంటి సంస్థలు అక్కరకొస్తాయి.

గోల్వాల్కర్, సావర్కార్‌ల ద్వయాన్ని భారతీయ ఫాసిజానికి పితామహులు అని పిలవవచ్చు. గోల్వాల్కర్ జీవిత చరిత్రతో పాటు ధీరేంద్ర ఝా భారతీయ ఫాసిజం చరిత్రను కూడా అందిస్తున్నారు. ఈ పుస్తకాన్ని చదివిన తర్వాత భారతీయులు ఆ ఫాసిస్టు ధోరణులను ఎందుకు సహిస్తున్నారన్న ప్రశ్న తలెత్తుతుంది. ❑

(అనువాదం : కొండూరి వీరయ్య)

ది వైర్ తెలుగు సౌజన్యంతో..

## గోల్వాల్కర్ ఏమన్నారంటే..

- దేశ స్వచ్ఛతను మరియు దాని సంస్కృతిని కాపాడుకోవడానికి, జర్మనీ సెమిటిక్ జాతులను - యూదులను - దేశంలో నుండి ప్రక్షాళన చేయడం ద్వారా ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. జాతీయ గర్వం ఇక్కడ అత్యున్నత స్థాయిలో వ్యక్తమైంది. జాతులు మరియు సంస్కృతులు, మూలాలకు వెళ్ళే తేడాలు, ఒకే ఐక్యమైన మొత్తంగా కలిసిపోవడం ఎంత అసాధ్యమో జర్మనీ కూడా చూపించింది, ఇది హిందూస్థాన్‌లో మనం నేర్చుకోవడానికి మరియు ప్రయోజనం పొందడానికి మంచి పాఠం.
- హిందూస్థాన్‌లోని హిందూయేతర ప్రజలు హిందూ సంస్కృతి మరియు భాషను స్వీకరించాలి. హిందూ మతాన్ని గౌరవించడం మరియు భక్తితో పట్టుకోవడం నేర్చుకోవాలి. హిందూ జాతి మరియు సంస్కృతిని కీర్తించడం తప్ప మరే ఆలోచనను కలిగి ఉండకూడదు - ఒక్క మాటలో చెప్పాలంటే వారు విదేశీయులుగా ఉండటం మానేయాలి, లేదా దేశంలోనే ఉండి, హిందూ దేశానికి పూర్తిగా లోబడి, ఏమీ కోరుకోకుండా, ఎటువంటి హక్కులకు అర్హులు కాకుండా పౌరుల హక్కులకు కూడా అర్హులు కాకుండా ఉండవచ్చు.

# మనుస్మృతిని ధిక్కరించిన ఛత్రపతి శివాజీ!



- దేవరాజు మహారాజు

**తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఒక్కోసారి ఒక్కొక్కరిని తమ వారిగా ప్రచారం చేసుకోవడం బిజెపి, ఆరెస్సెస్‌లకు కొత్తేమీ కాదు. వారిలో ఛత్రపతి శివాజీ ఒకరు. ప్రసిద్ధ మరాఠా నాటకం 'జాణ్తారాజా' (జగమెరిగిన రాజు) కూడా శివాజీని ముస్లిం ద్వేషిగా చిత్రీకరించింది. అయితే ముస్లింల పట్ల, వారి మతం పట్ల శివాజీ ఎప్పుడూ ద్వేషభావం చూపలేదు-అని చరిత్రకారుడు సర్దేశాయి 'న్యూ హిస్టరీ ఆఫ్ మరాఠాస్' అనే తన పుస్తకంలో రాశారు. సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించడమే శివాజీ ప్రాథమిక లక్ష్యంగా జీవితాంతం పోరాడాడు. అంతేగాని, ఆయన ఎప్పుడూ ముస్లిం ద్వేషి కాదు. ఇస్లాం వ్యతిరేకీ కాదు. అలా చూపించడానికి ప్రయత్నించిన వారు వాస్తవాల్ని వక్రీకరించినట్టవుతుంది.**

మతం ప్రాతిపదికన కాకుండా మానవీయ కోణంలో ఛత్రపతి శివాజీ పరిపాలన సాగించాడు. సైన్యంలో, ఇతర అధికారుల నియామకాల్లో మతానికి ఏ మాత్రం ప్రాముఖ్యం ఇవ్వలేదు. అతని సైన్యంలో ఎక్కువ మంది ముస్లింలే. రాజ్యాన్ని రక్షించాల్సిన సైన్యంలో ఆయన నిర్భయంగా ముస్లింలను నియమించుకోవడం, వారి మీద నమ్మకం పెంచుకోవడం గమనించాల్సిన విషయం. అలాంటి వాణ్ణి ముస్లిం వ్యతిరేకిగా చిత్రించడమంటే వారి అవగాహనా రాహిత్యాన్ని బయట పెట్టుకున్నట్టే. అలాగే ఇతర మత పెద్దలను శివాజీ ఎంతో గౌరవించేవాడు. హజ్రత్‌బాబా యాకుబ్ తౌర్వాలే పట్ల శివాజీకి ఎంతో గౌరవ భావం వుండేది. జీవితాంతం ఆయనకు పింఛను అందేలా ఏర్పాటుచేశాడు. ముస్లింలు నమాజ్ చేసుకునేందుకు తన రాజధాని రాయగఢ్‌లో ప్రత్యేకంగా మసీదు నిర్మించాడు. రాజ్యంలోని, మసీదులకు, దర్గాలకు రక్షణ కల్పించాడు. ఎవరికైనా ఖురాన్ దొరికితే దాన్ని గౌరవంగా తీసుకెళ్లి ముస్లింలకు అప్పగించాలన్న ఉత్తర్వు అమలులో ఉండేది. అలాగే ఫాదర్ అంబ్రోస్ పట్ల శివాజీకి ఎంతో గౌరవం వుండేది. గుజరాత్ దాడిలో ధ్వంసమైన చర్చి పునర్నిర్మించడానికి భూరి విరాళం అందించాడు. యుద్ధ సమయంలో చేతికి చిక్కిన ఇతర మతాల మహిళల పట్ల, పిల్లల పట్ల దురుసుగా ప్రవర్తించ రాదని సైన్యానికి ఆదేశాలుండేవి. అఫ్జల్‌ఖాన్‌ను శివాజీ హత్య చేయడాన్ని కొందరు వక్రీకరించారు. ఆదిల్షా రాజులకు శివాజీకి ఏళ్ల తరబడి యుద్ధం సాగుతున్న తరుణంలో, ఆదిల్షా రాజ్యానికి ప్రతినిధిగా అఫ్జల్ ఖాన్ పోరాడాడు. చర్చల పేరుతో శివాజీని



తన గుడారానికి ఆహ్వానించి చంపడానికి కుట్ర పన్నాడు. అయితే ఆ కుట్ర వివరాలు ఒక ముస్లిం ద్వారా శివాజీ తెలుసుకున్నాడు. అంటే హిందువయిన శివాజీ మహారాజును రక్షించుకున్నది ముస్లిం అయిన రస్తీం జమాన్. రస్తీం జమాన్ సూచన మేరకే శివాజీ ఇనుప పంజాలు ధరించి అఫ్జల్‌ఖాన్‌ను చంపేశాడు. ఇక్కడ మనం కృష్ణాజీ భాస్కర కులకర్ణి పోషించిన పాత్రను విశ్లేషించుకుంటే, మనకు అర్థమయ్యేదేమంటే.. తన మతం వాడయినా సరే.. తక్కువ కులంవాడు రాజుగా ఉండటం భరించలేక శివాజీని చంపడానికి వేరే మతం వాడికి సహాయపడ్డాడు. సరే, ఆ పథకం విఫలమైందన్నది వేరే విషయం.

## ప్రజారంజకుడైన మహారాజు ఛత్రపతి శివాజీ మనుస్మృతిని ధిక్కరించాల్సిన అవసరం ఎందుకొచ్చింది?

శివాజీ మరాఠా 'కున్బి' కులస్తుడు. మనుస్మృతి ప్రకారం శూద్ర కులం. అగ్రవర్ణాల వారు శూద్ర కులాలను బానిసలుగా మార్చిన విషయం గతం చెపుతోంది. దేశ జనాభాలో తొంభై శాతం ఉన్న ఈ 'శూద్రులు' అగ్రవర్ణాల వారు రచించుకున్న మనుస్మృతి ప్రకారం చదువుకోకూడదు. ఆయుధం ఉపయోగించకూడదు. వారికి ఎదురుపడకూడదు. కేవలం వారి వారి చేతివృత్తులు చేసుకుని జీవించాలి. పైగా తమ రాబడిలో సగభాగం అగ్రవర్ణ పెత్తందారులకిచ్చి, మిగతా సగంతోనే జీవించాలి. ఈ కట్టుబాట్లను ఎవరైనా ధిక్కరిస్తే నాలుకలు కోసేవారు, చెవుల్లో సీసం పోసేవారు. రాజైన శివాజీకే వివక్ష తప్పలేదు. శివాజీని పట్టాభిషిక్తుణ్ణి చేయడానికి స్థానిక బ్రాహ్మణులెవరూ సహకరించలేదు. అప్పుడు దూరప్రాంతం నుంచి ఒక బ్రాహ్మణ్ణి పిలిపించారు. అతను కార్యక్రమం పూర్తి చేయించాడు కానీ, శివాజీ నుదుట తన కాలి బొటనవేలుతో తిలకం దిద్దాడు. ఎందుకంటే రాజైనవాడు శూద్రుడు గనక! మనుస్మృతి నిబంధనలు కఠినంగా అమలులో ఉన్న ఆ కాలంలో శూద్రుడై ఉండి శివాజీ ఆయుధం చేపట్టాడు. జ్ఞాని అయ్యాడు. సర్వమత సహనంతో ప్రజల్ని సమభావంతో ఆదరించాడు. అంటరాని కులాల వారికి ఆయుధమిచ్చి వారిని సైనికులుగా తీర్చిదిద్దాడు. అలాంటి శివాజీని కుట్రలు కుతంత్రాలతో అగ్ర వర్ణాల వారు హత్య చేశారు.

శివాజీ కుమారుడు శంభాజీ కూడా తండ్రి బాటలో నడిచాడు. మనుస్మృతిని ధిక్కరించి 'బుద్ధ భూషణం' అనే పుస్తకం రాశాడు. వేదపురాణాల్ని అధ్యయనం చేసి అవి పనికిరానివని తేల్చాడు. 'ఈ దేశానికి బౌద్ధం ఒక్కటే మార్గం' అని నిర్ణయించుకుని ప్రచారం చేశాడు. శూద్ర కులాల్ని చైతన్యపరిచాడు. అయితే శూద్ర కులాలు బలపడితే తమకు ప్రమాదమని అగ్రవర్ణాల వారు ఔరంగజేబు సహాయంతో శంభాజీని, అతని అనుచరుల్ని బంధించారు. మనుస్మృతిలో చెప్పినట్టు కళ్ళు పీకి, చర్మం వొలిచి, నాలుక కోసి అతిక్రూరంగా హత్య చేశారు. శంభాజీ తలను, అతని అనుచరుల తలలను కోసి, వారి కత్తులకు గుచ్చి పూణెలో ఊరేగించారు. మమ్మల్ని ధిక్కరించి కులధర్మాన్ని ధిక్కరించిన వాడు చక్రవర్తి అయినా సరే వాడికి ఏ గతి పట్టిందో చూడండంటూ ప్రజల్ని భయభ్రాంతుల్ని చేశారు. తమను ఎదిరిస్తే ఎవరికైనా అదే గతి పడుతుందని హెచ్చరించారన్న మాట! శంభాజీని ప్రోత్సహించిన అంటరాని వారికి తర్వాత కాలంలో మూతికి ముంత, నడుముకు చీపురూ వచ్చాయి. ఛత్రపతి శంభాజీ హత్యకు గుర్తే.. చెంబులో కర్రలు పెట్టి ఊరేగించడం! మహారాష్ట్రలో అది గుడిపడవా. తెలుగు ప్రాంతా ల్లో ఉగాది. అందుకే ఉగాది ఏ విధంగానూ మన పండగ కాదు అనేది విశ్లేషకులు చెపుతున్న మాట. ఈ దేశ మూలవాసులకు అదొక దుర్దినం. ఛత్రపతి శివాజీ కాలంలోనే కాదు. ఈ 21వ శతాబ్దంలో కూడా ఈ కుల మతాలు ఇలాగే కొనసాగాలని ఒక జియ్యరు స్వామి ఏ మాత్రం సిగ్గూ, బిడియం లేకుండా చెపుతున్నారంటే ఏంటి? మంత్రయినా, ముఖ్యమంత్రయినా సరే, తమ కాళ్ళ మీద పడాల్సిందేనని చెప్పుకోవడమన్న మాట! ఆధిపత్య కుల దురహంకారాన్ని అజ్ఞానంతో ప్రదర్శించుకోవడ మన్న మాట! దీన్నిబట్టి మనం ఎన్నుకుంటున్న నాయకులు ఎలాంటి వారో అంచనా వేసుకోవచ్చు. ❑


నేను బీఫ్ తింటా

మా రాష్ట్ర జీవన శైలిలో అదొక భాగం

మేఘాలయ బీజేపీ చీఫ్ ఎర్నెస్ట్ మావ్రీ

KKK

షిల్లాంగ్: మేఘాలయాలో బీఫ్‌పై నిషేధం విధించబోమని, తాను కూడా దానిని తింటానని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎర్నెస్ట్ మావ్రీ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఇతర రాష్ట్రాల తీర్మానంపై నేను మాట్లాడను. నేను మేఘాలయలో ఉన్నాను. ఇక్కడ అందరూ గొడ్డు మాంసం తింటారు. నేను కూడా తింటాను. దానిపై ఎటువంటి నిబంధనా లేదు. ఇది మేఘాలయ ప్రజల జీవన శైలి. దీనిని ఎవ్వరూ ఆపలేరు' అని అన్నారు. కాగా, అసోంలో పశువధ, గోమాంసం రవాణాపై చర్యలు తీసుకుంటున్న సమయంలో మావ్రీ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# దీర్ఘకాల వ్యూహంతో బీజేపీ.. తడబడుతున్న ప్రతిపక్షం



- అజయ్ గుడవర్తి

**అధికార పార్టీకి సంస్థాగత మార్పులతో వచ్చే ప్రయోజనాలతోపాటు, రాజకీయ కథన స్వరూపాన్ని నిరంతరం నిర్ణయించే సామర్థ్యంలోనే దాని బలం ఉంది. అధికార భారతీయ జనతా పార్టీ సుదీర్ఘకాలంపాటు అధికారంలో ఉండాలనే కృత నిశ్చయంతో ఉంది. రాబోయే 15 ఏళ్లు పార్టీ అధికారంలో ఉంటుందని హెూంమంత్రి అమిత్ షా ఇటీవల పేర్కొన్నారు. అంతకుముందు, 2015లో రాబోయే 30 ఏళ్ల కాలం బీజేపీ యుగం అవుతుందని అన్నారు. గుజరాత్‌లో రెండు దశాబ్దాలకు మించి పార్టీ అధికారంలో ఉంది. బీజేపీ 10 సంవత్సరాలకు పైగా భారతదేశాన్ని పాలించింది. మరో ఐదేళ్లపాటు అధికారంలో ఉండేందుకు జూన్ 2024లో వరుసగా మూడవసారి గెలిచింది.**

### అధికారంపై బీజేపీ ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతుంది ?

ఎక్కువ కాలం అధికారాన్ని నిలుపుకునే లక్ష్యంతో బీజేపీ సంస్థాగత మార్పులు చేసింది. అక్రమాలను వ్యవస్థీకృతం చేశారని, అందుకే ఈ పోరాటం ఒక పార్టీకి వ్యతిరేకంగా కాకుండా భారత రాజ్య "యావత్ యంత్రాంగానికి" వ్యతిరేకంగా సాగుతుందని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛ, స్వతంత్ర న్యాయవ్యవస్థ, నిష్పాక్షికమైన, తటస్థమైన పారదర్శక ఎన్నికల కమిషన్ లేకుండా ఎన్నికలు న్యాయంగా జరగవని ఆయన అన్నారు. అయితే, బీజేపీ నిరంతరం సాధించే ఎన్నికల విజయాలను అక్రమాలు మాత్రమే వివరించలేవు. ఓటర్లను ఆకర్షించడానికి సంక్లిష్టమైన వ్యూహాలను, రాజకీయ కథనాలను బీజేపీ ఉపయోగిస్తుంది. ప్రతిపక్షాలు బీజేపీ రాజకీయ వ్యూహాన్ని అర్థం చేసుకోవాలి. బీజేపీ తన సైద్ధాంతిక మాతృ సంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) మద్దతుతో ఒక దీర్ఘకాలిక ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది.

జమ్మూ కాశ్మీర్‌లో జరిగినట్టుగా అధికారంలోవున్న పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గాల హద్దులు నిర్ణయించే ప్రక్రియను (డీలిమిటేషన్) తనకు అనుకూలంగా మలుచుకోవడం (గెర్రీమాండరింగ్) దీనికి సూచిక. అనేక రాష్ట్రాలలో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి అది రాజకీయ పార్టీలను చీల్చి ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం. తనకు అనుకూలంగా పనిచేసే ఎన్నికల కమిషనర్లను నియమించుకోవడానికి వారి నియామక ప్రక్రియనే మార్చటం వంటి చర్యలు దాని వ్యూహంలో భాగంగా ఉన్నాయి. ప్రతిపక్షానికి దీర్ఘకాలిక వ్యూహం అంటూ ఏమీ లేదు. అది పూర్తిగా ప్రతిచర్యాత్మకమైనదిగా(రియాక్టివ్) ఉంది. ఇది రాజకీయంగా కూడా అంత చురుగ్గా లేదు.

ప్రతిపక్షం తరచుగా బీజేపీ కథనానికి ప్రతి-కథనాన్ని అందించడానికి ఇబ్బంది పడుతుంది. బీజేపీ ప్రతిపక్ష సంభావ్య ప్రతిచర్యను పరిగణనలోకి తీసుకోవటమే కాకుండా, ఆ ప్రతి-కథనాన్ని తన ప్రయోజనం కోసం ఆయుధంగా మలుచుకుంటుంది. బీజేపీ చర్యలను ప్రతిపక్షం ఏ మాత్రం ఊహించలేకపోతోంది. బీజేపీని ఎదుర్కోవడంలో ప్రతిపక్షానికి అత్యంత ముఖ్యమైన సవాలుగా ఇది ఇప్పటి వరకు నిలిచింది. పదేళ్లకు పైగా కేంద్రంలో కొనసాగుతున్న బీజేపీ పాలనకు చెందిన మెజారిటీవాద(మెజారిటేరియన్) ఎజెండాకు ప్రత్యామ్నాయ దృక్పథాన్ని ప్రతిపక్షం అందించలేకపోయింది.

ప్రతిపక్ష పార్టీలు ప్రతి బీజేపీ నినాదాన్ని, ప్రచారాన్ని స్వతంత్రంగా విమర్శిస్తుంటాయి. అయితే ఈ విమర్శలన్ని కలిసి ఒక



ప్రత్యామ్నాయ సామాజిక దృక్పథానికి సమానం కాజాలవు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, కులగణన కోసం చేస్తున్న ప్రచారం ద్వారా ఒక ప్రత్యామ్నాయ దృక్పథాన్ని అందించేందుకు కాంగ్రెస్ చేరువైంది. అయితే ప్రతి రాష్ట్రంలో వైవిధ్యాలకు కారణమయ్యే సూక్ష్మ-గతిశీలతలలో పొరలు పొరలుగా పాతుకుపోయిన బీజేపీ సామాజిక దృక్పథాన్ని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ పార్టీ ప్రభావవంతంగా లేదు. ఉదాహరణకు, 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ నాయకత్వంలోని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని పరిరక్షించటం, ఉద్యోగాలలో రిజర్వేషన్లను కాపాడటం వంటి విషయాల చుట్టూ ఒక ప్రచారాన్ని ప్రారంభించగలిగింది. అది కొంత లాభాన్ని తెచ్చిపెట్టింది. అయితే, బీజేపీ ఇటువంటి ప్రతి-కథనాలకు అప్రమత్తమౌతూ తన వ్యూహాలను సవరించుకుంటుంది. రాజ్యాంగాన్ని పరిరక్షించడం అనే కథనాన్ని స్వంతం చేసుకోవటానికి అది వేగంగా కదిలింది. అదే విధంగా, పెరుగుతున్న యువత నిరుద్యోగ సమస్యకు తాత్కాలిక పరిష్కారంగా ఇంటర్న్‌షిప్‌లను అందించే ఆలోచనను ముందుకు తీసుకువచ్చింది. చివరికి రాజకీయ చర్చ(పొలిటికల్ డిస్‌కోర్స్)కు సంబంధించిన షరతులను బీజేపీ నిర్ణయిస్తుంటే ప్రతిపక్షం కేవలం తాత్కాలికంగా ప్రతిస్పందిస్తోంది.

ఉదాహరణకు మతపరమైన ధ్రువణత(పోలరైజేషన్)ను ఉత్పన్నం చేయడానికి బీజేపీ మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంటుందనే వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు అది అంతటితో ఆగదు. అటువంటి పరిస్థితి నుంచి జనించే రాజకీయ ఎంపికలను, దృశ్యాలను అది క్రమంలో ఉండేలా చూస్తుంది. తత్ఫలితంగా ఉద్భవించే మతపరమైన మైనారిటీల ప్రతిస్పందనలను బీజేపీ అంచనా వేసి, వాటిని తన ఎన్నికల లెక్కల్లో కారకం చేస్తుంది. మైనారిటీ అనుకూల, దళిత అనుకూల పార్టీలు ప్రాతినిధ్యం వహించడానికి, ప్రతిపక్ష లౌకిక పార్టీల నుండి వారిని దూరం చేయడానికి కావలసిన వ్యూహాన్ని బీజేపీ అమలుచేస్తుంది. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్(ఏఐఎమ్ఐఎమ్), ప్రకాష్ అంబేద్కర్ నేతృత్వంలోని వంచిత్ బహుజన్ అఘాడి వంటి పార్టీలు ఎప్పుడూ ప్రతిపక్ష కూటమిలో చేరకుండా పరోక్షంగా బీజేపీని ఎన్నికలలో బలోపేతం చేస్తాయి. అయితే, ఈ పార్టీలు బీజేపీ, ప్రతిపక్ష పార్టీలను విమర్శిస్తూనే ఉంటాయి. మరో దళిత పార్టీ అయిన బహుజన్ సమాజ్ పార్టీ ఇదే వైఖరిని తీసుకుంటుంది. తాము బీజేపీ, ప్రతిపక్ష కూటమిలతో సమాన దూరం పాటిస్తున్నట్లు పేర్కొంటుంది. బీజేపీ ఈ పరిణామాలను ముందుగానే ఊహించినట్లు కనిపిస్తుంది. అయితే, ప్రతిపక్షం మాత్రం తన రాజకీయ చర్చల పర్యవసానాలను గ్రహించటంలో అంత తెలివిగా వ్యవహరించటం లేదు. నిజానికి ప్రతిపక్ష పార్టీల రాజకీయ చర్చను బీజేపీ తరచుగా ఈ పార్టీలు ఊహించని విధంగా ఉపయోగించుకుంటుంది. ఉదాహరణకు హర్యానా రాష్ట్ర ఎన్నికల్లో, రైతుల నిరసనల మీద, నాలుగేళ్ల కాంట్రాక్టుల కారణంతో కోపంగా ఉన్న సాయుధ దళాలలో అగ్నివీరులుగా చేరాలని కోరుకునే యువతపైన, మాజీ రెజ్లింగ్ సమాఖ్య అధిపతి లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఆందోళన చెందుతున్న మహిళా రెజ్లర్ల నిరసనలపైన ఆధారపడి కాంగ్రెస్ విజయం సాధించడానికి ప్రయత్నించింది. జాట్లను, జాట్లు కాని వారిని కులాల వారీగా విభజించి బీజేపీ ఈ నిరసనలను తెలివిగా ఉపయోగించుకుంది.

ఈ విభజన స్వభావాన్ని, దాని పర్యవసానాలను రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ అర్థం చేసుకోగలిగేటప్పటికి సమయం మించిపోయింది. అలా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయింది. అలాగే, మహారాష్ట్రలో బీజేపీ మరాఠా వ్యతిరేక భావాన్ని ప్రోత్సహించింది. గుజరాత్ ఎన్నికల్లో గెలవడానికి పటేల్ వ్యతిరేక భావాలను, తరువాత రాజ్‌పుత్ వ్యతిరేక భావాలను ఉపయోగించింది. బీజేపీ తన సొంత ప్రత్యర్థులను ప్రోత్సహించి, ఎన్నికల ప్రయోజనం కోసం తన రాజకీయ ప్రక్రియలో వారిని ఉంచుతుంది. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) విషయంలో కూడా ఇదే చేసింది. "ఇండియా అగైనెస్టు కరప్షన్" ఉద్యమం ద్వారా ఆ పార్టీని సృష్టించడంలో సహాయపడింది.

ఆ తరువాత ఆమ్ ఆద్మీ పార్టీని కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థిగా నిలిచేలా చేసి దాని క్షీణతకు కారణమయ్యేలా చేసింది. ఢిల్లీ, పంజాబ్‌లలో స్పష్టంగా కనిపిస్తున్నట్లుగా ఆప్ కాంగ్రెస్ బలహీనపడటానికి కారణభూతమైంది. చివరగా, బీజేపీ నిరంతరం నినాదాలు, విధానాలు, ప్రచారాల శ్రేణితో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేయడం ద్వారా ప్రతి-కథనం ఆవిర్భవించటానికి అవకాశం ఇవ్వదు. ఒక కథనం తడబడటం మొదలవగానే, అది మరొక దానికి వెళుతుంది. దీనితోపాటు, పార్లమెంటులో ప్రజల దృష్టిని మార్చే అంశాలను లేవనెత్తటంలో, అంతరాయాలను సృష్టించడంలో అది చూపుతున్న చురుకుదనం వల్ల ప్రతిపక్షం స్థిరమైన విమర్శను అందించలేకపోతుంది. ఫలితంగా, బీజేపీ ప్రతిపక్షాల ప్రతిస్పందనను ముందుగానే అడ్డుకుంటుండగా, ప్రతిపక్షం బీజేపీ చేసే దానికి మాత్రమే ప్రతిస్పందిస్తుంది. ఆవిధంగా ఓటర్ల మనస్సులను ఆకట్టుకోవడానికి ప్రతిపక్షం కష్టపడుతూనే ఉంది.

బీజేపీ నాయకులు తాము సుదీర్ఘ కాలంపాటు అధికారంలో కొనసాగుతామని చెబుతున్నప్పుడు వారి మనసుల్లో రాజకీయ ప్రవచనం (పొలిటికల్ డిస్‌కోర్స్) ఎలా ఉండాలనే విషయానికి సంబంధించిన షరతులను నిర్ణయించే సామర్థ్యం తమ స్వంతం అనే భావన ఉంటుంది. ❑

**(అనువాదం: నెల్లూరు నరసింహారావు)**

# మోడీ-ట్రంప్ కౌగిలింతలు భారత్ ప్రతిష్టను పెంచవు



- సంజయ్ బారు

గ్రీన్‌లాండ్ ఆక్రమణ, గాజా ఆక్రమణ వంటి విషయాలపై భారత్ నోరు మెదపకపోవటం ప్రపంచ రాజకీయాల్లో భారత్ స్థానాన్ని మసకబారుస్తున్నాయి. ఈ వారం ప్రధాని మోడీ వాషింగ్టన్ పరిగెత్తడాన్ని రెండు కోణాల్లో చూడాలి. అధ్యక్షుడు ట్రంప్ నుండి ఆహ్వానం అందుకున్న తొలి ముగ్గురు దేశాధినేతల్లో మోడీ కూడా ఒకరని మనం తృప్తిపడటం ఒకటి. ఈ వాదన ఢిల్లీ పత్రికల్లో ప్రముఖంగా వస్తుంది. ఈ ఆహ్వానం కేవలం భారత్-అమెరికా మధ్య ఉన్న దౌత్య సంబంధాలకు నిదర్శనం మాత్రమే కాదని మోడీ, ట్రంప్‌ల మధ్య ఉన్న పర్సనల్ కెమిస్ట్రీకి చిహ్నమని వ్యాఖ్యానిస్తారు. ఒకేగూటి పక్షులనీ, భారత్ అమెరికాకు ముఖ్యమైనదీ, అమెరికా భారత్‌కు ముఖ్యమైనదన్న వాదనలు కూడా వినిపిస్తాయి.

సమ ఉజ్జీలు అన్న వాదనను ప్రశ్నించేది రెండో కోణం. ట్రంప్ మరెవ్వరినీ తనకు సమఉజ్జీ అని అంగీకరించరు. నిజానికి ట్రంప్ రెండోసారి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అమెరికా పర్యటించిన రెండు దేశాల నేతలూ అంతర్జాతీయ వ్యూహంలో అమెరికాకు జూనియర్ భాగస్వాములే. ఒకరు ఇజ్రాయెల్ అధ్యక్షులు, మరొకరు జపాన్ ప్రధాని. అమెరికా ప్రత్యక్ష సహకారం వల్లనే ఇజ్రాయెల్ ఇరుగు పొరుగు దేశాలతో చేస్తున్న యుద్ధాల్లో బతికి బట్టకట్టగలిగింది. గెలిచిన దేశాలను ప్రపంచంలోని అతి పెద్ద రియల్ ఎస్టేట్ డీలర్‌కు అమ్మటానికి ఈ పర్యటనను ఉపయోగించుకున్నారు.

ఇక జపాన్ ప్రధాని. ట్రంప్‌తో ఫోటో దిగితే దేశీయ రాజకీయాల్లో తనకు నాలుగు మార్కులు పడతాయని ఆశగా ఎదురుచూస్తున్న నాయకుడు షిగెరు ఇషిబా. ట్రంప్ మొదటి దఫా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తలుపు తట్టిన జపాన్ ప్రధాని షింజో ఆబెకు ఇషియా పొలిపోయిన ప్రతిబింబమే. ట్రంప్‌తో జపాన్‌కు కలిగే ప్రయోజనం ఏమిటన్న విషయంలో కనీసం షింజో ఆబెకు కొన్ని ప్రశ్నలన్నా ఉన్నాయి. ఇప్పట్లో ఆయన పదవికి వచ్చిన ముప్పేమీలేదు. చైనా ప్రీమియర్ షీ జిన్‌పింగ్‌కు తొలి ఆహ్వానం పంపుతాడేమో అన్న ఆందోళనతో బిక్కచచ్చి ఉన్నాడు ఇషిబా. చైనా కోసం జపాన్‌ను అమెరికా పసిఫిక్ సముద్రంలో ముంచుతాడా, అమెరికా, చైనాల జోడి తూర్పు తీరంలో జపాన్ పలుకుబడిని కట్టడి చేస్తుందా వంటి భయాలున్నాయి ఇషిబాకు.



## స్వతంత్ర శక్తిగా భారత్

అమెరికాతో గోక్కుంటే తమకు జరిగే నష్టమేమిటో తెలిసిన దేశాలు జపాన్, ఇజ్రాయెల్. భారతదేశం విశ్వబంధు అని చెప్తారు. ఈ రెండు దేశాల రక్షణ వ్యవస్థలు అమెరికాపైనే పూర్తిగా ఆధారపడి ఉంటాయి. అందువల్లనే ఈ రెండు దేశాలూ అమెరికాకు జూనియర్ భాగస్వాములుగానే వ్యవహరిస్తున్నాయి. చతుర్భుజిలో ఆస్ట్రేలియా, జపాన్‌లు అమెరికాకు జూనియర్ భాగస్వాములుగానే ఉన్నాయి. ఈ కూటమిలో భారతదేశం ఒక్కటే తనదైన ఆలోచన, వ్యవహారశైలి కలిగి ఉన్న దేశం.

భారతదేశం విశ్వబంధు అని చెప్తారు. ఏమి ఆలోచించినా, ఏమి చేసినా దేశవాళీ శైలిలోనే చేస్తుంది. ప్రాదేశిక సమగ్రతను కాపాడుకునే ప్రయత్నంలో ఒకటి, రెండుసార్లు ఇతర దేశాల సహకారాన్ని తీసుకున్నా స్థూలంగా వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని పాటిస్తుంది. ఇజ్రాయెల్‌ను ఏర్పాటు చేసినట్లు పశ్చిమ దేశాలు భారతదేశాన్ని ఏర్పాటు చేయలేదు. తనదైన నాగరికత కలిగిన దేశం. దీర్ఘకాలం వలస పాలన కింద నలిగిన దేశం. వలస పాలనకు వ్యతిరేకంగా భారతదేశం సాగించిన మహోన్నత పోరాటం సామ్రాజ్యవాద, వలసవాద వ్యతిరేక పోరాటాలకు స్ఫూర్తినిచ్చింది. దక్షిణార్ధగోళంలో మనదేశమే నాయకురాలు. మన గొప్పతనం గురించి పక్కన పెడితే మనకున్న పరిమితులు, బలహీనతలు మనకున్నాయి. ట్రంప్ లాంటి నియంతృత్వ పోకడలున్న వ్యక్తితో వ్యవహరించేటప్పుడు ఎందుకు ఆందోళనకు గురవుతోంది ?

అమెరికాతో నిలకడైన సంబంధాలు కోరుకోవడానికి

ప్రధానంగా రెండు కారణాలున్నాయి. చైనా ఎదుగుదల నేపథ్యంలో ఆసియా ఖండంలో బలాబలాలు విషయంలో తనదంటూ పాత్ర పోషించాలన్న కాంక్ష భారతదేశానికి ఉంది. ఈ విషయంలో భారత్ అమెరికా దోస్తీ చైనాతో వ్యవహరించేటప్పుడు ఉపయోగపడుతుంది. అయితే ఇది ఉభయులకూ ప్రయోజనం కలిగించే అంశమే.

ట్రంప్ చైనా ప్రీమియర్ షీ జిన్‌పింగ్‌కు కాల్ చేసి మాట్లాడినందు వలన మనం మరీ అంత కంగారు పడిపోయి హైరానా చెందాల్సిన అవసరం లేదు. అది కూడా అందరికీ కనిపించేలాగా. ఈ రెండు నెలల్లో భారతదేశం వ్యవహరించిన తీరు గురించి రానున్న పాకేతిళ్లపాటూ అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చిస్తూనే ఉంటారు. వాషింగ్టన్ కేంద్రంగా పని చేసే పీటర్సన్ ఇనిస్టిట్యూట్‌లో పనిచేసే ఫ్రెడ్ బెర్గ్‌స్టన్ ప్రపంచం మొత్తం అమెరికా, చైనాల చెప్పు చేతల్లో ఉండాల్సి వస్తుందని అంచనా వేశారు. ఈ కూటమికి కిమెరా అని పేరు కూడా పెట్టారు. ఇంకా చెప్పాలంటే ఆ పరిస్థితులే వచ్చి అమెరికా, చైనాలు మొత్తం ప్రపంచాన్ని చెరి సగం పంచుకుని ఏలాలనుకుంటే ఆపే శక్తి భారత్‌కు లేదన్న వాస్తవాన్ని మనం ఒప్పుకోవాలి. ఇప్పుడున్న ప్రపంచశక్తుల పొందికతో జాగ్రత్తగా వ్యవహరించటంలోనే భారత్ ప్రయోజనాలు దాగి ఉన్నాయి. మనమేదో కొత్త అంతర్జాతీయ బలాబలాలను నిర్మించాలను కోవటం సాహసమే అవుతుంది. అమెరికా, చైనాల మధ్య ఉన్న వివాదాలు, సయోధ్యలను భారతదేశం తనదైన సామర్ధ్యంతో ఎదుర్కోవాలి. ఈ పరిస్థితుల్లో అమెరికా మనకు మిత్ర దేశమే అని చెప్పుకునే ప్రయత్నంలో హడావుడిగా అమెరికా పరిగెత్తడటం, దానికోసం ఆందోళన చెందటం అవసరం లేని వ్యవహారం.

## అంతర్జాతీయ వాణిజ్య యుద్ధాలకు తెరతీస్తున్న ట్రంప్

అంతర్జాతీయ వాణిజ్య యుద్ధాలకు తెరతీయటానికి ట్రంప్ సిద్ధం కావటం భారతదేశం ఆందోళనకు మరోకారణం. అమెరికాతో భారతదేశానికి ఉన్న వాణిజ్యం వలన మన వాణిజ్యలోటు భారీఎత్తున పెరిగే ప్రమాదం ఏమీ లేదు. వాణిజ్యోత్పత్తులపై దిగుమతి సుంకాలు విధించినా మన దేశం నుండి అమెరికాకు ఎగుమతవుతున్న సేవా రంగంపై అమెరికా ఆధారపడక తప్పదు. సేవారంగ వాణిజ్యం విషయంలో రెండు దేశాలకూ సమానపాత్ర ఉంటుంది. ఒకరికొకరు కావాల్సిందే. అమెరికాలో కూడా భారతదేశానికి చెప్పుకోదగ్గస్థాయిలో లాబీంగ్ శక్తి ఉంది. ట్రంప్ చుట్టూ ఉన్న సహస్ర కోటీశ్వరులే భారత దేశపు సాంకేతిక సామర్థ్యంతో ప్రయోజనం పొందుతున్నారు.

అమెరికా గురించి మాట్లాడుకునేటప్పుడు భారతీయులకు వీసాలు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ కీలకమైన అంశాలుగా ఉంటాయి. ఇది కూడా ఇద్దరికీ ప్రయోజనం కలిగించేదే. ఒక్క భారతదేశానికే కాదు. అందువల్ల వీసాల సంఖ్య పెంచటానికో, సాంకేతిక పరిజ్ఞానం సంపాదించటానికో శ్వేతసౌధం ముందు పడిగాపులు గాయాల్సిన అవసరం లేదు. ప్రచ్ఛన్నయుద్ధం తారస్థాయిలో ఉండి ముఖాముఖీ చూసుకునే పరిస్థితి లేనప్పుడు సైతం భారతీయులకు వీసాలు వచ్చాయి. అమెరికా పారిశ్రామిక రంగానికి కావల్సిన మేధోసంపదను తరలించుకు పోవడానికి వెనకాడలేదు.

గత నాలుగు దశాబ్దాల్లో లక్షలాది మంది భారతీయులు కావాలనే అమెరికా వెళ్లారు. వాళ్ల కోసం ఏ ప్రభుత్వమూ ప్రత్యేకంగా బేరసారాలాడలేదు. మరోవైపున అమెరికాకు అనుంగు మిత్రుడుగా ఉన్న మోడీ ప్రభుత్వం అక్రమంగా ప్రవేశించారన్న పేరుతో భారతీయులకు బేడీలు వేసి తరలించటాన్ని అడ్డుకోలేదు. కనీసం నిరసన కూడా వ్యక్తం చేయలేదు. భారతీయులకు జరిగిన అవమానానికి నిరసన వ్యక్తం చేస్తే మిన్ను విరిగి మీద పడేదేమీ లేదు. దౌత్య పరిస్థితులు మెరుగుపడ్డ తర్వాత అమెరికా పర్యటనకు వస్తామని వాయిదా వేసుకుంటే దేశప్రతిష్ట మరింత పెరిగేది. అమెరికాలో పరిస్థితులు నిలకడ స్థితికి వచ్చే వరకూ ప్రధాని తన పర్యటనను వాయిదా వేసుకున్నా వచ్చే నష్టం ఏమీలేదు. ప్రతి చిన్న దానికీ అమెరికాపైనే ఆధారపడ్డ లాటిన్ అమెరికా దేశాలు, మెక్సికో, కెనడాలు ప్రదర్శించినంత బింకాన్ని సైతం భారతదేశం ప్రదర్శించలేకపోవటం విచారించదగ్గ విషయం.

ఇంతటి వివాదాస్పద సందర్భంలో ట్రంప్‌కు ప్రేమ పావురాలను పంపటం వర్ధమాన దేశాల నేతగా భారతదేశాని కున్న పేరు ప్రతిష్టలను మసకబారుస్తోంది. దక్షిణాఫ్రికాలో జరుగుతున్న జి20 సమావేశాలకు హాజరు కానని, దక్షిణాఫ్రికా ప్రభుత్వాన్ని గుర్తించేందుకు తాను నిరాకరిస్తున్నానని అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో ప్రకటించారు. జి 20 సమావేశాలు ఏర్పాటు చేయటానికి ఊరూ వాడా ఏకం చేసి మరీ ప్రచారం చేసిన కేంద్ర ప్రభుత్వం ఈ ప్రకటన పట్ల కనీసం పల్లెత్తిమాట అనలేకపోయింది. గ్రీన్‌లాండ్, గాజా వంటి దేశాలను అమెరికా దురాక్రమణను ప్రశ్నించలేకపోవటం స్వతంత్ర దేశంగా మన దేశ ప్రతిష్టను మసకబారుస్తోంది. మన దేశం సర్వ స్వతంత్రంగా వ్యవహరించగలుగుతుందన్న నమ్మకం తోనే అనేక దేశాలు ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో మన దేశానికి స్థానం దక్కాలని మద్దతు పలికారు. వలసవాద వ్యతిరేక వారసత్వాన్ని కొనసాగిస్తుందనీ, సాయుధ సైనిక కూటముల్లో చేరకుండా తటస్థంగా ఉంటుందనీ నమ్మాయి. నెతన్యాహూ లాంటి రక్తపిపాసి తర్వాత ట్రంప్‌ను కలిసేందుకు ఉవ్విళ్లూరటం మోడీకి గానీ, దేశానికి గానీ ప్రతిష్ట పెంచే చర్య కాదు. ❑

**(అనువాదం : కొండూరి వీరయ్య)**

# వీకెండ్ మ్యూజింగ్స్



- జీయస్ రాంమోహన్

**మోదీ నాకు అత్యంత ప్రియమైన మిత్రుడు అన్నాడు. ఇంత బేరమాడే మనిషిని జిందగీలో చూల్లే అన్నాడు. తుస్సీ గ్రేట్ హెూ అని ఆటోగ్రాఫ్ చేసిన బుక్ ఇచ్చాడు. ఇద్దరు నేతలు పరస్పర ఇగో మర్దనం చేసుకున్నారు. సివరాకర్న తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే అని తెలుగు సామెత గుర్తు చేశాడు ట్రంప్. ప్రపంచంలోనే అత్యంత అధిక పన్నులు విధించే దేశం భారత్ అని మెటికలు విరిచాడు. బిజినెస్ మ్యాన్. బిజినెస్లో ఇద్దరూ ఇద్దరే కావచ్చు. కానీ త్రాసులో పవర్ అనే చింతపండు ఒక కొసన అంటి ఉంటుంది.**

మోదీ అమెరికా పోక ముందే నమస్కార బాణం లాగా హార్లీడేవిడ్ సన్ బైక్స్, మరి 25కు పైగా వస్తువుల మీద సుంకాలు తగ్గించారు కదా! అది సరిపోదమ్మా, మిగిలిన వాటి సంగతేంటి అని అక్కడి నుంచి వినిపించే సరికి ఇద్దరి మీటింగ్ జరిగే లోపలే బ్రోబర్న్ విస్కీ మీద 50 శాతం పన్ను తగ్గించింది ఇండియా. ఏమి వేగం ఏమి వేగం! ఆచరణలో నీ వేగాన్ని నువ్వు మాత్రమే డిసైడ్ చేయవు. నీ ప్రత్యర్థి డిసైడ్ చేస్తాడు. అతను బలవంతుడైనప్పుడు మరీ ముఖ్యంగా. ఇపుడు అర్జెంట్‌గా ఇండియాలో దిల్ ఖుష్ అయ్యేదెవరయ్యా అంటే అప్పర్ మిడిల్ క్లాస్. అందులోనూ సాయంత్రం స్కాచ్ సేవించేవాళ్లు. పొద్దునే ఆల్మండ్స్ తినేవాళ్లు కూడా. ఇండియాలో తినే బాదాంలో ఎక్కువ శాతం కాలిఫోర్నియా బాదాం అని విజ్ఞులకు ప్రత్యేకంగా సెలవివ్వనక్కర్లే. విస్కీ ఆల్ రెడీ తగ్గింది, బాదాం కూడా తగ్గడం ఖాయం. ఇంతకు ముందే పన్నుల వివాదంలో కాస్త తగ్గించి ఉన్నారు. ఇపుడు మరింత తగ్గొచ్చు. ఇపుడు జిమ్ బీమ్ రేట్లు భారీగా తగ్గుతాయి. బహుశా జాక్ డేనియల్ కూడా. ఇండియాలో జుగాడ్ లేకుండా ఏదీ జరగదు కాబట్టి ఏది ఒరిజినల్, ఏది లోకల్ మాల్ విత్ ఫారిన్ లేబుల్ అనేది పక్కన పెడితే (ప్రపంచంలో మొత్తం తయారయ్యే స్కాచ్ కంటే ఇండియాలో ఎక్కువ తాగుతారని అరవింద్ ఆదిగ వైట్ టైగర్లో ఆల్ రెడీ చమత్కరించి ఉన్నాడు) అమెరికా నుంచి దిగుమతి అయ్యే విస్కీ రేట్లు అయితే తగ్గాయి. ఇది చిన్న విషయమేమీ కాదు. విస్కీ వాడుక ఇండియాలో విపరీతంగా పెరుగుతోంది. ఊరికే హైదరాబాద్ చుట్టూతా జరిగే పెళ్లిళ్లు, వేడుకలను



చూడండి. ఒకప్పుడు టేబుల్‌కు ఒక రాయల్ చాలెంజ్ పెట్టేవాళ్లు. ఇపుడు జెడిలు జిమ్ బీమ్లు సాధారణమైపోయాయి. సో ఆ క్లాస్ ఇపుడు దిల్ ఖుష్. మొగాంబో ఖుష్.

అలాగే బాదాం పొట్టు తీసి తినాలా, పొట్టు తీయకుండా తినాలా, నానబెట్టే తినాలా అని పొద్దస్తమానం అంతర్జాతీయ సమస్యతో అజీర్తి తెచ్చుకునే వాళ్లు కూడా ఖుష్. సోషల్ మీడియా వల్ల సెలబ్రిటీస్ వల్ల యూట్యూబ్ ఇన్ ఫ్లుయెన్సర్ వీడియోస్ వల్ల హైక్లాస్‌ను ఇమిటేట్ చేయడం దానికంటే కిందున్న క్లాసుకు అలవాటైపోయింది కాబట్టి ఇది తక్కువ సంఖ్యేమీ కాదు. పప్పులు, సన్ ఫ్లవర్, పామాయిల్ అని నిత్యావసరాల గురించి అడక్కండి, అవి ప్రధానంగా అమెరికా నుంచి వచ్చేవి కావు. కెనడా, ఆస్ట్రేలియా, యుక్రెయిన్, ఇండోనేషియా, మియన్మార్ నుంచి కదా ఎక్కువ దిగుమతి అయ్యేది. యుద్ధం వల్ల యుక్రెయిన్ నుంచి వచ్చే సన్ ఫ్లవర్, కెనడాతో గొడవ వల్ల అక్కడ నుంచి పప్పు ధాన్యాల రేట్లు పెరిగితే అది వేరే కథ! ఇండోనేషియా పామ్ ఆయిల్ ను ఇథనాల్‌కు తరలించడం వల్ల ఇప్పటికే ఇక్కడ రేట్లు పెరిగి ఉన్నాయి. ఇండియా ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ విస్కీ తాగే దేశం. ప్రపంచం మొత్తం మీద ఉత్పత్తి అయ్యే విస్కీలో సగం విస్కీ ఇక్కడే తాగేస్తున్నారు. అందులోనూ స్కాచ్ వినియోగం విపరీతంగా పెరుగుతోంది. బాదాం పిస్తాలో! అవేం తక్కువ కాదు. 2008 నుంచి ఇప్పటి వరకూ ఐదున్నర రెట్లు వినియోగం పెరిగింది. ఇదంతా మన్మోహన్ హయాంలో మొదలైంది. మన్‌మోహన్ లేకుండా మోదీ లేరు. ఆ పునాది మీదే ఇప్పటి రాజ్యం నడుస్తోంది. అపుడు వేగంగా పెరిగిన మధ్యతరగతి చాలా వాటికి కేంద్రమైంది. రియల్ ఎస్టేట్

అమాంతంగా పెరగడమనే ట్రెండ్ తీసుకున్నా, కార్లు బైకులు విపరీతంగా కొనడమనే ఆటోమొబైల్ వెల్లువ తీసుకున్నా అన్నీ అప్పటి నుంచే. దాని రాజకీయ లక్షణాలు కూడా వేరే. కొత్త మధ్య తరగతి, డైరక్ట్ క్యాష్ ట్రాన్స్ ఫర్స్, డిజిటల్ రివల్యూషన్ ఈ మూడూ అత్యంత కీలకమైన పరిణామాలు భారతీయ సోషల్ పొలిటికల్ సైకీ మీద పనిచేస్తున్న అంశాలు. అవే వర్తమాన పాలకులకు ఆయుధాలు కూడా. రైడింగ్ ఆన్ ది వేవ్స్ క్రియేటెడ్ బై ది ఎర్లియర్ రెజీమ్.

ఇప్పటి వరకు అమెరికా నుంచి దిగుమతి అయ్యే కొన్ని వస్తువుల మీద పన్ను విపరీతం. ఇండియా నుంచి ఎగుమతి అయ్యే వస్తువుల మీద అంత లేదు. ఇపుడు మీరెంత వేస్తే మేమూ అంత వేస్తాం అని తెగేసి చెపుతున్నాడు ట్రంప్. సో ఇక్కడి నుంచి అక్కడికి పోయే మెడిసిన్లు, సాఫ్ట్‌వేర్లు, ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్లు వగైరాలపై బాదుడు తప్పదు, అక్కడి నుంచి ఇక్కడికి వచ్చే ఫ్రూట్స్, ఆయిల్స్‌పై సుంకాలు తగ్గించకా తప్పదు.

అలాగే చాలా మందికి ఆశ్చర్యం అనిపించొచ్చు కానీ అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులకంటే భారత్ అక్కడికి ఎగుమతి చేసే వస్తువులే ఎక్కువ. మామూలు ఎక్కువ కాదు. డబుల్. 2023-24లో భారత్ 87 బిలియన్ డాలర్ల మేర అమెరికాకు ఎగుమతులు చేస్తే అమెరికా కేవలం 41 బిలియన్ డాలర్ల మేర వస్తువులను భారత్కు ఎగుమతి చేసింది. సో అమెరికాకు భారీ వాణిజ్య లోటు ఉంది భారత్‌తో. అది పూడ్చుకోవడానికి అమెరికా ప్రయత్నిస్తుంది. ఒత్తిడి తెస్తుంది, అది ఆల్రెడీ ఆన్ కార్డ్స్. సో ఇక ముందు రష్యాతోపాటు అమెరికా నుంచి భారీగా ఆయిల్, గ్యాస్ దిగుమతి చేసుకోవాల్సి రావచ్చు. ఇప్పటివరకైతే సముద్రంలో రష్యా, గాల్లో అమెరికా అన్నట్టుంది వ్యవహారం. ఇపుడు ఫ్రాన్స్ వాటా కూడా పెరుగుతోంది ఎయిర్ ఫోర్స్‌కు సంబంధించి. ఇండియన్ కంపెనీలు సణుగుతాయి దెబ్బతింటాం చౌక వస్తువులు దిగుమతి అయితే అని. కానీ తప్పకపోవచ్చు. ఇండియన్ ఇండస్ట్రీ కాస్త ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. ఇప్పటి వరకూ అధిక లాభాలు ఆర్జించిన కొన్ని కంపెనీలకు సెగ తప్పక పోవచ్చు. అసలే వినియోగం తగ్గి రెండు క్వార్టర్లుగా కంపెనీలు దిగాలుగా ఉన్నాయి. ఆరు నెలలుగా స్టాక్ మార్కెట్ పడుతూనే ఉంది. ఇపుడిది మూలిగే నక్కపై తాటిపండు వంటిది. వినియోగదారులకు అయితే కొన్ని ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్, మరికొన్ని వస్తువులు మరి కాస్త చౌకగా దొరకొచ్చు. డిఫెన్స్, ఆటమిక్ ఇంజిన్స్ నిత్య జీవితానికి సంబంధించినవి కావు కాబట్టి కాసేపు వాటిని పక్కనపెడదాం.

ఇంకో ముఖ్యమైన విషయం ఉంది. ఇది కూడా చాలా మందిని ఆశ్చర్యపరచొచ్చు. గాట్ అని డంకెల్ అని డబ్ల్యుటిఓ అని చాలా మాట్లాడాం, మాట్లాడుతూ ఉంటాం కదా!(అప్పటి వీధినాటికలో నేనూ పాత్రధారినే) వాటి ప్రతికూల పరిణామాలు ఏమైనా కావచ్చు కానీ దాంతో భారత్ వంటి వర్తమాన దేశాలకు ఒనకూడిన ప్రయోజనం ఒకటుంది. అభివృద్ధి చెందిన దేశాలకు వర్తమాన దేశాలు ఎగుమతి చేసే వస్తువులపై సుంకాలు తక్కువ గానూ అక్కడి నుంచి ఇక్కడికి వచ్చే వస్తువులపై సుంకాలు ఎక్కువగానూ ఉండేలా ఒక ఏర్పాటు చేసుకున్నారు. అంటే అవి ఆల్ రెడీ అభివృద్ధి చెందిన దేశాలు. రెంటినీ ఒక గాటన కట్టొద్దు. లోకల్ ఇండస్ట్రీని రక్షించుకోవడానికి వర్తమాన దేశాలకు వెసులుబాటు ఉండాలి, వాటికి అధిక పన్నులు వేసే అవకాశం ఉండాలి అని ప్రిన్సిపుల్ స్టాండ్ అప్పట్లో కుదిరింది. దాని ప్రకారమే ఇప్పటి వరకూ కొన్ని పదార్థాల మీద వర్తమాన దేశాలు సుంకాలకు సంబంధించిన వెసులుబాటును అనుభవిస్తున్నాయి. ట్రంప్ డిక్షనరీలో బిజినెస్ తప్ప ప్రిన్సిపుల్ అనే పదం లేదు కాబట్టి అదంతా జాన్తానై అంటున్నారు, తమ్ముడు తమ్ముడే.. అంటున్నారు. ఇపుడు రెండోసారి తిరిగొచ్చిన విమానంలో కూడా అక్రమ చొరబాటుదారులను బేడీలు వసే పంపించారు. భారత ప్రయత్నాలు ఏమీ ఫలించలేదు. అది ఇమేజ్ దెబ్బ తీస్తుందని ఇక్కడి వారు ఎంత ప్రయత్నించినా అదయితే తప్పలే. అక్రమంగా చొరబడిన వారినే ఇప్పటికైతే పంపిస్తున్నారు. అక్రమంగా ఉంటున్న వారి మీద చర్యలు మొదలయితే అప్పుడు కానీ ఇక్కడ తెలుగు నేలకు సెగ తగలదు. అది ఏ రూపంలో ఉంటుందో ఇప్పటికైతే తెలీదు.

- **పెట్టుబడిదారీ వ్యవస్థపై తిరుగుబాటు పెరుగుతోంది. అది కుప్పకూలక తప్పదు. ఉత్పత్తిని సమానంగా ప్రజల మధ్య పంచకపోవడమే దీనికి ప్రధాన కారణం.**

**- రఘురామ రాజన్, ఆర్‌బీఐ మాజీ గవర్నర్**

- **ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు మొలకెత్తకుండా ఎల్లకాలం ఉండబోవు. సామాజిక క్రమాన్ని శత్రువు నేరాలతోను, బల ప్రయోగం తోను అణచివేయలేరు. చరిత్ర మనది. ప్రజలే చరిత్ర నిర్మాతలు.**

**- సాల్వడార్ అలెండీ, అమెరికా కుట్రలకు బలైన చిలీ అధ్యక్షుడు, కమ్యూనిస్టు నేత**

- **న్యాయం గెలుస్తుందన్న అన్న మాట నిజమే. కాని, గెలిచేదంతా న్యాయం కాదు. - శ్రీశ్రీ**

# యుద్ధం : ఎస్ఆర్ పృథ్వీ పద్యకావ్యం



**ఆప్తవాక్యం** : డాక్టర్ బులుసు వీఎస్ మూర్తి, కళాగౌతమి వ్యవస్థాపకులు

**ఒక పని చేయమనడం సులువు. చేయాలంటేనే కష్టం. ఇది పద్యానికి కూడా వర్తిస్తుంది. తెలుగు పద్యానికి సవాలక్ష నిబంధనలు. భాషా సామర్థ్యం ఉండాలి. వ్యాకరణం తెలియాలి. ఛందస్సు తెలియాలి. పద సౌష్టవం తెలియాలి. ఇలా ఎన్నో నిబంధనలు. వాటినన్నిటినీ సమగ్రంగా తెలుసుకోవడం సామాన్యమైన పని కాదు. కాని కొందరు ఆ కష్టాలన్నీ సహించి, భరించి పద్య రచనకు పూనుకుంటూనే వుంటారు. అలాంటి వారిలో మన పృథ్వి గారొకరు.**

చాలా మందికి పృథ్వి గారికి తేడా ఉంది. అదేమిటంటే, పృథ్వి గారు ఇప్పటికే రచనలో లబ్ధ ప్రతిష్టులు. వ్యవహార జ్ఞానం పరిపుష్టంగా కల వారు. సాహిత్యంలో ఎన్ని ప్రక్రియలు ఉన్నాయో వాటిలో చాలా వాటిని తన రచనలో ప్రజలకందిచ్చి పేరు పొందిన వారు. ఒంటరిగా కాకుండా పది మందిలో తానొకడుగా ఉండడం ఈయన అభిమతం. అందుకే ఉద్యోగ రంగంలోనే కాకుండా సాహిత్య రంగంలో కూడా పలు కార్యక్రమాలను నిర్వహించిన కౌశల్యం ఈయన సొత్తు. సమాజం గురించి ఆలోచించడం, సమాజంలో ఒకడిగా ఉండడం ఈయనకు స్వతస్సిద్ధంగా లభించిన లక్షణాలు. అందు కే సమాజం గురించి ఆలోచిస్తున్నారు. లేకపోతే ఈ యుద్ధం గొడవ ఈయన కెందుకు చెప్పండి? మతం మత్తు పదార్థం అన్నారు. అది నిజమా? ఎవరు ఏ మతాన్ని అనుసరించినా నదులలోని నీళ్ళన్నీ సముద్రంలో చేరినట్లుగా సమస్త దేవతల నమస్కారాలు ఆ పరమాత్ముడిని చేరుతాయి. ప్రధానంగా మానవీయ విలువలపైనే ఈ మతాలు ఆధారపడి ఉంటాయన్నది సత్యం. అంతే కాని మతం కోసం కత్తులు నూరకూడదు. ఒకరిపై ఒకరు ద్వేషాన్ని పెంచుకోకూడదు. కానీ నేడు ప్రపంచంలో జరుగుతున్నది అదే. దీన్ని మానవత్వం కలిగిన ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలి. సహనంతో మనుషుల మధ్య వైవిధ్యాన్ని పరిష్కరించుకోవాలి.

నిజానికి మతం సూచించేదానికి మనిషి ఆచరించేదానికి ఎక్కడా పొంతన కుదరదు. ఎందుకంటే ఏ మతం కూడా సాటి మనిషిని హింసించమని చెప్పదు. చెప్పకూడదు కూడా. చెబితే అది మతమే కాదు. మతం విశ్వ సౌభాగ్యాన్ని కోరాలి కాని విశ్వ సంహననాన్ని కోరితే అది మత మెలా అవుతుంది.

“సర్వ దేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి శ్రీకేశవం ప్రతి గచ్ఛతి’ అనే సూత్రాన్ని అందరూ నమ్మాలి. అంటే ఏ దేవుడికి నమస్కరించినా ఆ నమస్కారం నాశరహితుడైన పరమాత్మకే చెందుతుంది. మంగళకరుడైన ఆ నాశరహితునికే చెందుతుంది. ఈ సమ సమానత్వాన్ని సమాజం పరిరక్షించుకుంటే ఇక యుద్ధాలు ఎక్కడుంటాయి చెప్పండి. కాని నేటి సమాజంలో కలిసి బ్రతకడం కాదు. విడిపోయి కలహాలు పెంచుకోవడంలోనే మోజుగా ఉండటం కనబడుతుంది. అందుకే పృథ్వి గారంటారు. భావి జీవులకిది గొప్ప బాధ్యతలను నేర్పు, శాంతి కాముకులుగా నిలువ దారి జూపు, పంతమ్ములు విడిచి జోలపాడు నటుల చేయుటే భాగ్యమౌననుట నిజము నిజమే కదా! అందరూ శాంతి కాముకులైతే ఇక యుద్ధాలకు చోటెక్కడిది. ఎవరు ఏ మతాన్ని అనుసరించినా అందరూ తమ సోదరులనే భావాన్ని పెంచుకోవాలి. సమాజ అభివృద్ధికి నడుం కట్టాలి.

**(మిగతా 34వ పేజీలో)**





**ప్రతులకు.. శ్రీమతి పి.ఉషారాణి, 104-6-140, ఎంజీ స్ట్రీట్, రామకృష్ణ నగర్, రాజమహేంద్రవరం, 533101, సెల్ : 99892 23245**

# నెల్సన్ మండేలా ఆత్మకథ

- శ్రీధర్ దేస్ పాండే

**రాపోలు సీతారామరాజు గారు ఈ పుస్తకాన్ని అనువాదం చేస్తే దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక పుస్తకంగా ప్రచురించింది. డిసెంబరు 2024లో జరిగిన హైదరాబాద్ బుక్‌ఫేర్‌లో కొన్నాను. 340 పేజీల పుస్తకాన్ని ఐదు రోజులుగా ఏకబిగిన చదివేశాను. ఒక గొప్ప పోరాటయోధుడి జీవితాన్ని ఆయన ద్వారానే తెలుసుకున్నా. 27 ఏళ్ల అత్యంత దుర్భరమైన, కష్టతరమైన జైలు జీవితం గడిపిన మండేలా జీవితేచ్ఛ, స్వేచ్ఛాకాంక్ష అనితరసాధ్యం. 27 ఏళ్లలో చివరి రెండేళ్లలో మాత్రమే కాస్త మెరుగైన జైలు జీవితాన్ని గడిపే అవకాశాన్ని ఇచ్చింది దక్షిణాఫ్రికా తెల్ల జాత్యాహంకార ప్రభుత్వం. అది కూడా అమెరికా సహా ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక ఆంక్షలు, దౌత్య సంబంధాల బహిష్కరణ, క్రీడల బహిష్కరణ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ కునారిల్లిపోతున్న దశలో ప్రపంచదేశాల ఒత్తిడికి తలవొగ్గి మండేలా విడుదలకు సన్నాహాలు చేసింది.**

అంతర్గతంగా ఆఫ్రికన్ నేషనల్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో సాయుధ స్వాతంత్ర్య పోరాటం ఉధృతం అవుతున్నది. శాంతి కాముకుడైన మండేలా జైలు నుండే ప్రభుత్వంతో చర్చలు మొదలుపెట్టి, జాతి వివక్షకు తావులేని దక్షిణాఫ్రికాలో తెల్లజాతి ప్రజలు అన్ని రకాల హక్కులతో బతికే పరిస్థితులే ఉంటాయి తప్ప వారి పట్ల వివక్షా పూరితంగా ప్రభుత్వం వ్యవహరించదని పదే పదే హామీ ఇచ్చిన తర్వాత స్వేచ్ఛాయుత ఎన్నికలకు ప్రభుత్వం ఒప్పుకుంటుంది. ఎన్నికలకు ముందే మండేలా విడుదల అవుతాడు. అమెరికా సహా ప్రపంచదేశాలన్నీ పర్యటిస్తాడు. ప్రపంచ దేశాలలో ప్రజలు నీరాజనం పడతారు. న్యూయార్క్‌లో 10 లక్షల మందితో జరిగిన ఊరేగింపు అపూర్వమైనది. ఆర్థిక ఆంక్షలు తొలగించరాదని ఆయా దేశాలని కోరతాడు మండేలా. ప్రభుత్వం స్వేచ్ఛాయుత ఎన్నికలు నిర్వహించి మెజారిటీ పొందిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన తర్వాతనే ఆంక్షలు తొలగించాలని కోరుతాడు. ఎన్నికల్లో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ 62 శాతం ఓట్లను గెలుచుకొని కూడా అన్ని పార్టీలతో కూడిన జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాడు మండేలా.




75 ఏండ్ల ముదిమి వయసులో దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా ఐదేళ్లు పదవీ బాధ్యతలు నిర్వహించాడు. దేశానికి కొత్త రాజ్యాంగాన్ని రచించడానికి నాయకత్వం వహించాడు. నల్ల జాతి ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందించడానికి కృషి చేశాడు. పేద ప్రజలకు లక్షల సంఖ్యలో ఇండ్లు కట్టించాడు. ఇంకా చేయవలసిన పనులు చాలా ఉన్నా ఐదేండ్ల తర్వాత రాజకీయాల నుంచి విరమించుకొని దేశ పునర్నిర్మాణ బాధ్యతలు కొత్త తరానికి అందించాడు. ఆ తర్వాత మండేలా ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవలో నిమగ్నం అవుతాడు. దేశంలో పాఠశాలలు, దవాఖానాలు నిర్మించడానికి నిధులు సేకరించి ఫౌండేషన్ ద్వారా వాటి అమలు కోసం కృషి చేశాడు. దేశంలో పెచ్చరిల్లి పోతున్న ఎయిడ్స్ వ్యాధి నిరోధానికి కృషి చేశాడు. చివరిదాకా దేశ ప్రజల సేవలో నిమగ్నమయ్యాడు. 95 ఏండ్ల వయసులో 2013 డిసెంబర్ 5న తనువు చాలించాడు మండేలా.

భారత ప్రభుత్వం కూడా మండేలాకు భారతరత్న పురస్కారాన్ని ప్రధానం చేసింది. ఆయన భారత పర్యటనలో పురస్కారాన్ని గ్రహించి భారత పార్లమెంట్‌లో ప్రసంగిస్తాడు. అయితే మండేలా ఈ అంశాన్ని తన ఆత్మకథలో ప్రస్తావించలేదు. ఎందుకో మరి. దక్షిణాఫ్రికాలో గాంధీ చేసిన అహింసాయుత పోరాటాన్ని మండేలా గుర్తించినా, వాటిపట్ల గౌరవ భావం ఉన్నా తీవ్రమైన హింసకు పాల్పడుతున్న

ప్రభుత్వాన్ని అహింసాయుత పోరాటాల ద్వారా లొంగదీయలేము అని మండేలా నమ్ముతాడు. సాయుధ పోరాటానికే మొగ్గు చూపుతాడు. జవహర్ లాల్ నెహ్రూ పుస్తకాలు చదివి ప్రయభావితుడు అయినాడు. నెహ్రూ రాసిన Glimpses of World History చదివినట్టు ప్రస్తావించినాడు. నెహ్రూలో ఆధునిక, సోషలిస్ట్ భావజాలాన్ని మండేలా ఇష్టపడినట్టు తెలుస్తున్నది.

జైలు జీవితం అతన్ని చాలా మార్పులకు లోను చేస్తుంది. ప్రభుత్వంతో ఏనాడూ రాజీ పడకపోయినా చివరకు చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యం అని నమ్మాడు. తాను నమ్మిన మార్గంలో ప్రభుత్వంతో చర్చలు ప్రారంభించి అంతిమ పరిష్కారానికి చేరుకున్నాడు. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ సభ్యులు తొలుత చర్చలకు సుముఖంగా లేకపోయినా చర్చలకు పరిపక్వమైన పరిస్థితులు ఏర్పడి ఉన్నాయని, ఈ అవకాశాన్ని చేజార నివ్వ వద్దని వారిని ఒప్పించి ప్రభుత్వంతో చర్చలు కొనసాగించి సఫలం అవుతాడు. చర్చలు సఫలం కావడానికి మూడు కారణాలు తోడయ్యాయని నాకనిపించింది.

1. ప్రపంచ దేశాల ఆర్థిక ఆంక్షలు, దౌత్య సంబంధాలు తెగిపోవడంతో దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యింది. అధ్యక్షుడు బోథా ఈ సంక్షోభాన్ని తట్టుకోలేక రాజీనామా చేశాడు. ఈయన స్థానంలో క్లరిక్ అధ్యక్షుడు అవుతాడు.

2. ఉదారవాది అయిన క్లరిక్ జాతి వివక్షా విధానాలకు స్వస్తి పలికాడు. చర్చలకు మార్గం సుగమం చేశాడు.

3. దేశంలో సాయుధ పోరాటం తీవ్రతరం కావడం.

జాత్యాహంకారం, జాతి వివక్ష లేని ఆధునిక దక్షిణాఫ్రికా ఏర్పడడానికి కారకులైన నెల్సన్ మండేలా, ఎఫ్ డబ్ల్యూ క్లరిక్ లు 1993 నోబుల్ శాంతి బహుమతికి ఎంపిక అయినారు.

**పుస్తకం చదివిన తర్వాత మండేలా జీవితం స్ఫూర్తిని పొందుతాము. ఎన్ని కష్టాలు ఎదురైనా జీవితేచ్ఛను కోల్పోకుండా కడదాకా నిలబడిన ఆయన మనోధైర్యం పాఠకుడిలో స్ఫూర్తిని నింపి తీరుతుంది.**

సీతారామరాజు అనువాదం సరళంగా సాఫీగా సాగింది. మండేలా జీవితంలో ముఖ్యమైన ఘట్టాలతో కూడిన ఒక ఫోటో గ్యాలరీ పుస్తకంలో చేరిస్తే బాగుండేదని అనిపించింది. మండేలాతో పనిచేసిన ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ పోరాట యోధులు అలివర్ టాంబో, వాల్టర్ సిసులు, జో స్లోవో, అహ్మద్ కత్రాడా, ఆల్ఫ్రెడ్ జో తదితరుల ఫోటోలు ఎక్కడ కనిపించవు. అవి ఇంగ్లీష్ ఒరిజినల్ పుస్తకంలో లేకపోయినా తెలుగు పుస్తకంలో వేసి ఉంటే పుస్తకానికి వాల్యూ అడిషన్ అయి ఉండేదని నా అభిప్రాయం. చాప్టర్ చివరలో అవసరమైన వివరాలతో నోట్స్ ఇచ్చారు. అయితే వీటిని ఆ ప్రస్తావన వచ్చిన పేజీలోనే పెట్టి ఉంటే పాఠకుడికి సౌకర్యంగా ఉండేది. నంబర్లు కూడా కనబడలేదు. మలి ముద్రణలో ఈ అంశాలు గమనంలోకి తీసుకోవాలని కోరుతున్నా. నాలుగు వందల రూపాయల బైండ్ ఎడిషన్‌తోపాటు పేపర్ బ్యాక్ ఎడిషన్ కూడా తీసుకువస్తే పుస్తకం ధర తగ్గి ఎక్కువ మందికి చేరువ అవుతుంది. ఇది కొని చదవదగ్గ పుస్తకం. ఒకసారి కాదు నిర్వేదంలో కూరుకుపోయిన ప్రతీసారి చదివితే మనిషిలో జీవితేచ్ఛ వెల్లుబుకుతుంది. ఆలస్యంగానైనా ఈ పుస్తకాన్ని వెలువరించిన దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదికకు, అనువదించిన రాపోలు సీతారామరాజు గారికి హృదయపూర్వక అభినదనలు.

చివరి మాట : మండేలా చనిపోయినప్పుడు తెలంగాణ ఉద్యమం చివరి దశలో ఉన్నది. తెలంగాణ విద్యావంతుల వేదిక తరపున రెండు సంస్మరణ సభలు నిర్వహించాం. ఒకటి బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో, రెండవది సికిందరాబాద్ అడ్డగుట్టలో. ఆ సభల్లో మండేలా పోరాట జీవితాన్ని స్మరించుకున్నాము. కొత్త దక్షిణాఫ్రికా ఏర్పడి 20 ఏళ్లు అయినా ఆయన కలలు ఇంకా పూర్తిగా నెరవేరలేదన్న విషయాన్ని విశ్లేషించుకున్నాము. దక్షిణాఫ్రికాలో నల్లజాతి ప్రజల ఉద్దరణకు ఇంకా చాలా చేయవలసి ఉన్నదని ప్రస్తావించుకున్నాము. తెలంగాణ సాధన తర్వాత మనకు ఈ వైఫల్యాలు ఒక పాఠంగా పనికి వస్తాయని విశ్లేషించుకున్నాము. **"పర్వత శిఖరం చేరుకున్నాకే తెలుస్తుంది .. అధిరోహించాల్సిన పర్వతాలు మరెన్నో ఉన్నాయని"** అన్న మండేలా మాటలు మనం అందరం గుర్తుంచుకోవలసిన అవసరం ఉన్నది. ❑

# యుద్ధం : ఎస్ఆర్ పృథ్వీ పద్యకావ్యం

**(32వ పేజీ తరువాయి)**

అదే పృథ్వి గారి ఆశయం. ఇదొక గొప్ప సందేశం. అందుకే పృథ్వి గారంటారు.

శాంతి యిచ్చును మనసుకు చల్లదనము
ప్రజలు జీవించు యనురక్తి భరితముగను
లోటు లెఱుగని దేశమ్ము లుదయమంద
స్వర్గతలమగును ధరణి శాశ్వతముగ

ఈ సందేశాన్ని అందరూ పాటించాలి. మనుషుల మధ్య మనసు లేకమై సహోదరత్వం పెంపొందాలి. సమ సమానత్వం మన లక్ష్యం కావాలి. అందుకు ఈ చిరుపొత్తం సహాయకారి కాగలిగితే పృథ్విగారి ప్రయత్నం ధన్యమైనట్టే కదా! అదే మనందరి కోరిక. శుభం. ❑

# భారతీయ జర్నలిజం ధృవతార మానికొండ చలపతిరావు

- కొమ్మాలపాటి శరచ్చంద్ర జ్యోతిశ్రీ

**పత్రికా స్వేచ్ఛ మేడిపండుగా మారిన కాలమిది. జర్నలిజం విలువలు అగ్నిపరీక్షను ఎదుర్కొంటున్న తరుణమిది. సమస్త విలువల్ని ధ్వంసం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న వర్తమాన వ్యవస్థ జర్నలిస్టులపై నైతిక, భౌతిక దాడులకు తెగబడుతున్న నేపథ్యమిది. జర్నలిజం విలువలకు నిబద్ధులై నిలబడే జర్నలిస్టులు. అలాంటి పత్రికా యాజమాన్యాలు ఆత్మ స్థైర్యాన్ని కూడగట్టుకోవాల్సిన కాలమిది. సరిగ్గా ఈ సమయం లోనే వచ్చింది 'భారతీయ జర్నలిజం ధృవతార మానికొండ చలపతిరావు' పుస్తకం. నాలుగు దశాబ్దాల కిందట భౌతికంగా జీవనయాత్ర చాలించి వెళ్లిపోయిన గొప్ప జర్నలిస్ట్ మానికొండ చలపతిరావు(ఎంసి)కీ ప్రస్తుతానికి ఏమిటి సంబంధం?**

### వృత్తిపట్ల నిబద్ధతకు శిఖరస్థాయి

భారతీయ జర్నలిజం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఈ వేళ ఎంసీ భావజాలం, వారి అనుభవసారం మనకు ఏ మాత్రమైనా మార్గదర్శనం చేయించకపోదు అనే ఆశతో సంపాదకులు అమరయ్య ఈ కష్టతరమైన పనిని నెత్తికెత్తుకున్నట్టు అనిపిస్తుంది. ఈ పుస్తకంలో మొత్తం 30 వ్యాసాలు ఉన్నాయి. అందులో కొన్ని ఎంసీ రాసినవి. మరికొన్ని ఎంసీ గురించి ఇతరులు రాసినవి. నెహ్రూతో నా తొలి పరిచయం, వినోబాదీక్ష - గాంధీ 'హరిజన్' మూత, వార్త పుట్టని చోటేదీ.. జర్నలిస్టులు తమ సోర్స్ చెప్పాలా వద్దా.. ప్రత్యేక హక్కుల పేరిట పత్రికా స్వేచ్ఛను హరిస్తారా? పత్రికా స్వేచ్ఛంటే యజమాని స్వేచ్ఛ కాదు.. సామాజిక మార్పే పత్రికల ప్రధాన ధ్యేయం కావాలి.. వంటి ఏడు వ్యాసాలు ఎంసీ రాసినవి (ఉపన్యసించినవి). మిగతావి ఎంసీ గురించి ప్రసిద్ధ జర్నలిస్టులు, ఇతరులు రాసినవి. ఇలా సేకరించి కూర్చిన వ్యాసాలు ఎంసీ వ్యక్తిత్వాన్ని, వృత్తి పట్ల నిబద్ధతను, నెహ్రూ-ఎంసీ మధ్య సాన్నిహిత్యం సంఘర్షణలను, జర్నలిస్టుగా ఎంసీ ప్రతిభా పాటవాల్ని అదే సందర్భంలో సమకాలీన సామాజిక రాజకీయ పరిస్థితుల్ని మనకు రేఖామాత్రంగా పరిచయం చేస్తాయి.

### నేషనల్ హెరాల్డ్ సంపాదకుడిగా..

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన పత్రిక నేషనల్ హెరాల్డ్. ఆ పత్రికకు మూడు దశాబ్దాలకు పైగా సంపాదకునిగా పనిచేశారు ఎం.సి. ఆంగ్ల జర్నలిజంలో జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని అందుకున్నారు. 1936లో జర్నలిస్ట్ వృత్తిలో ప్రవేశించారు. సంపాదకుడు కుందూరు ఈశ్వరదత్ పత్రిక 'పీపుల్స్ వాయిస్'లో అసిస్టెంట్ ఎడిటర్ కమ్ లీడర్-రైటర్ చలపతిరావు తొలిసారి జర్నలిస్ట్ ఉద్యోగంలో ప్రవేశించారు. ఆ పత్రిక స్థాపకులు పిఠాపురం మహారాజా. పీపుల్స్ వాయిస్ 1937 ఈ పత్రిక ఆగిపోయింది. అలహాబాద్ (నాడు ప్రయాగ)లో 'ది వీక్ ఎండ్' పత్రికను చలపతిరావు కోసం ఈశ్వరదత్ స్థాపించారు. అదీ ఎక్కువకాలం మనజాలలేదు. త్రివేణి పత్రికకూ మానికొండ వ్యాసాలు రాసేవారు. మహాత్మా గాంధీ కుమారుడు దేవదాస్ గాంధీ సంపాదకత్వంలో నడుస్తున్న హిందుస్థాన్ టైమ్స్ పత్రికలో అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. అందులో 'మాగ్నస్' పేరుతో 'ఆఫ్ ది రికార్డ్" అనే వీక్లీ కాలమ్ రాశారు చలపతిరావు. ఆ వ్యాసాలు నెహ్రూ దృష్టిని ఆకర్షించాయి. 1938లో నేషనల్ హెరాల్డ్ పత్రికను కోటంరాజు రామారావు సంపాదకుడిగా స్థాపించారు. అందులో చలపతిరావు అసిస్టెంట్ ఎడిటర్ కమ్ లీడ్-రైటర్‌గా చేరారు. ప్రభుత్వ ఆంక్షల కారణంగా గాంధీజీ పిలుపు మేరకు 1942లో నేషనల్ హెరాల్డ్ పత్రిక స్వచ్ఛందంగా మూతబడింది. ఈ




**భారతీయ జర్నలిజం ధృవతార మానికొండ చలపతిరావు**

**రచయిత : అమరయ్య ఆకుల**

**93479 21291**

**పేజీలు : 220 ధర: రూ.225**

**ప్రచురణ : శ్రీ మిరియాల వెంకట్రావు బెనోవలెంట్ ఫౌండేషన్**

**ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక షాపుల్లో లభ్యం**

కాలంలో చలపతిరావు రహస్యంగా పత్రికలను నడిపారు. 1945 నవంబరులో తిరిగి నేషనల్ హెరాల్డ్ పత్రిక ప్రారంభం అయింది. అందులో జాయింట్ ఎడిటర్‌గా చేరారు. 1946 జూలై 1న నేషనల్ హెరాల్డ్ పత్రిక సంపాదకుడిగా బాధ్యతలు చేపట్టి 1978 వరకు 32 ఏళ్లపాటు ఆ బాధ్యతలో పనిచేశారు.

**శ్రీకాకుళం నుంచి ఢిల్లీ దాకా..**


భారతదేశంలో సోషలిజాన్ని నిర్మించాలని నేషనల్ హెరాల్డ్ యజమాని నెహ్రూతోనే వాదించిన సామ్యవాది ఎంసీ. ఏ రాజకీయ పార్టీలోనూ సభ్యులు కాదు. ఒక తెలుగు బిడ్డడు. నీతికి, నిజాయితీకి, నిబద్ధతకు, నిమగ్నతకు నిలువెత్తు నిదర్శనం. 'ఎంసి'గా నాటి పాత్రికేయ ప్రపంచానికి సుపరిచితుడు మానికొండ చలపతిరావు. శ్రీకాకుళం జిల్లాలోని మారుమూల ప్రాంతానికి చెందిన అంబఖండి అనే కుగ్రామానికి చెందిన వారు. 1908లోనో 1910లోనో విశాఖపట్నంలో పుట్టారు. మద్రాసులో చదివి, న్యాయవాద వృత్తితో సంతృప్తి చెందక దానిని వదిలేసి అలహాబాదు, లక్నో, ఢిల్లీలో పత్రికారంగంలో దాదాపు అర్ధ శతాబ్ది కాలం పనిచేశారు. 1950లో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (IFWJ) స్థాపనలో కీలక పాత్ర పోషించారు. దానికి 1950-55 అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. 1968లో తనను వరించి వచ్చిన పద్మభూషణ్ పురస్కారాన్ని తిరిగి ఇచ్చివేశారు.

**అతి గొప్ప సంపాదకులు**


"ఎం.చలపతిరావు భారతదేశంలో పుట్టిన గొప్ప సంపాదకులలో ఒకరు. మన మాతృభూమిపై పుట్టిన గొప్ప వారిలో ఒకరు. వృత్తిలో సమగ్రత, ఆచరణలో చురుకుదనం ఆయన సొంతం. కత్తి మొనకున్నంత పదును ఆయన వాక్యంలో ఉంటుంది. మరెవ్వరూ ఊహించలేనంత అత్యున్నత ప్రమాణాలకు ఆయన పెట్టింది పేరు. అటువంటి జర్నలిస్టును మునుముందు చూడడం కష్టమేమో" అంటారు నేషనల్ హెరాల్డ్ ఎం.డి., పురుషోత్తం దాస్ టాండన్(చెదిరిన గుండెలపై చెరగని ముద్రలో పుట 66)

**ఎంసీ కృషితోటే జర్నలిస్టుల వేతన భద్రత**

**జర్నలిస్టులకు ఈవేళ ఈ మాత్రమైనా వేతన భద్రత ఉందంటే అది ఖచ్చితంగా ఎంసీ నడుంకట్టి చేసిన ఉద్యమ ఫలితమే. తొలి ప్రెస్ కమిషన్, ప్రెస్ కౌన్సిల్ ఏర్పాటైనా, పాత్రికేయులకు తొలి వేజ్ బోర్డు వచ్చిందన్నా ఎంసీ కృషే కారణం. ఈ విషయం ఈ వేళ చాలా మంది జర్నలిస్టులకు తెలియకపోవచ్చు. కాని అది నిజం. ఎడిటర్లుగా ఉన్న పుణ్యానికే రాజ్యసభ సీటో, రాజ సౌధమో, పొలమో, స్థలమో అడుగుతున్న కాలంలో ఈ 'పిచ్చి మనిషి' తనకు ఢిల్లీ చాణక్యపురిలో వచ్చిన స్థలాన్ని కాదంటాడు. పైసలిచ్చినా, పైరవీలు చేసైనా ఏదో ఒక పద్మ అవార్డు వస్తే చాలనుకునే రోజుల్లో పద్మభూషణ్ అవార్డును తిరుగు టపాలో రాష్ట్రపతి భవన్‌కు పంపుతారు." అని ముందుమాటలో సీనియర్ జర్నలిస్టు, ఈ పుస్తక సంపాదకుడు అమరయ్య చెప్పటంలో ఈ పుస్తకాన్ని తీసుకురావడంలోని ఔచిత్యం బోధపడుతుంది.** ❑




**మానికొండ చలపతిరావు రచించిన పుస్తకాలు**



# ఉద్యమాల శిఖరం ఉద్దరాజు రామం



- సమీక్షకులు: సన్నిధానం నరసింహశర్మ

**ఆయన భోగాల నాయకుడు కాదు. త్యాగాల నాయకుడు. తననెప్పుడూ నాయకునిగా కాక కేవల సామాన్య కార్యకర్తగానే భావించుకున్న నిరాడంబరుడు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం వాలమర్రులో పుట్టి ఢిల్లీకి సైతం ఎదిగి వెళ్లిననాయకుడు, స్వాతంత్ర్యయోధుడు. సోషలిస్టు, కాంగ్రెసు వాది. ఆయన సంపూర్ణంగా నమ్మినదీ, నిలబడినదీ నిక్కచ్చి అయిన కమ్యూనిస్టు భావజాలంలోనే, రైతుఉద్యమాలలో, భూస్వాములతో పోరాటాలలో ఆయన క్రియాశీలక పాత్ర వహించారు. ఆయనే కీర్తిశేషులు ఉద్దరాజు రామం. ఇప్పుడు అభివర్ణించిన నాలుగు ముక్కల్లో లెక్కలేనన్ని సంఘటనలు వున్నాయి. సమరశీల కార్యక్రమాలున్నాయి. ఇన్ని ఉండీ ఆయన జీవిత దర్పణంగా భాసించే గ్రంథం అంటూ ఒకటి రాకపోవడం ఒక కొరతే. ఆ కొరతను చరిత్ర అవసరాన్ని తీర్చిన సామాజిక ప్రయోజనకర గ్రంథమిది.**

ప్రజాశక్తి దినపత్రిక విశ్రాంత ఉద్యోగులు దండమూడి భానుప్రసాద్, రామకృష్ణల శ్రమైక సేకరణా స్వేదబిందువులు సంపాదకత్వ ఫలం ఈ గ్రంథం. చెదురుమదురుగా ఉన్న సంబంధిత సమాచారాన్ని, స్మారక సంచికల్ని పరిశీలించి, సమకాలీన స్వాతంత్ర్య యోధుల గ్రంథాల్లోని ఉటంకింపుల్ని గ్రహించి రామం కుటుంబసభ్యుల అనుభవ, జ్ఞాపక అనుబంధాల్ని సమీకరించుకుని మరీ సంధానపరిచారీ గ్రంథాన్ని, ఈ గ్రంథంలో 28 మంది రచయితల రచనలున్నాయి. రాసిన వారిలో బి.వి. రాఘవులు, మోటూరు హనుమంతరావు, అల్లూరు సత్య నారాయణరావు, కంభంపాటి సత్యనారాయణ, మూర్తిరాజు, గాదిరాజు వంటి సుప్రసిద్ధులున్నారు. కమ్యూనిస్టులు ఆలోచనాపరులు, చరిత్ర పరిశోధకులు, వివిధ రంగాల విశ్లేషకులూ రాసిన ఇందులోని రచనలు రామం సామాజిక, వైయక్తిక, ఉద్యమ కార్యక్రమాల ఆత్మ ప్రతిబింబాలుగా ఉన్నాయి. వేరువేరు కోణాల్లో రచనలుండడం చేత ఒక సంపూర్ణత్వానికి ఒక సమగ్రతకు దోహదమయింది. రామం జీవన వ్యాపకాలతో బాటు తమతమ జ్ఞాపకాల్ని పొందుపరచిన రచయితలు అభినందనీయులు. కమ్యూనిజం వ్యాప్తి స్ఫూర్తికి ఇటువంటి గ్రంథాలు అవసరమై ఉన్నాయి. దొరతనాలలో బౌద్ధం లేదని బౌద్ధ భావజాలం కొరగానిదనగలమా? కమ్యూనిజం కూడా అటువంటిదే. సమ సమాజ స్వప్నాలు కలిగిన ఆధునిక భావజాల శాస్త్రంగా (సైన్సుగా) ఉదరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ దాని భూమికలు ఎప్పుడూ బలంగానే ఉంటాయి. చర్చిలు అంతటివాడు ఒక సందర్భంలో "నీవు అభివృద్ధి నిరోధకత్వాన్ని కోరుకుంటావా? కమ్యూనిజాన్ని ఎన్నుకొంటావా? అంటే చర్చిలు 'నేను ఈ విషయంలో నటించలేను. కమ్యూనిజాన్నే కోరుకుంటానన్నాడు.





**సంపాదకులు : యు.రామకృష్ణ, దండమూడి భానుప్రసాద్,**

**240 పుటలు, వెల: రూ.250/-**

**ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌస్, 27-1-54, కారల్ మార్క్స్ రోడ్, గవర్నరుపేట, విజయవాడ - 2, ఫోన్: 0866-2577533.**

కమ్యూనిజంమంటే సారాన్ని ఒక్క వాక్యంలో చెప్పమంటే ప్రయివేటు ఆస్తుల్ని రద్దు చేయడమన్నాడు. ఇటువంటి భావజాలాన్ని విశ్వసించిన కార్యక్రమాల్లో ప్రచారం చేసిన ఉద్దరాజు రామం చరిత్ర చదివితే ఎటువంటి స్ఫూర్తి కలుగుతుందో మనం గ్రహించవచ్చు. స్వాతంత్ర్య సమర చరిత్రలో గాంధీ పాత్ర ఒక అసాధారణ పాత్ర. దానిని కాదనలేం. కానీ సుభాష్ చంద్రబోసు విషయంలో అల్లూరి సీతారామరాజు విషయంలో మరికొన్ని అంశాల్లోనూ ఆయన ఉదాత్తంగా వ్యవహరించలేకపోయారు. దానికి చారిత్రక సాక్ష్యాలున్నాయి.

**(మిగతా 42వ పేజీలో)**

# డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి
# తొలి కథ : మలుపు



- కె.వి.యస్.వర్మ

వైద్య వృత్తిలో గైనకాలజీ డాక్టర్‌గా తలమునకలై వుంటూ, తన సాహిత్య ప్రవృత్తికి ప్రాణం పోసుకుంటూ ఎడతెరిపి లేకుండా కథలు, నవలలు, కాలమ్‌లు రాయడమే కాకుండా, ఆరోగ్యానికి సంబంధించిన రచనలు కూడా చేసిన ప్రముఖ రచయిత్రి డా. ఆలూరి విజయలక్ష్మి. మానవ సంబంధాలకు పెద్దపీట వేస్తూ, ప్రగతి శీలక దృక్పథంతో సామాజిక సమస్యలకు తనదైన పరిష్కారం చూపిస్తోన్న ఆమె మొదటి కథ 'మలుపు'. 'కాలాతీత వ్యక్తులు ' నవలా రచయిత్రి డాక్టర్ పి. శ్రీదేవిలాగే వైద్యం నేపథ్యంలో విజయలక్ష్మి కూడా ఎక్కువ కథలు రాశారు. తన తొలి కథ 'మలుపు'ను కూడా మెడికల్ కాలేజీ చదువు నేపథ్యంలోనే రాశారామె. ఇది ప్రేమ కథే. ఇందులో డాక్టర్ ఉమాదేవి, మెడికల్ విద్యార్థులు రాధిక, జయ, రమేష్, ఉమ, ఆమె మేనబావ శ్రీధర్, బిటెక్ స్టూడెంట్స్ రవి, మధుసూదన్, ...పాత్రలతో కథ నడుస్తుంది. మలుపు కథను అనేక మలుపులతో పెద్దగా, దాదాపు ఒక నవలికకుండే ఇతివృత్తంతో రాశారు. ఈ కథను జి.విజయలక్ష్మి పేరుతో రాశారు (అప్పటికింకా పెళ్లి కాలేదు).



డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి

“కన్సల్టింగ్ రూములో కూర్చుని వున్న డాక్టర్ ఉమాదేవి అప్పుడే టాక్సీ నుంచి దిగిన రాధిక చిన్నబోయిన ముఖం చూడగానే కలత చెందింది. సిస్టర్‌తో రోగికి సైక్లోపెన్ ఇంజక్షన్ చేయమని చెప్పి, మేడపైకి వెళ్లింది. మంచం మీద పడుకుని వుంది రాధిక. “రాధీ” పిలుపులో వాత్సల్యం, జాలి, అనురాగం మిళితమై ఉన్నాయి.” అని కథ మొదలవుతుంది. “అలా వున్నావేంటి? ఏమయ్యింది” అని ఉమాదేవి అడుగు తుంది. రాధిక 'అమ్మా. నీ దగ్గర ఏ విషయం నేను దాయలేదు” అంటూ తనకొచ్చిన సమస్య గురించి వివరంగా చెబుతుంది.

రమేష్ హౌస్‌సర్జన్‌గా పని చేస్తున్నాడు. అతను సరదాగా కబుర్లు చెబుతుంటాడు. రాధిక అతను చెప్పే కబుర్లను ఆసక్తిగా వింటూ చనువుగా వుంటుంది. మనిషి బావుంటాడు. ఒకనాడు 'రాధికా, నిన్ను ప్రేమిస్తున్నాను. నీకిష్టమైతే పెళ్లి చేసుకుందాం' అంటాడు. ఆ మాటకు రాధిక ఆశ్చర్యపోతుంది. 'పెళ్లా? సారీ రమేష్. నాకా ఉద్దేశం లేదు' అంటుంది. “అయితే, ఇన్నాళ్లూ నాతో నటించావా?' అంటాడు బాధపడుతూ. 'మీతో స్నేహితురాలిగా మెలిగాను. అంతకుమించి ఆలోచించలేదు. మీరలా భావించి వుంటే అందుకు నేను బాధ్యురాలిని కాను' అంటుంది. బయలుదేరుతూ రాధిక, తెల్లబోయిన అతని ముఖం చూడగానే చలించిపోతుంది. అయినా, మనసు ఉగ్గబెట్టుకుని, హాస్టల్‌కు వెళ్లిపోతుంది.

కానీ, రమేష్ గురించే ఆలోచిస్తుంది. అతను మంచివాడు. తమ కులమే. అతన్ని కాదనడానికి కారణం కనిపించడం లేదు. కానీ, ఎం.డి. చేసి, పై చదువులకు విదేశాలకు వెళ్లాలని తన కోరిక. ఇప్పుడు పెళ్లి చేసుకుంటే తన కల కల్లలవుతుంది. అతని కోసం తను ఇంతటి త్యాగం ఎందుకు చేయాలి?

రాధిక తన మనసులోని భావాలను తల్లికి వివరంగా చెబుతుంది. ఉమాదేవి ఏమీ మాట్లాడకుండా తన గదిలోకి వెళ్లిపోతుంది. రాధికకు ఎంతకీ నిద్ర పట్టలేదు. ఎప్పటికో నిద్రలోకి జారి, తెల్లారేక లేచి, బల్ల మీద వున్న కాగితాలను చూసి, చదవడం మొదలెడుతుంది. “రాధీ ! నేనిల్లానుంచి ఏదైతే ప్రాణ ప్రదంగా దాచుకుంటూ వస్తున్నానో, ఆ రహస్యాన్ని ఈ సమయంలో చెప్పక తప్పదు” అంటూ ఆమె తన కూతురి ముందు తన జీవితాన్ని వుంచుతుంది.

ఉమాదేవి ఎంబిబియస్ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు ఆంధ్రా యూనివర్సిటీలో ఓ ప్రదర్శన జరిగింది. సాంకేతిక శాఖ దగ్గర ఓ అందమైన యువకుడు చెబుతున్నది వినకుండా అతన్నే చూస్తూ వుండిపోయింది. అది గమనించిన ఆమె స్నేహితురాలు జయ మోచేత్తో పొడిచేసరికి సిగ్గుపడిపోతుంది.

'దిసీజ్ ఎ మెథడ్ ఆఫ్ బోరింగ్' అంటాడతను. వెంటనే ఉమ 'సీ, హియరీజ్ ఎ మెథడ్ ఆఫ్ బోరింగ్' అంటుంది సరదాగా ఏడిపించాలని. దాంతో ఆమె ఫ్రండ్స్ కూడా ఒక్కసారిగా అదే మాటంటారు. అప్పుడా స్వయం సేవకుడి ముఖం సిగ్గుతో కందగడ్డలా అయిపోతుంది. తర్వాత ఒకనాడు యూనివర్సిటీ లేడీస్ హాస్టల్ ఎదురుగా అందరూ వుండగా గబుక్కున ఆ

స్వయం సేవకుడు వచ్చి, ఉమ చేతులు పట్టుకుని ఆమె కళ్లల్లోకి చూస్తూ నిలబడిపోతాడు. అప్పుడు ఉమ కంపించిపోతుంది. ఆ సమయంలో ఎటు చూసినా విద్యార్థులు. ఉపాధ్యాయులు చాలా మంది వున్నారు. 'ఓకే రవీ, ఎక్సలెంట్' అంటాడు ఒకతను కెమేరా సర్దుకుంటూ. తన్మయత్వంతో ఏదో లోకంలో తేలిపోతోంది చూడరా' అని ఆమె సీనియర్స్ హేళనగా నవ్వుతారు. ఎంత సన్నిహితత్వం లేకపోతే అతనంత చనువు తీసుకుంటాడు' అని అందరూ అనుకుంటారు. ఉమ బాధపడిపోతుంది. తను సరదాగా ఏడిపించిన రోజు అతనెంత బాధపడివుంటాడో ఆమెకు అర్థమవుతుంది.

ఓ పది రోజులకు ఉమకో ఉత్తరం వస్తుంది. 'మిమ్మల్ని ఎలా క్షమాపణలడగాలో తెలియడం లేదు. ప్రతీకారం తీర్చుకోమని నా ఫ్రండ్స్ నన్ను పురిగొల్పారు. దాంతో అలా చేశాను. అందుకు చాలా బాధపడుతున్నాను. నా కారణంగా మీకు వచ్చిన కళంకం ఏ పరిణామాలకు దారితీస్తుందో.. నన్ను క్షమించండి' – రవి అని అతను రాస్తాడు. ఆ రోజుల్లో ఓ అబ్బాయి ఓ అమ్మాయి చేతులు పట్టుకుని కళ్లల్లోకి చూడడం చాలా అపార్థాలకు దారి తీసేదని అనుకోవాలి. రవి స్నేహితుడు మధుసూదన్ కూడా మరో ఉత్తరం రాస్తాడు. రవి ఉమ చేతులు పట్టుకుని కళ్లల్లోకి చూస్తున్న ఫొటో పంపిస్తూ ఆ రోజు రవి అలా చేయడానికి తామే కారణమనీ, అతను చాలా బాధపడుతు న్నాడని, మిమ్మల్ని ఓ దేవతగా ఆరాధిస్తున్నాడనీ, అతన్ని క్షమించమని మా మిత్రులందరి తరఫునా కోరుతున్నాననీ రాస్తాడు. ఆ ఫొటోలోని అతని అందమైన ముఖాన్ని చూస్తూ ఉమ చాలాసేపు అలానే వుండిపోతుంది. అంతలో తోటి విద్యార్థుల నవ్వులు వినగానే ఆమెకు కోపం వచ్చి, ఆ ఫొటోను చింపేస్తుంది. తన ఊరు వెళ్లి వచ్చాక ఒకనాడు జయతో కలిసి వెంకటేశ్వరాలయానికి వెళ్తుంది. 'సారీ ఉమా' అని రవి గుడి మెట్లు దిగి గబగబా వెళ్లిపోతాడు. అతని కళ్లల్లో నీళ్లు చూడగానే ఉమకు జాలివేస్తుంది. మరి కొన్నాళ్లకి మిమ్మల్ని ప్రేమిస్తున్నా ననీ, మీరూ ప్రేమిస్తే తన జన్మ ధన్యమవుతుందనీ చాలా పెద్ద ఉత్తరం రాస్తాడు రవి. అతని దీనమైన ముఖం ఆమె కళ్లల్లో కదులుతుంది. కానీ, తననింతటి వేదనలో పడేసిన అతన్ని ప్రేమించడమా? అనుకుంటూ ఆమె మనసు ఎదురుతిరుగుతుంది. మరికొన్ని రోజులకు మధుసూదన్ మరో ఉత్తరం రాస్తాడు. 'మేడమ్, మీరు క్షమించలేనంతటి తప్పు రవి చేయ లేదనీ, మీ ప్రేమ కోసం తపిస్తున్నాడనీ, నా ప్రాణానికి ప్రాణమైన మిత్రుడు రవి మృత్యుముఖంలో వున్నాడనీ, మీ ప్రేమపూర్వక ఉత్తరం కోసం ఇన్నాళ్లూ ఎదురుచూసిన రవి టైఫాయిడ్ వచ్చి, మీ తిరస్కారం సంధిలోకి దింపిందనీ రాస్తాడు.

"ఒక వ్యక్తి మనల్ని ఇంతగా ఇష్టపడడమంతటి అదృష్టం మరొకటి వుండదు. ఆ అదృష్టాన్ని మీరు గుర్తించలేక

# రచయిత పరిచయం

- మలుపు కథ ఆంధ్రప్రభ వారపత్రిక 1962 అక్టోబరు 31 సంచికలో అచ్చయింది.. విజయలక్ష్మి 1944 అక్టోబరు 1న కృష్ణా జిల్లా గన్నవరం తాలూకా అత్కూరులో పుట్టారు. అంటే 18 ఏళ్ల వయసులో తన మొదటి కథ రాశారు. మలుపు కథకు ఆంధ్రప్రభ దీపావళి కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి వచ్చింది.
- అప్పట్లో పేజీల నిడివిపై ఆంక్షలు లేకపోవడంతో పెద్ద కథే అచ్చయింది. ఒక నవలికకుండే ఇతివృత్తాన్ని కథలో ఇమిడ్చారు. ఈ కథలోని కొన్ని భావాలను అప్పటి ఆమె ఆలోచనాసరళిగా సరిపెట్టుకోవాలి.
- తర్వాతి కాలంలో విజయలక్ష్మి గైనకాలజీ డాక్టర్‌గా పేరు తెచ్చుకుంటూనే అభ్యుదయ రచయిత్రిగా రాసిన 150 కథలు 8 సంపుటాలుగా వచ్చాయి. (మీరు ప్రేమించలేరు, మాకీ భర్త వద్దు, పేషెంట్ చెప్పే కథలు, అగ్ని కిరణం, జ్వలిత, తాజాగా అంతర్ముఖం). 2 నవలలు సజీవ స్వప్నాలు, చైతన్యదీపాలు, 2 నవలికలు ప్రత్యూష పవనం, వెలుతురు పువ్వులు వెలువరించారు. అంతేకాకుండా డాక్టర్‌గా ఆరోగ్యానికి సంబంధించి 5 హెల్త్ ఎడ్యుకేషన్ పుస్తకాలు (మాతృత్వం, మన దేహం కథ, కౌమార బాలికల ఆరోగ్యం, కౌమార బాలల ఆరోగ్యం), 7 అనువాద పుస్తకాలు (వైద్యుడు లేని చోట, మనకు డాక్టర్ లేని చోట, మానసిక వైద్యుడు లేని చోట, రక్తం కథ, యోగాతో నడుము నొప్పి నివారణ, తుంప మరియు పిచ్చుకలు, వెలువడ్డాయి. తాబేలు మళ్లీ గెలిచింది నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ ప్రచురణ) రాశారు.
- తన రచనల్లో సందేశానికి ప్రాధాన్యం ఇవ్వడంతో అక్కడక్కడ కొద్దిపాటి ఉపన్యాస ధోరణి కనిపిస్తుంది. మహిళల పురోగతిని కోరుతూ వారికి అండగా నిలవడం చెప్పుకోతగ్గ విషయం. 'నేను, తంబు, కె.వివేకానందమూర్తి మెడికోలం. విశాఖ రచయితల సంఘంలో సభ్యులం' అని చెప్పారామె.
- కవి సంధ్య సాహితీ పురస్కారం, దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డు, బోయి భీమన్న సాహితీ పురస్కారం, అమృత లత జీవన సాఫల్య పురస్కారం మొదలైన అవార్డులు విజయలక్ష్మిని వరించాయి. ఇప్పటికీ రచనా వ్యాసంగం కొనసాగిస్తున్నారు.

పోతున్నారు. ప్రేమించలేకపోతే పోనీ, ఒక వ్యక్తిని బ్రతికించ డానికి మీరు త్యాగం చేయలేరా?. వెంటనే రండి ఉమాదేవి. రవి చావు బ్రతుకులు మీ చేతుల్లో వున్నాయి" అంటూ ప్రాధేయ పడతాడు. ఉమాదేవి ఇక మౌనంగా వుండలేకపోయింది. విజిటర్స్ హాల్లో వున్న మధుసూదన్ వెంట ఆస్పత్రికి బయలుదేరింది. స్మారకం లేకుండా వుండిన అతన్ని చూడగానే 'అంతవరకూ అణచుకున్న రవిమీది ప్రేమతో "రవీ రవీ" అంటూ ప్రాణాలన్నీ కూడగట్టుకుని ఉమాదేవి పిలుస్తుంది. అతని తలను ఒళ్లోకి తీసుకుని, చెవి దగ్గర నోరు పెట్టి గట్టిగా పిలవడంతో రవి కళ్లు తెరచి, ఆనందంగా చూసి రెండు మాటలు మాట్లాడుతూ ప్రాణాలు వదులుతాడు.

కాలేజీలో ఈ వ్యవహారమంతా తెలిసి, ఎవరకు తోచింది వారు హేళనగా మాట్లాడతారు. ఉమ వేటినీ పట్టించుకోదు. ఒకనాడు ఆమె ఎనాటమీ విభాగంలో ఓ చెయ్యిని పరిశోధన కోసం కోయవలసి వస్తుంది. అరచేతిని కోస్తుంటే, 'అది రవి చెయ్యే కదూ. చనిపోయే ముందు తన దేహాన్ని పరిశోధన కోసం ఇచ్చాడట.' అని పక్క విద్యార్థులు అన్నమాట వినగానే, 'ఏ చేతిని పట్టుకుని నడవాలనుకుందో అదే చేతిని చిన్న పటకారు, చాకులతో కోయాల్సివచ్చిందే' అని అనుకోగానే దు:ఖం ఆగదు. చేతుల్లోని ఆ చిరు పరికాలు కింద పడిపో తాయి. ఆమెకూడా కుప్పకూలిపోతుంది. స్పృహ కోల్పోతుంది. (అప్పర్ లింబ్ డిసెక్టు, ఇన్సిషన్ వంటి ఇంగ్లీషు మాటలు వాడారు రచయిత్రి). ఈ విషయాలు రాస్తూ, అదే రోజున మా బావ శ్రీధర్ అమెరికా నుంచి వస్తున్నట్టు లెటరు రాశాడు మా నాన్న రాధీ, నా జీవితంలో అదో మలుపు అంటుంది.

మద్రాసులో లా చదివిన ఉమ తండ్రి శుద్ధ శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చినా, కందుకూరి వీరేశలింగం వంటివారి స్ఫూర్తితో ఓ కడజాతి పంచమురాలిని వివాహం చేసుకున్నాడనీ, ఇద్దరూ చాలాకాలం వరకూ సర్దుకోలేకపోయా రనీ తెలుపుతుంది. వారి కులాంతర, మతాంతర వివాహాన్ని ఉమ తాతగారు ఆమోదించరు. లోకులూ విమర్శిస్తారు. దాంతో దూరంగా కలకత్తాకు మకాం మారుస్తాడు తండ్రి. అక్కడికెళ్లిన కొన్నాళ్లకు తల్లి మారుతుంది.తననూ తండ్రినీ, ప్రేమగా చూస్తుంది. లాయర్‌గా తండ్రి ప్రాక్టీసు బావుంటుంది. ఉమకు ఎనిమి దేళ్లప్పుడు ఒకనాడు తండ్రి ఒక కుర్రాడిని తీసుకొచ్చి ఇతను నీకు బావ అవుతాడు అని చెబుతాడు. దీనికీ ఓ కథ వుంటుంది.

ఉమ తండ్రికి ఒకామె పరిచయమవగానే తనకో చెల్లెలు దొరికిందనుకుంటాడు. (ఆమె కమ్మవారి అమ్మాయి. వాళ్లల్లో కట్నాల పట్టింపు ఎక్కువ అనీ రచయిత్రి అంటారు). ఆమెకో కొడుకుంటాడు. భర్త ఆమెను విడిచిపెట్టి బాగా కట్నం ఇచ్చిన ఇంకో అమ్మాయిన పెళ్లి చేసుకుంటాడు. ఏదో చిన్న ఉద్యోగం చేస్తూ ఒంటరిగా కొడుకును చదివిస్తున్న ఆమెను పై అధికారి అయిన ఓ ఆంగ్ల దొర అనుభవించబోతే, ఆమె చాకుతో పొడు చుకుని చనిపోతుంది. ఆమె కొడుకు శ్రీధర్‌ను ఉమ తండ్రి చేర దీసి, బాగా చదివిస్తాడు. ఎవరూ లేని అతన్ని ఉమ అభిమా నంగా చూస్తుంది. శ్రీధర్ ఎంబిబియస్ పూర్తి చేసి అమెరికా వెళ్లడానికి తండ్రి అన్ని విధాలా ప్రోత్సహిస్తాడు. అతనితో ఉమ పెళ్లి నిశ్చయం చేస్తాడు తండ్రి. మనసులో రవిని ప్రేమిస్తూ బావను పెళ్లాడడానికి ఆమె సంశయిస్తుంది. అంతేకాదు, అది వ్యభిచారంలాంటిదనీ అనుకుంటుంది. శ్రీధర్‌తో తన విష యాలన్నీ చెప్పి, నిన్ను పెళ్లాడలేనంటుంది. 'అతన్ని మరచిపో డానికి కొంతకాలం పట్టొచ్చు. అంతవరకూ వేచి వుంటానం' టాడు శ్రీధర్. తర్వాత, 'నిన్ను పెళ్లి చేసుకుంటాను బావా. లేకుంటే మా అమ్మానాన్నలు బాధపడతారంటుంది ఉమ. కేవలం తల్లిదండ్రుల కోసం తనను ఉమ పెళ్లికి ఒప్పుకోవడం శ్రీధర్‌కు నచ్చదు. ఓ రోజున అతను చెప్పాపెట్టకుండా వెళ్లిపో తాడు. ఎక్కడికెళ్లాడో కూడా తెలీదు. జీవితంలో తను మరో పెద్ద పొరపాటు చేశానని ఆమె చింతిస్తుంది.

తల్లిదండ్రులకు తన ప్రేమ వ్యవహారం ఉమ చెప్పదు. ఒంటరిగా బతుకుతుంది. అంతలో ఆమె జీవితం మరో మలుపు తిరుగుతుంది. ఒకనాడు రైల్లో వెళ్తుండగా ఓ బక్కచిక్కినామె ఒళ్లో ఓ పాప నుంచుకుని పెద్దగా దగ్గుతూ రక్తం కక్కుకుం టుంది. ఆమె తన పాపను ఉమ చేతికిచ్చి, ఓ ఫొటో చూపించి, అతనికి తన బిడ్డను అందజేయమని కోరుతుంది. ఆ ఫొటో రవిది. 'ఇతను నీకేమవుతాడు' అని అడుగుతుంది. 'అన్న' అని చెప్పి, ఆమె ప్రాణాలు వదులుతుంది. ఆ పాపను అనాథ శరణా లయంలో వుంచడానికి మనసు రాక, వేరే ఇల్లు అద్దెకు తీసు కుని, ఆయాను పెట్టి పెంచుతుంది. ఆ బిడ్డ నీవేనమ్మా రాధీ అని చెబుతుంది ఉమ. రవి నిన్ను ఎంతో గాఢంగా ప్రేమిస్తు న్నాడనీ, అలాంటివాడు దొరకడం నీ అదృష్టమనీ అతని మిత్రు డు మధుసూదన్ చెప్పినా నేను వినకుండా చాలా తప్పు చేశాను. ఇప్పుడు నువ్వూ అలా చేయకు. రమేష్‌ను దూరం చేసుకోకు. వాళ్ల పెద్దవాళ్లతో మాట్లాడి మీరిద్దరూ ఒకటవ్వండి అని రాస్తుం ది. శ్రీధర్ బావ రైలు ప్రమాదంలో ఓ కాలు పోగొట్టుకు న్నాడనీ, హార్వర్డులో వున్నాడనీ తెలుస్తుంది. 'బావనింక ఒంటరి వాడిని చేయనమ్మా. అతనికి సేవ చేస్తూ బతకాలని వెళ్లిపోతు న్నాను' అని రాస్తుంది. "బొంబాయిలో విమానం ఎక్కబోతున్న డాక్టర్ ఉమాదేవి 'అమ్మా' అన్న రాధిక పిలుపు విని వెనక్కి చూస్తుంది. రాధిక, రమేష్ ఆమె పాదాలకు నమస్కరిస్తారు. "విమానం బయలు దేరడానికి సిగ్నల్ ఇచ్చారు. మెల్లగా రాధిక చేతిని రమేష్ చేతిలో ఉంచి, విమానంలోకి వెళ్లిపోయింది ఉమాదేవి. మరో మలుపు తిరిగిందామె జీవితం. జీవితంలో ఎన్నో మలుపులు" అని కథ ముగిస్తుంది. ❑

# లెనిన్ గురించి 'ఒక స్వాప్నికుని కథ'


- నాగభూషణ్

**లెనిన్ గురించి ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. ప్రపంచవ్యాప్తంగా గల దోపిడీ, పీడన, అణచివేత, వంచన, వగైరా వివక్షలకు గురవుతున్న వివిధ సెక్షన్లకు చెందిన కోట్లాదిమంది జనాలకు ఆయన దేశ, కాలావధుల్ని దాటి మరీ స్ఫూర్తి ప్రదాత, స్మరణీయుడు. లెనిన్ మరణించి వంద సంవత్సరాలు దాటినా, ఆయనింకా శ్రామిక జనాల గుండెల్లో సజీవంగా నిలిచి వున్నాడు. ఇప్పటికే కాదు, ప్రపంచంలో ఇంకా ఏ రూపంలో వివక్ష నిలిచి ఉన్నా, దానికి గురయ్యే జనాల గుండెల్లో ఆయన నిలిచే ఉంటాడు.**

ప్రపంచంలో ప్రప్రథమ సోషలిస్టు రాజ్య స్థాపకునిగా మాత్రమే ఆయన ప్రాముఖ్యత పరిమితం కాదు. ఆ సోషలిస్టు రాజ్యాన్ని కమ్యూనిష్టు రాజ్యంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో ఆయన పలు అడుగులు ముందుకు వేశాడు కూడా. ఆ ప్రయత్నంలో ఉండగానే ఆయన చనిపోయాడు.

మార్క్స్ కాలం నాటికి పూర్వం ఉన్న పలువురు మేధావులు సర్వమానవుల శ్రేయస్సు కోసం పరితపించారు. అసమానతలు లేని, మానవులంతా సుఖసంతోషాలతో విలసిల్లే ఒక నూతన సమాజం కోసం వారు అన్వేషించారు. అలాంటి సమాజాన్ని ఏర్పరచడం కోసం వారిలో ఎవరికి వారు రకరకాల సిద్ధాంతాలను ప్రతిపాదించారు.

అయితే అవేవీ శాస్త్రీయ ఆధారాల మీద నిలబడేవి కానందున ఆచరణయోగ్యం కాక, కేవలం ఊహాజనిత వాదాలయ్యాయి. అలాంటి పరిస్థితుల్లో జర్మనీకి చెందిన తాత్విక మేధావి కార్ల్‌మార్క్స్ వారి భావాలు నిజం చేసేందుకు సుదీర్ఘకాలం పరిశోధనలు చేసి, తన నాటికి బాగా అభివృద్ధి చెందిన జర్మన్ తాత్విక భావాలు, ఫ్రెంచి విప్లవ సిద్ధాంతాలు, బ్రిటన్ కార్మిక పోరాటాల అనుభవాలు కలబోసి, ఒక ఆచరణ యోగ్యమైన, శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. దోపిడీ,అణచివేత లేని సమాజం కావాలంటే, సంఖ్యాధిక్యం కలిగిన బలహీన శక్తులు తమను దోపిడీ చేసే బలమైన శక్తుల్ని ఐకమత్యంగా ఢీకొనాలని,అందు కోసం అవి సాయుధ విప్లవ పోరాటం చెయ్యాలని చెప్పాడు. ఈ సిద్ధాంతం సహేతుకంగా ఉండటం వల్లనే, దీనికి మానవజాతి విముక్తి సిద్ధాంతంగా పేరొచ్చింది. ఈ సిద్ధాంతాన్ని మార్క్స్ ప్రతిపాదించడంతో, దీన్ని మార్క్సిజం అన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల్లోనే మార్క్స్ ప్రతిపాదించిన కార్మికవర్గ విప్లవం విజయం సాధిస్తుందని సోషల్ డెమోక్రాట్లు భావించారు. ఆ లెక్కన అది నాడు పరిశ్రమలు బాగా అభివృద్ధి చెంది, అక్కడి కార్మికులు రాజకీయంగా కూడా అభివృద్ధి చెందిన జర్మనీ దేశంలో మొదట ఈ విప్లవం విజయం సాధించాలి. కానీ అందుకు భిన్నంగా, పారిశ్రామికంగా వెనుకబడి ఉన్న రష్యాలో అది లెనిన్ నేతృత్వాన విజయవంతం అయింది.




**రచయిత - నాగభూషణ్**
**ధర - 500/-**
**తగ్గింపు ధర - 300/-**
**పోస్టేజ్ 70/-**
**కాపీ కోసం - 9490098654**

లెనిన్ జీవిత చరిత్ర రచన చాలా క్లిష్టమైన రచన. ఆయన జీవిత చరిత్ర ఘట్టాలు పూర్తిస్థాయిలో లిఖితమైలేవు. ఆయన ప్రచారానికి ఎల్లప్పుడూ ఆమడ దూరంలో ఉన్నాడు. అంచేత ఆయన మరణానంతరమే పార్టీ పనుపున ఆయన కుటుంబ సభ్యులు, పార్టీ కామ్రేడ్లు కొన్ని వివరాలు, స్మృతుల రూపంలో రాశారు. ఆయన తన కుటుంబ సభ్యులకు, మిత్రులకు, కామ్రేడ్లకు కూడా కొన్ని లేఖల్ని రాశాడు. వాటిలో కొన్ని నశించి పోగా, కొన్ని దొరుకుతున్నాయి. వాటివల్లే ఈ మాత్రమైనా ఆయన జీవిత విశేషాలు తెలిసే అవకాశం ఏర్పడింది. పార్టీపరంగా ఆయన మరణానంతరం ఆయన సంక్షిప్త జీవిత చరిత్ర ప్రకటించారు గానీ, దాని ద్వారా ఎక్కువ విషయాలు తెలియడం లేదు. అందుకోసం ఆయన రాసిన వివిధ రచనలు, ఆయనపై వచ్చిన వివిధ రచనలు, స్టాలిన్

రాసిన బోల్షివిక్ పార్టీ చరిత్రబీ తెలుగులో,ఆంగ్లంలో లభిస్తున్న రకరకాల సమాచారం ఆధారంగా చేసుకుని ఒక సమగ్ర పరిశోధక ప్రాజెక్టుగా ఈ గ్రంథ రచనను చేపట్టి పూర్తి చెయ్యడం జరిగింది. మొదట ఈ రచనను కేవలం ఆయన రచనలు, పార్టీ నిర్మాణం,విప్లవ విజయం, ప్రభుత్వ స్థాపన,పాలన వంటి అంశాలతో కూడిన పూర్తిస్థాయి రాజకీయ జీవిత చరిత్రగా రాయాలనుకుని ఇంతకంటే పెద్దగా ఒక బృహద్గ్రంథాన్ని సిద్ధం చేశాను. ప్రస్తుతకాలంలో ఇలాంటి భారీ రాజకీయ గ్రంథాన్ని పాఠకులు ఆదరించరేమోనన్న ఆలోచన వచ్చి, రాజకీయాంశాలు తగ్గించి, ఆయన కృషిని వివరించే 22 కథలతో కలిపి ఈ రచనను ప్రచురిస్తున్నాను. ఆయన గావించిన రాజకీయ కృషి ఆధారంగా కథలు రాయడానికి ప్రధాన ప్రేరణ ప్రసిద్ధ రష్యన్ రచయిత శ్చెద్రీన్ కాగా, కొంతవరకు 'లెనిన్ జీవిత కథ' రాసిన 'మరీయ ప్రిలెజోయెవా'. ఇంకా ఈ రచనకు అమెరికన్ జర్నలిస్టులైన జాన్‌రీడ్, ఆల్బర్ట్‌రీస్ విలియమ్స్‌ల రచనలు, కూడా కొంత వరకు ఉపకరించాయి.

ఎన్ని గ్రంథాలు, రచనలు, వెబ్‌సైట్లు ఉపకరించినా, స్వీయ పరిశోధనతో అనేక వాస్తవాంశాలను కూడా ఇందులో చేర్చాను. అంచేత ఈ రచనను 'లెనిన్ సంపూర్ణ జీవిత చరిత్ర'గా పేర్కొనడం జరిగింది. ఆయన జీవితంలో ఎదురైన 'అన్ని' అంశాలు ఇందులో ఉన్నాయనడం కూడా సత్యదూరమే. సంక్షిప్త రచనలు తెలుగులో ఉన్నందున, వాటి పరిమితిని, అలాగే దీని విస్తృతిని తెలిపేందుకే దీన్ని 'సంపూర్ణ జీవిత చరిత్ర'గా పేర్కొన్నాను. ఈ గ్రంథంలో లెనిన్ జీవితంలోని ముఖ్య ఘట్టాలు, ఆయన రచనలు సంక్షిప్త పాఠాలు, పార్టీ నిర్మాణం, విప్లవ పోరాటం, ప్రభుత్వ స్థాపన పాలన, అంతర్యుద్ధం ముఖ్య ఘట్టాలు, మూడో ఇంటర్నేషనల్ స్థాపన, ఆయన అంతిమ ఘడియలు వగైరా అంశాలన్నీ వివరంగా ఉన్నందున, ఈ రచన అభిమానులకు, సామాన్య కార్యకర్తలకు, అందరికీ కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ❑

**(ఒక స్వాప్నికుడి జీవిత కథకు రచయిత రాసుకున్న ముందు మాట నుంచి కొంత భాగం)**


# ఉద్యమాల శిఖరం ఉద్దరాజు రామం

**(37వ పేజీ తరువాయి)**

1938 జమీందారీ దుర్మార్గాలకు వ్యతిరేకంగా కాళీపట్నం రైతాంగ పోరాటం జరిగింది. వందల ఎకరాల భూమిని వశం చేసుకోవాలని రైతులకు వ్యతిరేకంగా జమీందారు నిలబడినప్పుడు పెద్ద ఉద్యమం వచ్చింది. అందులో రామం తదితరుల పాత్ర సాహసోపేతమైనది ధర్మ బద్ధమైనది. తరువాత పుచ్చలపల్లి సుందరయ్య, కొమ్మారెడ్డి సత్యనారాయణ రైతు దినోత్సవాలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంలోనూ మహాత్మాగాంధీ ఉదాత్తంగా వ్యవహరించలేదు. తనకు అందిన అరకొర సమాచారాల ఆధారంగానూ, సరైన విచారణ జరపకుండానూ హరిజన పత్రికలో ఉద్యమశీలురు ఇతరుల భూమిని ఆక్రమిస్తున్నారనే దుష్ట భావ వ్యక్తీకరణతో ఓ వ్యాసం రాశారు. ఈ పుస్తకంలోని కాళీపట్నం రైతాంగ పోరాటం రామం తదితర నేతల పాత్ర, మెంటే పూడి రైతాంగ పోరాటం వంటి శీర్షికల్లోని అంశాలు చదివితే జాతీయ రైతాంగ చరిత్ర కెక్కవలసిన ఆంధ్ర రైతాంగ పోరాట అంశాలు ఎన్నో ఉన్నాయి అనే అభిప్రాయానికి వస్తాం.

"వలస పాలకుల నుంచి దేశ విముక్తి కోసం, తర్వాత దోపిడీదార్ల నుంచి శ్రామిక ప్రజల రక్షణ కోసం రామం కష్టాలు, జైళ్లు, అజ్ఞాతవాసాలు, కుటుంబ ఇబ్బందులు ఎన్ని ఎదురైనా అకుంఠిత దీక్షతో ఆదర్శమయమైన జీవితాన్ని గడిపారు" అన్న బి.వి. రాఘవులు ఆచితూచి చెప్పిన మాటలు అక్షరాలా నిజమని ఈ గ్రంథంలోని ప్రతి వ్యాసమూ నిలబడి చెబుతుంది.

ఈ పుస్తకంలోని చిత్రాలు చరిత్రను అదృశ్యం కాకుండా చేసే రక్షక కవచాల్లా ఉన్నాయి. అమూల్యమైన అలభ్యమైన రామం జీవిత విశేషాలను ఆయన కుమారుడు పితృ ప్రేమికుడు ఉద్దరాజు బాపిరాజు, మునిమనుమరాలు సుదీక్ష జంపన, మనుమడు పద్మనాభం, మరో మనుమరాలు గాదిరాజు శారద, మనుమడు నాగార్జున రాయడం వలన పబ్లిక్ జీవితంలోనే కాదు, ప్రయివేటు జీవితంలోనూ ఆయన ఆదర్శ వ్యక్తే అని తెలుస్తోంది. ఉద్దరాజు రామం శ్రీమతి మాణిక్యాంబ భర్తకు తగిన సాధ్వీమణి అక్షరాలా. ఆమె వివిధ ఉద్యమ భాగస్వామిని, ప్రేమలేఖలు రాసుకునే వయసులోనే ఆమె, భర్త జైలు జీవితాల గురించి లేఖలు రాసుకునేవారు. దొరతనాల నిర్బంధాలను ఎన్నింటినో ఎదుర్కొన్నారు. ఆమె మహిళా ఉద్యమాల వీరనారి అయ్యారు. స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రాభిమానులకు, కమ్యూనిస్టు ప్రముఖుల జీవిత చరిత్ర అభిమానులకు, దేశ భక్తులకు ఈ పుస్తకం ఒక స్ఫూర్తిమంత గ్రంథం. ఇది చరిత్ర అవసరం తీర్చిన గ్రంథరాజం ప్రజల ఉద్యమాల శిఖరాయమాన అంశాలకు స్తవరహిత వాస్తవ సహిత గ్రంథం. ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ ఏలూరు, ప్రజాశక్తి బుక్ హౌస్ వారు గ్రంథ ప్రకాశకులు అభినందనీయులు. ❑




తేనె పూసిన వరం..!




ఉచిత సలహో..!






మీ మాటే.. మా బాట

కార్టూన్స్ : సతీష్ ఆచార్య


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 3 - Issue No : 5 February 2025




## కొత్త పుస్తకాల స్వీకారం




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.